www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 285
గురువారం | 30-1-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 4.11 తదుపరి విదియ; నక్షత్రం: శ్రవణం ఉ. 7.15, ధనిష్ఠ తె. 5.50 వరకు; వర్జ్యం: ఉ. 11.01-12.23, దుర్ముహూర్తం: ఉ. 10.36-11.21, మ. 3.05-3.50; అమృతఘడియలు: రా. 8.03-9.33; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.05
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బుధవారం మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగిన ప్రదేశంలో భీతావహ దృశ్యం



అనుకోని ఈ ఘటన
ఎంతో బాధాకరం: ప్రధాని మోదీ
అరకొర ఏర్పాట్ల వల్లే: విపక్షాలు
తీవ్ర రద్దీ.. మరో మూడు వారాలు
అయోధ్యకు రాకండి: ట్రస్టు

మహాకుంభమేళా.. చీకట్లో తొక్కిసలాట..

40 మంది దుర్మరణం

60 మందికి తీవ్ర గాయాలు.. బుధవారం తెల్లవారుజామున ప్రయాగరాజ్‌లో పెను విషాదం

'మౌని అమావాస్య' సందర్భంగా త్రివేణీ సంగమం వద్ద అమృతస్నానాల కోసం కోట్ల మంది రాక





మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో గాయపడ్డ, చనిపోయిన వారిని తరలిస్తున్న దృశ్యం

ఏర్పాట్లు సరిగ్గా లేక.. చీకట్లో దారి కనిపించక భక్తులకు ఇబ్బందులు
చెత్త డబ్బాలు తగిలి కిందపడ్డ కొందరు
వారిని తొక్కుకుంటూ ముందుకెళ్లిపోయిన మరికొందరు
ఎటుచూసినా మృతదేహాలు.. బాధితుల ఆర్తనాదాలతో భీతావహంగా ఘటనాస్థలి
25 మంది మృతుల వివరాలు గుర్తింపు
మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు
ఘటనపై న్యాయ విచారణ: సీఎం యోగి
బుధవారం ఒక్కరోజే 7.5 కోట్ల మంది అమృతస్నానాలు ఆచరించినట్టు అంచనా

మహా కుంభ్‌నగర్, జనవరి 29: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో తీవ్ర అపశ్రుతి చోటు చేసుకుంది! మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర త్రివేణీ సంగమస్థలి వద్ద బ్రహ్మ ముహూర్తంలో అమృత స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుంచీ కోట్లాది మంది భక్తులు ప్రయాగరాజ్‌కు చేరుకున్న వేళ.. అక్కడ తొక్కిసలాట జరిగి 40 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 60 మందికి పైగా గాయాలపాలయ్యారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జరిగిందీ విషాదం. ఒకవైపు అంబులెన్స్ సైరన్లు.. మరోవైపు పోలీసు వాహనాల సైరన్లు.. భక్తుల ఆర్తనాదాలు.. తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు.. అయినవారిని కోల్పోయి, తీవ్రంగా గాయపడి రోదిస్తున్నవారితో.. చిందరవందరగా పడిపోయిన సంచులు, పాదరక్షలు, బ్యాక్‌ప్యాక్‌లు, దుస్తులు, దుప్పట్లు, ఇతర వస్తువులతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారిపోయింది. అప్రమత్తమైన అధికారులు క్షతగాత్రులను అంబులెన్సుల్లో మేళా ఏరియాలో ఏర్పాటు చేసిన ఆస్పత్రికి, మృతదేహాలను మోతీలాల్ నెహ్రూ వైద్య కళాశాల

మిగతా 2వ పేజీలో...

పేదలకు పండగ

ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణకు ఓకే

150 గజాల వరకు ఉచితం.. రిజిస్ట్రేషన్ ఫ్రీ
ఆపై భూ విస్తీర్ణాన్ని బట్టి ఫీజులు
డిసెంబరు 31 వరకూ దరఖాస్తుల స్వీకరణ
2019 నుంచీ తాజా విధానం వర్తింపు
అప్పట్లో పేదలను పిండేసిన వైసీపీ
క్రమబద్ధీకరణకు భారీగా ఫీజులు
కట్టలేక అల్లాడిపోయిన నిరుపేదలు
అధికారంలోకి రాగానే కూటమి దృష్టి
నిర్దిష్ట మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ



అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మేలు చేసే మరో కీలక నిర్ణయం కూటమి సర్కారు తీసుకుంది. నివాసం కోసం పేదలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని వాటిని క్రమబద్ధీకరించాలని రెవెన్యూశాఖను ఆదేశించింది. ఈ మేరకు క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తూ రెవెన్యూశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు విధివిధానాలు, మార్గదర్శకాలను ప్రకటిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశాలు ఇచ్చారు. క్రమబద్ధీకరణ ముసుగులో ఆదాయార్జన చేయాలనుకొని జగన్ సర్కారు తీసుకొచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం పక్కనపెట్టింది. పేదలకు 150 గజాల భూమిని ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. ఇందుకోసం ఎలాంటి ఫీజులు, రిజిస్ట్రేషన్ చార్జీలూ వసూలు చేయడం లేదని జీవో నం.30లో ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత 2015లోనే భూముల క్రమబద్ధీకరణకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అనుమతి ఇస్తూ జీవో నం. 296 జారీ చేసింది. అనేక మంది పేదలకు మేలు చేసింది. జగన్ సర్కారు వచ్చాక జీవో 296ను మార్చేశారు. పేదలకు కేవలం 100 గజాల వరకే ఉచితంగా క్రమబద్ధీకరించాలని, ఆపైన ఉండే భూములకు మార్కెట్ విలువ వసూలు చేయాలంటూ జీవో 225 తెచ్చారు. ఈ జీవో

మిగతా 13వ పేజీలో...

'పంచ' గ్రామాల సమస్యకు

పరిష్కారం!

సింహాచలం దేవస్థానానికి రూ.5,300 కోట్ల విలువైన 610 ఎకరాల భూమి బదలాయింపు
జగన్ ప్రభుత్వం పట్టించుకోనందుకే సమస్య 13
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

మార్చిలోపు
లక్ష సీసీ కెమెరాలు
దేశంలోనే మొదటిసారిగా పల్నాడులో డిజిటల్ బారికేడింగ్: డీజీపీ 14



నేటి నుంచి 'వాట్సాప్ పరిపాలన'

దేశంలోనే తొలిగా రాష్ట్రంలోనే అమలు
దీని కోసం అధికారికంగా నంబర్ ఏర్పాటు
దానిని ధ్రువీకరించేలా వెరిఫైడ్ ట్యాగ్
తొలిదశలో అందుబాటులోకి 161 సేవలు
భవిష్యత్‌లో మరిన్ని ప్రభుత్వ సేవలకు విస్తరణ
వాట్సాప్ ద్వారా పలు రకాల సర్టిఫికెట్లు జారీ
ప్రభుత్వ సమాచారం కూడా చేరవేత
ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉదయం లేచిన వెంటనే ఫోన్ చూడనిదే మనకు రోజు మొదలవ్వదు. వాట్సా‌ప్‌లో ఎన్ని మెసేజ్‌లున్నాయో చూస్తాం. స్టేటస్ ఏం పెట్టాలో అని ఆలోచిస్తాం. స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారందరి దైనందిన జీవితంలో వాట్సాప్ కూడా ఓ భాగమైపోయింది. అలాంటి మాధ్యమాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు సులువుగా, సౌకర్యవంతంగా సేవలు అందించాలని

మిగతా 14వ పేజీలో...

అమరావతిపై అదే ద్వేషం



రాజధాని రోడ్లపై జగన్ పత్రిక రోత రాతలు

ప్రధాన రహదారుల టెండర్లలో గోల్‌మాల్ జరిగిందంటూ తప్పుడు ఆరోపణలు
వాస్తవాలు దాచిపెట్టి పిచ్చి రాతలు
జాతీయ రహదారులతో పోలిక పెట్టి అంచనాలు పెంచేశారంటూ అబద్ధాలు
రాజధాని రోడ్ల పునరుద్ధరణ పనులతో అనేక కాంపోనెంట్లను కలిపి టెండర్లు
వాటిలో వరద నీటి మళ్లింపు కాలువలు, నీటి సరఫరా, సీవరేజ్, యుటిలిటీ డక్ట్స్
సైకిల్ ట్రాక్, నడకదారులు, ప్లాంటేషన్, రీయూజ్ వాటర్ లైన్స్, స్ట్రీట్ ఫర్నిచర్ సైతం
వీటన్నిటికీ గంపగుత్తగా టెండర్లు పిలిస్తే..
అన్నీ దాచి రోడ్లకే పెంచారంటూ అసత్యాలు
ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణాలను అడ్డుకోవడమే అసలు ఉద్దేశం!
గతంలో జగన్ విపక్షంలో ఉన్నప్పుడూ వరల్డ్ బ్యాంకుకు తప్పుడు లేఖలు



రాజధాని అమరావతిపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి చెందిన రోతపత్రిక యథాప్రకారం విషం కక్కుతోంది. మూడు ముక్కలాటతో అమరావతిని విధ్వంసం చేసిన జగన్.. అది తిరిగి ఊపిరి పోసుకోవడమే గాక.. సంపూర్ణంగా రూపురేఖలు మార్చుకోవడం సహించలేకపోతున్నారు. జరుగుతున్న, జరగబోయే నిర్మాణ పనుల్లో అవినీతి చోటుచేసుకున్నట్లు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రపంచబ్యాంకుకు లేఖలు రాసి రుణం రాకుండా అడ్డుకున్న జగన్.. ఇప్పుడు కూడా రాజధాని అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) మంజూరు చేసిన రుణాలను రాకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణాలతో రాజధానిలో ప్రధాన రోడ్ల నిర్మాణ పనులకు, అంతర్గతంగా ఉన్న అనేక కాంపోనెంట్లకు కలిపి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ), అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ (ఏడీసీ)లు టెండర్లు పిలిచాయి. వీటిలో గోల్‌మాల్ జరిగిందంటూ జగన్ పత్రిక తాజాగా అసత్య కథనం ప్రచురించింది. రాజధానిలో పిలిచిన 11 రోడ్ల టెండర్ల ప్రక్రియ

మిగతా 12వ పేజీలో...



భళా ఏటికొప్పాక కళ

ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో ఆకట్టుకున్న ఏపీ శకటం
జ్యూరీ తృతీయ అవార్డు ప్రకటించిన కేంద్రం
ఆ రాజసానికి నెటిజన్లు కూడా ఫిదా 12
30 ఏళ్ల తర్వాత రాష్ట్ర శకటానికి కేంద్రం బహుమతి

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు 12

రాష్ట్రంలో 3 స్థానాలకు షెడ్యూల్ విడుదల
10 వరకు నామినేషన్లకు గడువు
ఆయా జిల్లాల్లో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి

నూతన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా 14

విజిలెన్స్ డీజీగా ఉన్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగింత
రేపు ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ
ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన్ను పునర్నియమిస్తూ విడిగా ఆదేశాలు

నీట్ పీజీలో లోకల్ కోటా వద్దు



ప్రతిభ ఆధారంగానే పీజీ వైద్య విద్య ప్రవేశాలు
రాష్ట్ర కోటాలో 'నివాస ఆధారిత' భర్తీ కుదరదు
రాజ్యాంగ విరుద్ధం.. ఆర్టికల్ 14 ఉల్లంఘన
దేశంలో ఎవరైనా ఎక్కడైనా చదువుకోవచ్చు
ఎంబీబీఎస్ కోర్సులకు నివాస కోటా ఉండొచ్చు
సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు
ఇప్పటికే 'నివాస' కోటాలో భర్తీ అయిన పీజీ సీట్లకు ఈ తీర్పు వర్తించదని వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. పీజీ వైద్య విద్య రాష్ట్ర కోటా (50శాతం) సీట్లను నివాస ఆధారంగా భర్తీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. నివాస ఆధారిత కోటాలో భర్తీ చేయడమంటే ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమేనని పేర్కొంది. సమానత్వ హక్కును కాలరాయడమేనని తెలిపింది. నివాస ఆధారిత రిజర్వేషన్లు ఎంబీబీఎస్ ప్రవేశాల వరకు ఆమోదయోగ్యమని, పీజీకి మాత్రం కుదరదని పేర్కొంది. పీజీలో స్పెషాలిటీ వైద్య సేవలు ఉంటాయని గుర్తుచేసింది. నీట్ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే రాష్ట్ర కోటా పీజీ సీట్లనూ భర్తీ చేయాలని బుధవారం సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉన్నట్లే ఎక్కడైనా చదువుకునే హక్కు కూడా ఉంది. మనమందరం భారత భూభాగంలో నివాసితులం. ఏ ప్రాంతం, ఏ రాష్ట్రం అనే తేడా ఉండదు. ఎక్కడైనా ఉద్యోగం, వ్యాపారం చేసుకునే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా ఉంది" అని జస్టిస్ రిషికేశ్ రాయ్, జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టిల ధర్మాసనం తేల్చి చెప్పింది. పీజీ కోర్సుల్లో నివాస ప్రాంతాన్ని ప్రతిపాదికగా తీసుకుంటే.. రాజ్యాంగంలోని 14వ అధికరణం కల్పించిన సమానత్వ హక్కును ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. రాష్ట్రాల కోటా సీట్లలో నిర్దేశిత రిజర్వేషన్లు అమలు చేసిన

మిగతా 2వ పేజీలో...

DeepSeek-R1

చాట్‌జీపీటీకి చైనా పోటీ!

సంచలనం సృష్టిస్తున్న 'డీప్‌సీక్' కృత్రిమ మేధ

అతితక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసిన చైనా ఐటీ ఇంజనీర్ లియాంగ్
చాట్‌జీపీటీ, మెటా, జెమినై, క్లాడ్ వంటి వాటికి దీటుగా పనితీరు
ఓపెన్‌సోర్స్ విధానంలో.. ఉచితంగానే అందరికీ అందుబాటులోకి
యాప్‌స్టోర్ డౌన్‌లోడ్స్‌లో చాట్‌జీపీటీని దాటి నంబర్ 1 స్థానానికి!
చైనాను ఇబ్బంది పెట్టే ప్రశ్నలకు మాత్రం సమాధానమివ్వని వైనం

అగ్గిపెట్టెల నుంచి ఐఫోన్ దాకా.. దేనికైనా చీప్ ఇమిటేషన్ తయారుచేస్తారని చైనా వాళ్లకు మాచెడ్డ పేరుంది! కానీ, చైనీయులు తక్కువ ధరలోనే నాణ్యమైన ఉత్పత్తులు కూడా తయారుచేయగలరనే విషయం చాలా మందికి తెలియదు. అందుకు తాజా ఉదాహరణ.. డీప్‌సీక్ ఏఐ! చాట్‌జీపీటీ, మెటా ఏఐ, గూగుల్ జెమినై వంటి మోడళ్లనే గట్టిగా సవాల్‌చేస్తోందిది! ఏఐ అభివృద్ధికి దిగ్గజ సంస్థలు వందల కోట్ల డాలర్లు గుమ్మరిస్తుంటే.. చైనాలో 40 ఏళ్లు కూడా లేని ఒక వ్యక్తి తన హెడ్జ్ ఫండ్ వ్యాపారం కోసం దీన్ని అభివృద్ధి చేశాడు.

11



14

ప్రతి 400 రోడ్డు ప్రమాదాల్లో
250 మంది మృతి

ఆయుధం కన్నా వాహనాన్ని జాగ్రత్తగా వాడాలి
హెల్మెట్, సీట్ బెల్ట్ వాడనందుకే మరణాలు: పెమ్మసాని

తర్వాత చదువుదాం.. ముందు రీల్స్ చూద్దాం

సోషల్ మీడియాలో మునిగితేలుతున్న పిల్లలు

14-16 ఏళ్ల వయసు వారికి స్మార్ట్‌ఫోన్లపై విస్తృత అవగాహన
దేశంలో 90 శాతం మందికి అందుబాటులో ఫోన్లు
ఏపీ గ్రామీణ ప్రాంతాల్లో 93.8 శాతం పిల్లలు ఫోన్ల వాడకం
సోషల్ మీడియా వినియోగంలో అబ్బాయిలే అధికం
యాప్ వాడకంలో ఏపీ అమ్మాయిలు ఫాస్ట్
జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికలో విస్తుగొలిపే అంశాలు



14



వందర్‌ఫుల్ 12

ఇస్రో 100వ ప్రయోగం విజయవంతం
నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్15
19 నిమిషాల్లోనే కక్ష్యలోకి నావిక్-02
దేశీయ నావిగేషన్ వ్యవస్థ మరింత బలోపేతం
రికార్డు విజయంతో ఇస్రో సరికొత్త చరిత్ర

మహాకుంభమేళాలో తొక్కిసలాట..

40 మంది దుర్మరణం!



(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చిన వారిలో కొందరికి ఎముకలు విరిగిపోయాయని.. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయని.. కొంతమంది అప్పటికే చనిపోయారని వైద్యుడొకరు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో.. బుధవారం మధ్యాహ్నం 12 గంటల దాకా మోతీలాల్ నెహ్రూ వైద్య కళాశాల ఆస్పత్రికి మృతదేహాల తరలింపు కొనసాగుతూనే ఉందని తెలిసింది. మృతుల బంధువులు ఆ ఆస్పత్రికి పెద్ద ఎత్తున చేరుకుని తమవారి మృతదేహాల కోసం సాయంత్రం దాకా ఎదురుచూశారు.

చీకటిలో కనిపించక..



మౌని అమావస్య కావడంతో పది కోట్ల మంది దాకా భక్తులు వస్తారని తెలిసినా అధికారులు ఏర్పాట్లు సరిగ్గా చేయలేదని, చీకటిగా ఉండడంతో అసలు ఎటు వెళ్తున్నామో తెలియని పరిస్థితి నెలకొందని.. తొక్కిసలాటకు అదే కారణమైందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంగమస్థలికి వెళ్లే దారిలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన చెత్తడబ్బాలు చీకటి కారణంగా కనపడకపోవడంతో కొంతమంది భక్తులు వాటిని తట్టుకుని కింద పడిపోయారని.. అప్పటికే విపరీతమైన రద్దీ ఉండడంతో వెనక వచ్చేవారు కిందపడ్డవారిని తొక్కుకుంటూ వెళ్లిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "భక్తుల్లో చాలామంది చేతుల్లో బ్యాగులు, ఇతర లగేజీ ఉంది. వారు నడిచే దారిలో పెద్ద సంఖ్యలో చెత్తడబ్బాలున్నాయి. వాటిని తట్టుకుని కొంతమంది కిందపడిపోయారు. వారి చేతుల్లో ఉన్న బ్యాగులు చెల్లాచెదురుగా పడిపోయాయి. వాటిని తట్టుకొని మరికొందరు కిందపడిపోయారు. నా కాలు కూడా ఒక డస్ట్‌బిన్‌లో ఇరుక్కుపోయింది. వెనక వస్తున్నవారిలో కొందరు యువకులు ముందున్నవారిని తోసుకుంటూ వచ్చేశారు. ఈ తొక్కిడిలో నేను కిందపడిపోవడంతో.. నా కాలికి గాయమైంది. ఎలాగోలా పైకి లేచి, కిందపడిపోయిన మా అమ్మానాన్నల్ని, మరో మహిళను కాపాడి పక్కకు తీసుకెళ్లా" అని ప్రయాగరాజ్‌కు చెందిన వివేక్ మిశ్రా అనే కంటెంట్ క్రియేటర్ అక్కడ జరిగిన విషాదాన్ని కళ్లకు కట్టారు. "మేం రెండు బస్సుల్లో మొత్తం 60 మందిమి మహాకుంభమేళాకు వచ్చాం. తెల్లవారుజామున తొమ్మిది మంది ఒక బృందంగా వెళ్తుండగా ఉన్నట్టుండి తోపులాట మొదలైంది. దాంట్లో మేం చిక్కుకుపోయాం. ఆ తొక్కిసలాటలో మాలో చాలా మంది కిందపడిపోయాం. అన్నివైపుల నుంచి జనం ఒకరినొకరు తోసుకోవడంతో మాకు అసలు తప్పించుకునే అవకాశమే లేకపోయింది. ఎలాగోలా బయటపడ్డాం" అని కర్ణాటక నుంచి వచ్చిన సరోజిని అనే మహిళ తెలిపారు. పోలీసులు సరైన ఏర్పాట్లు చేయలేదని ఆమె మండిపడ్డారు. "తోపులాటలో ఎటువెళ్లాలో తోచని పరిస్థితి. మమ్మల్ని తోసేస్తున్న చాలా మంది పెద్దగా నవ్వుతున్నారు. కనీసం పిల్లల మీదయినా దయచూపించాలని వేడుకున్నా వారు పట్టించుకోలేదు" అని ఈ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో మహిళ తనకు ఎదురైన భయానక అనుభవాన్ని వివరించారు. సామాన్యభక్తులతోపాటు వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉండడం.. భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్లను సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం కూడా తొక్కిసలాటకు కారణాలుగా చాలా మంది చెబుతున్నారు.

ఏడున్నర కోట్ల మంది స్నానాలు

మౌని అమావాస్య సందర్భంగా మహాకుంభమేళాలో ఒక్క బుధవారంనాడే సాయంత్రం 5 గంటల సమయానికి ఆరు కోట్ల మంది.. మొత్తంగా ఏడున్న కోట్ల మంది దాకా భక్తులు అమృత స్నానాలు ఆచరించినట్టు సమాచారం.

బ్యారికేడ్లు విరగ్గొట్టడం వల్లే..

చీకటి, ఏర్పాట్లు సరిగా లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని భక్తులు ఆరోపిస్తుండగా.. యూపీ సర్కారు భిన్న వాదన వినిపిస్తోంది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో కొంత మంది భక్తులు బ్యారికేడ్లను విరగ్గొట్టి అవతలివైపునకు దూసుకెళ్లడంతో.. అప్పటికే అటువైపు ఉన్నవారు వీరికింద నలిగిపోయారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహాకుంభ్ డీజీపీ వైభవ్‌కృష్ణ చెప్పడం గమనార్హం. ఈ తొక్కిసలాటలో 30 మందికి పైగా మరణించారని.. 60 మంది గాయపడ్డారని వైభవ్ కృష్ణ బుధవారం సాయంత్రం మీడియా సమావేశంలో వెల్లడించారు. మొత్తం 90 మందికి పైగా గాయపడ్డారని.. ఆస్పత్రికి తరలించేటప్పటికే వారిలో 30 మంది మరణించారని ఆయన వివరించారు. మృతుల్లో 25 మందిని ఇప్పటికే గుర్తించినట్టు చెప్పారు. వారిలో నలుగురు కర్ణాటకవాసులు, అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల భక్తులు ఉన్నట్టు చెప్పారు. క్షతగాత్రుల్లో 36 మంది ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుండగా.. మిగతావారు ప్రాథమిక చికిత్స చేయించుకుని వెళ్లిపోయినట్టు తెలిపారు. ఇక.. తొక్కిసలాటకు కారణాలపై న్యాయవిచారణకు రిటైర్డ్ జడ్జి హరీశ్‌కుమార్, మాజీ డీజీపీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ డీకే సింగ్‌తో కూడిన త్రిసభ్య ప్యానెల్‌ను నియమించినట్టు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. దీంతోపాటు విడిగా పోలీసు విచారణ కూడా జరిపించనున్నట్టు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ ఘోరం జరగడానికి గల కారణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ గురువారం ఘటనాస్థలికి వెళ్లి దీనిపై లోతైన విచారణ జరుపుతారని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం 9 నుంచి 10 కోట్ల మంది భక్తులు ప్రయాగరాజ్‌లో ఉన్నారని.. వారి భద్రతే తమకు ముఖ్యమని.. భక్తులంతా తాము ఉన్న ప్రాంతాలకు సమీపంలోని ఘాట్లలో స్నానం చేయాలని.. త్రివేణి సంగమ స్థలి వద్దకు చేరుకునే ప్రయత్నాలు చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారీగా నిలిచిపోయిన వాహనాలు

లక్నో, జనవరి 29: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాకు భక్తులు భారీగా తరలి వస్తుండటంతో ఉత్తరప్రదేశ్-మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో నిలిచిపోయిన ఈ వాహనాల్లో అనేక మంది భక్తులు చిక్కుకుపోయారు. దీంతో వీరికి ఆహారం, వసతి ఏర్పాట్లు చేసినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎక్స్ ద్వారా వెల్లడించారు. డాక్టర్ల బృందాన్ని కూడా అందుబాటులో ఉంచామన్నారు. భక్తులు ఓపికగా ఉంటూ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహాకుంభమేళాకు వస్తున్న భక్తులు ఆ తర్వాత కాశీకి ఎక్కువగా వెళ్తుండటంతో తీవ్రమైన రద్దీ నెలకొంది. కాశీ విశ్వనాథ్ మందిర్‌కు దారి తీసే మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఫిబ్రవరి 5న వసంత పంచమికి కూడా భక్తులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశముందని భావిస్తున్నారు. .



మరో 3 వారాలు అయోధ్యకు రాకండి

మహాకుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్ వస్తున్న భక్తులు సమీపంలోనే ఉన్న అయోధ్యకు తరలివెళ్తుండటంతో రామజన్మభూమి ఆలయ నిర్వాహక కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. మరో మూడు వారాల పాటు అయోధ్యలో రాముడి దర్శనం కోసం రావద్దని భక్తులకు సూచించింది. రద్దీ తగ్గాక ప్రశాంతంగా వచ్చి రామ్‌లల్లా దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయోధ్య పర్యటన వాయిదా వేసుకోవాలని సూచించింది.

సాధుసన్యాసులపై పూలవర్షం

మౌని అమావాస్య సందర్భంగా తెల్లవారుజామున అమృత స్నానం ఆచరించాల్సిన సాధుసన్యాసులు, బైరాగులు.. తొక్కిసలాటలో పలువురు మరణించడంతో ఆ ప్రక్రియను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో వారంతా ఊరేగింపుగా బయల్దేరగా.. అధికారులు హెలికాప్టర్లతో వారిపై పూలవర్షం కురిపించారు. వారంతా త్రివేణీ సంగమ ప్రాంతానికి చేరుకుని సంప్రదాయబద్ధంగా అమృత స్నానం చేశారు. అఖాడాలు పవిత్ర స్నానాలు ఆచరించడానికి చక్కటి ఏర్పాట్లు చేశారంటూ అఖిల భారతీయ అఖాడా పరిషత్ అధిపతి మహంత్ రవీంద్ర పురి ప్రశంసించారు.

ఎంతో బాధాకరం

కుంభమేళా తొక్కిసలాటపై యోగీకి మోదీ ఫోన్



న్యూఢిల్లీ, జనవరి 29: మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఎంతో బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. బాధితులకు ప్రయాగ్‌రాజ్‌లోని స్థానిక యంత్రాంగం అన్ని విధాల సహాయం చేస్తోందని ఆయన తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాట ఘటనపై పరిస్థితిని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్‌కు ఆయన పలుమార్లు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు. తొక్కిలాట ఘటన ఎంతో బాధకలిగించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన వార్త ఎంతో బాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు.

అరకొర ఏర్పాట్ల వల్లే ప్రమాదం:

అరకొర ఏర్పాట్ల వల్లే కుంభమేళాలో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డారని ప్రతిపక్షాలు కేంద్రం, యూపీలోని యోగీ ప్రభుత్వంపై ధ్వజమెత్తాయి. పాలన యంత్రాంగం సామాన్య భక్తుల గురించి కాకుండా వీవీఐపీల తరలింపుపై దృష్టిపెట్టడం వల్లే దుర్ఘటన సంభవించిందని విపక్షాలు విరుచుకుపడ్డాయి. అరకొర ఏర్పాట్లు, వీఐపీ తరలింపు, స్వంత ప్రచారంపై శ్రద్ధ చూపడం, నిర్వహణ లోపాలే ఈ ప్రమాదానికి కారణమని ఖర్గే పేర్కొన్నారు. వీవీఐపీల రాకపోకలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన యోగీ ప్రభుత్వ వైఫల్యమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. కుంభమేళాకు ప్రపంచ స్థాయి ఏర్పాటు చేశామని చెప్పిన ఆయన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలన్నారు. కుంభమేళా నిర్వహణను ఆర్మీకి అప్పగించాలని అన్నారు. కాగా, పరిపాలన యంత్రాంగం వీఐపీల భద్రత ఏర్పాట్లలో మునిగితేలుతూ బీజీగా ఉండడం వల్లే ఇంత ఘోరం జరిగిందని నిరంజనా మహామండలేశ్వరుడు స్వామి ప్రేమానంద్ పూరీ విమర్శించారు.

కుంభమేళాలో తొక్కిసలాటపై సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి

అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తొక్కిసలాట చోటుచేసుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యం కోల్పోకుండా వారికి ఓదార్పు కల్పించాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని చంద్రబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొక్కిసలాట విషయం తెలిసి ఆవేదనకు లోనయ్యానని పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇది దురదృష్టకరమైన ఘటన అని, బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి మహాకుంభమేళాకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రభుత్వ అధికారుల సూచనలను అనుసరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీట్ పీజీలోలోకల్ కోటా వద్దు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత మిగిలిన సీట్లను తప్పనిసరిగా ఆలిండియా పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషనకు, ఇప్పటికే ఆ కోటా కింద పట్టభద్రులైన వారికి ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. ఇకపై మాత్రం రాష్ట్ర కోటా పీజీ సీట్లను కూడా మెరిట్ ఆధారంగానే భర్తీ చేయాలని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా జస్టిస్ ధులియా కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాలు 'శాశ్వత నివాసం' పదానికి పర్యాయపదంగా 'నివాసం' పదాన్ని వాడుతున్నాయన్నారు. శాశ్వత నివాసం అంటే ఓ వ్యక్తి నివాసం ఉంటున్న ప్రాంతం అని కాదని స్పష్టం చేశారు. భారతీయులందరి ఒకే ఆవాస ప్రాంతమని పేర్కొన్నారు. భారతదేశంలో ఎక్కడైనా చదువుకొనే హక్కును రాజ్యాంగం మనకు కల్పించిందని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

2019 తీర్పుని సవాల్ చేస్తూ..: వైద్య విద్య పీజీ ప్రవేశాల్లో నివాసిత ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని 2019లోనే పంజాబ్ హరియాణా హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే దీన్ని కొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. హైకోర్టు తీర్పును ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. కేసు ప్రాముఖ్యత దృష్ట్యా త్రిసభ్య ధర్మాసనానికి సిఫారసు చేయగా.. తాజా తీర్పు వెలువడింది. దీంతో పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో దేశవ్యాప్తంగా పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు దక్కనున్నాయి.

గతంలోనూ విషాదాలు

1954లో అతి పెద్ద విషాదం

మహా కుంభమేళాలో తొక్కిసలాటలు గతంలోనూ జరిగాయి. అయితే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి, 1954లో జరిగిన మహా కుంభమేళా దేశ చరిత్రలోనే అతి పెద్ద విషాదాన్ని మిగిల్చింది. మౌని అమావాస్యను పురస్కరించుకుని 1954 ఫిబ్రవరి 3న అలహాబాద్(ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో పుణ్యస్నానం ఆచరించేందుకు 50 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో దాదాపు 800 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది భక్తులు నీళ్లలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. వేల మంది గాయపడ్డారు.

1986లో 200 ప్రాణాలు బలి

1986లో హరిద్వార్ వేదికగా జరిగిన కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. నాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వీర్ బహదూర్ సింగ్ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలతో కలిసి హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంగణానికి వచ్చారు. దీంతో సామాన్య ప్రజలను నదీ తీరానికి వెళ్లనీయకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాట తొక్కిసలాటకు దారి తీసి విషాదాన్ని మిగిల్చింది.

2003 నాసిక్‌లో 39 మంది మృతి

2003లో మహారాష్ట్రలోని నాసిక్‌లో కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన 39 మంది చనిపోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

12 ఏళ్ల క్రితం 36 మంది దుర్మరణం

సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2013లో మౌని అమావాస్య రోజున ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో కుంభమేళాకు వచ్చిన 36 మంది చనిపోయారు. ఈ తొక్కిసలాట ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కూలడంతో కలకలం రేగి తొక్కిసలాటకు దారి తీసింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ.. నాటి కుంభమేళా ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరించిన రాష్ట్ర మంత్రి అజామ్ ఖాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

2008లో నైనా దేవీ ఆలయం వద్ద 160 మంది

2008 ఆగస్టులో హిమాచల్ ప్రదేశ్‌లోని నైనా దేవీ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో 160 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. అమ్మవారి దర్శనానికి సుమారు 20వేల మంది భక్తులు వేచి ఉండగా.. కొండపై నుంచి రాళ్లు జారి పడుతున్నాయనే వదంతి వ్యాపించి తొక్కిసలాటకు దారి తీసింది.

సంగమ ముఖద్వారం..

ఎందుకంత కీలకం?



మహాకుంభ్ నగర్, జనవరి 29: ప్రయాగరాజ్‌లో ఉత్తర దిశ నుంచి ప్రవహించే గంగా నది, దక్షిణ దిశ నుంచి వచ్చిన యమునా నది రెండూ సంగమించే ప్రదేశం త్రిభుజాకారంలో ఒక ముక్కులాగా కనిపిస్తుంది. అందుకే దీనిని సంగమ ముఖద్వారంగా వ్యవహరిస్తారు. ఇక్కడే సరస్వతీ నది(అంతర్వాహిని) కూడా వీటితో సంగమిస్తుందని చెబుతారు. ఈ త్రివేణీ సంగమ ప్రదేశం హిందువులకు పరమ పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. మాఘ మేళాలో ఇక్కడ స్నానం చేయడానికి మనుషులతో పాటు దేవతలు, రాక్షసులు కూడా వస్తారని నమ్మిక. ఇక్కడ స్నానాలు చేస్తే పాపాలు తొలగిపోతాయని, జనన మరణ చక్రం నుంచి జీవుడికి విముక్తి లభించి, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. అదీ 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా సమయంలో ఇక్కడ స్నానాలు ఆచరిస్తే దాని ఫలితం అనంతమని బలంగా నమ్ముతారు. ఈ కారణంగా ఇక్కడ భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. వేణీ మాధవుడు స్వయంగా ఇక్కడ వెలిసినందున ఈ సంగమానికి ప్రాధాన్యం మరింత ఎక్కువ. వివిధ అఖాడాల నుంచి వచ్చిన సాధువులు సంగమ ముఖద్వారం ప్రాంతంలోనే అమృత స్నానాలు ఆచరిస్తారు. కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత డిమాండ్ ఉన్న ప్రదేశం ఇదే.

రెండు నదుల నీరు వేర్వేరు రంగుల్లో..

సంగమ ముఖద్వారం వద్ద యమునా నదిలో నీరు లేత నీలం రంగులోనూ, గంగా నదిలో నీరు కొద్దిగా బురదగానూ కనిపిస్తాయి. ఇక్కడే యమునా నది ప్రయాణం అంతమైపోయి.. గంగలో పూర్తిగా లీనమైపోతుంది. ఇక్కడినుంచి గంగానది బనారస్ దిశగా ప్రవహిస్తుంది. కుంభమేళాలో ఈ ప్రాంతాన్ని సంగమ ఘాట్‌గా గుర్తించారు. కుంభమేళా జరిగే 4వేల హెక్టార్లలో సంగమ ముఖద్వారంతో పాటు రెండు నదీ తీరాల్లోనూ అనేక ఘాట్‌లను సిద్ధం చేశారు. మొత్తం 25 సెక్టార్లుగా ఈ ప్రాంతాన్ని విభజించారు. ఇందులో 5 సెక్టార్లు సంగమ ముఖద్వారం పరిధిలో ఉన్నాయి. ఇక్కడకు అతి సమీపంలో ఉన్న సెక్టార్ 1, 2లలో పోలీసు పోస్టులు, తప్పిపోయిన వారి కోసం సహాయక కేంద్రాలు తదితర తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సెక్టార్ 3, 4 కూడా సంగమ ప్రాంతానికి దగ్గరగానే ఉంటాయి.


సామర్థ్యం 4 రెట్లు పెంపు

కుంభమేళాను దృష్టిలో ఉంచుకొని యూపీ ప్రభుత్వం ముందుగానే సంగమ ముఖద్వారం తూర్పు ప్రాంతాన్ని విస్తరించింది. గంగా నదిపై శాస్త్రి బ్రిడ్జి, సంగమ ముఖద్వారం మధ్య 26 హెక్టార్ల స్థలాన్ని అదనంగా అందుబాటులోకి తెచ్చింది. 1,650 మీటర్ల పొడవునా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక ఘాట్లు సిద్ధం చేసింది. దీంతో ఒకేసారి ఎక్కువమంది భక్తులు స్నానాలు చేసే అవకాశం లభించింది. 2019లో సంగమ ముఖద్వారం వద్ద గంటకు 50వేల మంది వరకూ భక్తులు స్నానాలు చేస్తే ప్రస్తుతం ప్రతి గంటకు 2లక్షల మందికి పైగా స్నానం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా, జనవరి 13న పుష్య పౌర్ణమి నాడు, 14న తొలి అమృత స్నానాల వేళ ఇక్కడ గంటకు 3లక్షల మంది చొప్పున భక్తులు స్నానాలు ఆచరించారు.

నిరుద్యోగులకు నెలకు రూ. 8,500

మహిళలకు ప్రతినెలా రూ.2,500.. పింఛన్ రూ.5 వేలు

ఢిల్లీలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల




న్యూఢిల్లీ, జనవరి 29: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తే కులగణన అమలు చేస్తామని, పూర్వాంచలీలకు ప్రత్యేకంగా ఓ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఏడాది పాటు నెలకు రూ.8,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అలాగే, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని, కుటుంబానికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని, ఉచిత రేషన్ కిట్లు కూడా పంపిణీ చేస్తామని, ఢిల్లీ నగరంలో 100 ఇందిరా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, రూ.5కే భోజనం అందిస్తామని, యమునా నదికి ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఆరోగ్యం, విద్య, మహిళా, మైనారిటీ, ఎస్సీ, పూర్వాంచలీ, ఎల్‌జీబీటీక్యూఐఏ అంశాలకు సంబంధించి మొత్తం 219 హామీలతో రూపొందించిన ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరాం రమేశ్‌తో కలిసి ఆ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ విడుదల చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు నెలకు రూ.5 వేల పింఛన్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33% రిజర్వేషన్, ఉద్యోగాలు చేసే మహిళల కోసం మరిన్ని హాస్టళ్ల ఏర్పాటు చేస్తామని కూడా పేర్కొంది. మరోవైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్(ఆమ్‌ఆద్మీ పార్టీ) మధ్య రహస్య పొత్తు ఉందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఇది ఢిల్లీపై డబుల్ ఆపదగా మారనుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఢిల్లీలోని కర్తార్ నగర్‌లో మోదీ 'సంకల్ప ర్యాలీ' నిర్వహించారు. ఢిల్లీ వైపు ప్రవహిస్తున్న యమునా నదిలో హరియాణా ప్రజలు విషం కలిపి ఢిల్లీవాసులను చంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కేజ్రీవాల్ నిందలు వేయడం ద్వారా హరియాణా ప్రజలతో పాటు భారతీయులందరినీ అవమానించారని మోదీ మండిపడ్డారు.

కార్మిక సంస్కరణల్లో ఏపీ ముందంజ

- రాష్ట్రానికి పెట్టుబడుల రాకతో సంక్షేమం
- రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో వాసంశెట్టి సుభాష్

న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజనరీ సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రానికి పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని, తద్వారా కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకంలో కార్మిక సంస్కరణలు 2015 నుంచే అమలు చేస్తున్నామని, వాటినే ఇప్పుడు కేంద్రం చాలావరకు అమలు చేస్తోందని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పెన్షన్లను, ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ.25 లక్షల వరకు బీమా అందిస్తున్నామని, ఇవి దేశంలోనే అత్యధికమని తెలిపారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర సాధన -2047 లక్ష్యంగా ఒక విజన్‌తో పని చేస్తున్నారన్నారని, వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్రను భాగస్వామ్యం చేసేదిశగా తగిన కార్యాచరణతో వెళుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, ఉద్యోగ అవకాశాలకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు.సీఎం చంద్ర బాబుకు పేదలు, కార్మికుల పట్ల ఉండే నిబద్ధతకు ఆయన విజనరీనే నిదర్శనమని కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయా కొనియాడారు.

లోకం తీరు



గురుకులాల్లో టెండర్ల ఆమోదానికి కమిటీ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 190 బీఆర్ అంబేడ్కర్ గురుకులాలకు హౌస్‌కీపింగ్, శానిటేషన్ సర్వీసుల కోసం టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీని, టెండర్ల ఆమోద కమిటీని ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గురుకులాల్లో మెకనైజ్డ్ కిచెన్ ఎక్విప్‌మెంట్ల కోసం, సెక్యూరిటీ సర్వీసుల కోసం ఈ టెండర్లు నిర్వహించనున్నారు.

నేటితో ముగియనున్న ఇంటర్ పరీక్ష ఫీజుల గడువు

ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష రుసుము చెల్లించేందుకు ప్రభుత్వం పొడిగించిన గడువు నేటితో ముగియనుంది. జనరల్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు తత్కాల్ స్కీం కింద రూ.3 వేలు అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు బ్యాంకుల్లో ఫీజులు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు.

ప్రత్యేక అధికారుల పాలన 6 నెలలు పొడిగింపు

» 11 పట్టణ స్థానికసంస్థలపై మున్సిపల్ శాఖ ఉత్తర్వులు

రాష్ట్రంలోని 11 పట్టణ స్థానికసంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలనను ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. శ్రీకాళహస్తి, కందుకూరు, ఆముదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి మునిసిపాలిటీలు, చింతలపూడి, వైఎస్ఆర్ తాడిగడప, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట నగర పంచాయతీలకు ఈమేరకు ప్రత్యేకాధికారుల పాలనను పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖజారియా

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అసోసియేషన్ కింద ఏపీ చాప్టర్‌కు కొత్త కార్యవర్గ కమిటీని ఐఎఫ్ఎస్ అధికారులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎఫ్ఎస్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఖజారియా, వైస్ చైర్మన్‌గా రాహుల్‌పాండే, జనరల్ సెక్రటరీగా ఎం శివ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఆర్ యశోదాబాయి, కోశాధికారిగా జె.కృష్ణప్రియ ఎన్నికయ్యారు. నూతన కమిటీని పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి అభినందించారు.

డీటీసీపీకి పట్టణాభివృద్ధి అథారిటీల తనిఖీ అధికారం

మెట్రోపాలిటన్ ప్రాంతాలు, పట్టణాభివృద్ధి అథారిటీలను తనిఖీ చేసేందుకు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)కు అధికారాలు కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అ ర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్(సవరణ)ఆర్డినెన్స్ 2025ను తీసుకొచ్చింది. ఈ ఆర్డినెన్స్ ప్రకారం పట్టణాభివృద్ధి అథారిటీల్లో పలు పనుల తనిఖీలు చేపట్టేందుకు, సాంకేతికపరమైన అంశాలను పరిశీలించేందుకు డీటీసీపీకి అధికారాలు కల్పించారు.

స్వచ్ఛాంధ్రలో శానిటేషన్ టెండర్ల ఎంపికకు కమిటీలు

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా శానిటరీ ల్యాండ్ ఫిల్ టెండర్లు ఎంపిక చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలిచ్చింది. జిల్లాల్లో శానిటరీ ల్యాండ్‌ఫిల్ చేపట్టి 15 ఏళ్ల నిర్వహణ కోసం టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ, టెండర్ ఆమోద కమిటీలను ఏర్పాటు చేశారు.

'స్త్రీనిధి' ద్వారా రుణాలు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరక్ష్యానికి గురైన వెనుకబడిన వర్గాలకు స్త్రీనిధి ద్వారా పెద్దఎత్తున రుణాలు ఇవ్వాల్సిన అవసరముందని, ఇందుకోసం స్త్రీనిధి విభాగం విస్తరణకు సిద్ధం కావాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలోని ఓ హోటల్‌లో స్త్రీనిధి వర్క్‌షాపును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్త్రీనిధి సేవాసంస్థ ద్వారా పేద ప్రజలకు రాబోయే రోజుల్లో రుణాల పంపిణీ మొత్తాన్ని పెంచుతామన్నారు. పొదుపు సంఘాలలో నిరుపయోగంగా ఉన్న నిధులను స్త్రీనిధిలో డిపాజిట్ చేసి మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలను అందించేందుకు వెలుగు 2.0లో భాగంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, స్త్రీనిధి ఎండీ జీవీ బీడీ హరిప్రసాద్, పలువురు డీజీఎంలు, 16 జిల్లాల ఏజీఎంలు, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

పొరుగు వస్త్రం కొనుగోళ్లపై ప్రభుత్వం సీరియస్

» చేనేత జౌళి శాఖ అధికారులతో సీఎంవో సమీక్ష

» అక్రమాలు జరిగినట్లు చెప్పిన సీనియర్ ఐఏఎస్

» తెలంగాణ సొసైటీల్లో కనీస వస్త్రం ఉత్పత్తి కాలేదు

» మహారాష్ట్ర వ్యాపారి తమిళనాడులో కొన్న గుట్టు రట్టు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలోని చేనేత కార్మికుల పొట్టకొట్టి కమీషన్ల కోసం పొరుగు రాష్ట్రం నుంచి లివరీ వస్త్రాన్ని కొనుగోలు చేసిన చేనేత జౌళి శాఖ అధికారులపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఏపీలో లక్షన్నరకు పైగా చేనేత మగ్గాల్లో లేని వస్త్రం తెలంగాణలోని 17 వేల మగ్గాల్లో ఎలా ఉత్పత్తి అయ్యిందని సీఎంవో ఆరా తీసింది. సొంత రాష్ట్రంలోని చేనేత సొసైటీల వద్ద ఉన్న వస్త్ర నిల్వలను పరిగణనలోకి తీసుకోకుండా తెలంగాణలోని మ్యాక్ సొసైటీల్లో కొనుగోలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముందస్తు అడ్వాన్సు చెల్లించి, సేకరణ ధర పెంచి మహారాష్ట్ర వ్యాపారి ద్వారా తమిళనాడులో సేకరించడం వెనకున్న వైనాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు సిద్ధమయ్యారు. పొరుగు రాష్ట్రంలో లివరీ వస్త్రం కొనుగోలు వ్యవహారంలో మన చేనేత సంఘాలు చేసిన ఫిర్యాదు, అందించిన ఆధారాలతో ఏపీ చేనేత జౌళి శాఖ అధికారులను సీఎంవో అధికారి ప్రశ్నించగా అక్రమాలు జరిగినట్లు సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు వెల్లడించినట్లు తెలుస్తోంది. మొత్తం వ్యవహారంలో ఆప్కో అధికారితోపాటు ఒక టెక్నీషియన్ సూత్రధారిగా ఏపీ చేనేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ బాగోతాన్ని వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసే లివరీ వస్త్రాలను తప్పనిసరిగా మన చేనేతల నుంచే కొనుగోలు చేయాలి. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేసింది. అయినా కమీషన్లకు అలవాటుపడ్డ చేనేత జౌళి శాఖ అధికారులు పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

మన సొసైటీల్లో లివరీ వస్త్రం ఉన్నా..

తెలంగాణతో పోలిస్తే మన రాష్ట్రంలో పది రెట్లు ఎక్కువ చేనేత మగ్గాలున్నప్పటికీ ఇక్కడి ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన దుప్పట్లు, తువ్వాళ్లు, బెడ్ షీట్లు పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేయడంపై నేతన్నలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మన నేతన్నల పొట్టకొట్టి..' శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆప్కో ఎండీ వివరణ ఇచ్చారు. రాష్ట్ర సంక్షేమ శాఖల అవసరాలకు సరిపడా లివరీ బెడ్‌షీట్లు మన చేనేత సొసైటీల్లో ఉత్పత్తి లేదన్నారు. అందులో వాస్తవం లేదని, చేనేత సొసైటీల్లో లివరీ వస్త్రం నిల్వ ఉన్నా పొరుగు రాష్ట్రంలోని మ్యాక్ సొసైటీల నుంచి కొనుగోలు చేయడం వెనుక అవినీతి ఉందని ఏపీ చేనేత సహకార సంఘాలు ప్రభుత్వానికి లేఖ రాశాయి. పొరుగు రాష్ట్రంలోని మ్యాక్ సొసైటీల్లో కొనుగోలు చేయడం, వాటికి మహారాష్ట్ర వస్త్ర వ్యాపారి ద్వారా తెలంగాణ మ్యాక్ సొసైటీల బిల్లులు సృష్టించి తమిళనాడు నుంచి కొనుగోలు చేసి భారీ కమీషన్లు తీసుకున్న ఆప్కో అధికారులు ఇక్కడి షోరూమ్‌ల్లో విక్రయాల్లోనూ ప్రైవేటు వస్త్రాలకు అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలోని ఆప్కో షోరూమ్‌లు, డిపోల్లోని వస్త్ర నిల్వలను విజిలెన్స్ అధికారులతో తనిఖీ చేయిస్తే రికార్డుల్లో చూపించే స్టాకు, అక్కడున్న దానికి ఏ మాత్రం పొంతన ఉండదని అంటున్నారు. ఈ వ్యవహారంలో ఒక టెక్నికల్ అసిస్టెంట్ సూత్రధారిగా ఉన్నారని, గుంటూరులో ఏకంగా నాలుగు ఇళ్లు కొనుగోలు చేసిన అతన్ని సీఐడీ అధికారులు విచారిస్తే మొత్తం గుట్టు బయట పడుతుందని చెబుతున్నారు.

పాడి రైతుల సమగ్రాభివృద్ధే 'హెరిటేజ్' లక్ష్యం

» పాడి రైతుల మహా సదస్సులో నారా భువనేశ్వరి



పీలేరులో నారా భువనేశ్వరి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హెరిటేజ్, టెక్నో సెర్వ్ ప్రతినిధులు

పీలేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉత్పత్తులు, వినియోగదారుల సంతృప్తి, పాడి రైతుల సమగ్రాభివృద్ధే తమ సంస్థ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరులోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం పాడి రైతుల మహా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలను పాడి రైతులుగా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో తమ సంస్థ ద్వారా ప్రత్యేకంగా మహిళా ఏజెంట్ల ద్వారా పాల సేకరణ కేంద్రాలు నడుపుతున్నామన్నారు. పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను ప్రోత్సహించడానికి అమెరికాకు చెందిన 'టెక్నో సెర్వ్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నామని తెలిపారు. ఆమె సమక్షంలో హెరిటేజ్, టెక్నో సెర్వ్ సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. అనంతరం భువనేశ్వరి రూ.183.5 లక్షల రుణ చెక్కును పాడి రైతులకు అందజేశారు. పలు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల కుటుంబాలకు రూ.21.45 లక్షల చెక్కులను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది మహిళా ఏజెంట్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

చాగంటికి అవమానమంటూ దుష్ప్రచారం

» 3 యూట్యూబ్ చానళ్లపై టీటీడీ కేసు

తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు తిరుమలలో అవమానం జరిగిందంటూ ప్రచారం చేసిన సోషల్ మీడియా ప్రతినిధులపై తిరుపతి యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు టీటీడీ తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దయల్ న్యూస్, పోస్ట్ 360, జర్నలిస్ట్ వైఎస్ఆర్ చానళ్ల నిర్వాహకులపై కేసు నమోదయింది. చాగంటి కోటేశ్వరరావు తిరుమల పర్యటనపై టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వాస్తవాలను వక్రీకరించి దురుద్దేశంతో అవాస్తవాలను పదేపదే ప్రచారం చేశారని టీటీడీ పేర్కొంది. ఈమేరకు ఈ మూడు యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులపై తిరుపతి యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు ఢిల్లీ, విజయవాడల్లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు కూడా ఫిర్యాదు చేశామని టీటీడీ తెలిపింది.

కేంద్రంలో కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వం

» రాజ్యాంగ స్ఫూర్తిని హరిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోంది

» సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

» అదానీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం: సీపీఐ రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా. వేదికపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ సమితి కార్యదర్శి అనీరాజా తదితరులు

విశాఖపట్నం/సీతంపేట జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా కార్పొరేట్లకు అనుకూలంగా పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. బుధవారం సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర-భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లౌకిక రాజ్యాంగ స్ఫూర్తిని హరిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని రాజా దుయ్యబట్టారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర పోషించకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన బీజేపీ నేడు అధికారంలో ఉండడం దురదృష్టమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత, భాషాప్రయుక్త రాష్ట్రాలు, ఫెడరల్ వ్యవస్థ కోసం సీపీఐ కృషి చేసిందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరిగిన తర్వాత దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొనడాన్ని ఆయన ఖండించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ వచ్చి ఉంటే కచ్చితంగా రాజ్యాంగాన్ని మార్చేసేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశాన్ని తిరోగమనం వైపు తీసుకువెళుతోందని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.మూడు లక్షల కోట్లు ఇచ్చిందని చెబుతున్నారని, అలాంటప్పుడు ఆ నిధులతో సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని రామకృష్ణ హెచ్చరించారు.

రేపు పెనుగొండ వాసవీధామ్‌కు సీఎం చంద్రబాబు

» అధికారికంగా వాసవీ మాత ఆత్మార్పణ దినం

భీమవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ వాసవీధామ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సతీ సమేతంగా సందర్శించనున్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభు త్వం నిర్ణయించింది. అందులో భాగంగానే వాసవీ మాతకు పూజలు నిర్వహించడానికి అమ్మవారి ఆత్మార్పణ రోజైన శుక్రవారం ముఖ్యమంత్రి విచ్చేస్తున్నారు. పూజల అనంతరం వాసవీధామ్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

నేటి నుంచి విశాఖలో సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు గురు, శుక్రవారాల్లో విశాఖపట్నంలో జరగనున్నాయి. వీఐపీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగే ఈ సమావేశాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతోపాటు దేశం నలుమూలల నుంచి 32 మంది కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ బలోపేతానికి భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు.

పత్తి కొనుగోలు అధికారులపై కోర్టు ధిక్కరణ పిటిషన్

» సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని ఫలితం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాటన్ జిన్నింగ్ మిల్లులు/ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయడంలేదని, అందుకు బాధ్యులైన అధికారులను శిక్షించాలంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 12కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పత్తిలో నాణ్యత లేదని, తేమ శాతం అధికంగా ఉందని పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను దోపిడీ చేస్తున్నారు. తూకాలలో కూడా తేడాలు చేస్తున్నారంటూ గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరానికి చెందిన బి.అశోక్, సీసీఐ మాజీ మేనేజర్ గుంటూరుకు చెందిన సాయి ఆదిత్య హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాల మేరకు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గుంటూరు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పత్తి జిన్నింగ్ కేంద్రాలు/ పత్తి కొనుగోలు కేంద్రాలను అనుసంధానం చేస్తూ వారం రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గుంటూరు మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిని ఆదేశిస్తూ గత ఏడాది డిసెంబరు 16న తీర్పు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంతో పిటిషనర్లు తాజాగా కోర్టుధిక్కరణ పిటిషన్ వేశారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఏపీ ఫైబర్ నెట్ ఎండీ కె.దినేష్‌కుమార్, గుంటూరు మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజబాబు, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కోర్టుధిక్కరణ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది.

మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పవన్‌కుమార్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ మెప్మాలో మిషన్ కోఆర్డినేటర్‌గా బి.పవన్‌కుమార్‌ను నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఫిషరీస్ కమిషనరేట్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్‌ను ఒక ఏడాదికి డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

విషాదం

కోట్లాదిమంది పుణ్యస్నానాలు ఆచరిస్తున్న ఆధ్యాత్మిక వేడుకలో తొక్కిసలాట జరిగి, ముప్పైమంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధకలిగిస్తున్నది. ఇటువంటి భారీఉత్సవాల నిర్వహణలో చిన్న తప్పిదం జరిగినా వందలమంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఊహకు అందని ఉపద్రవాలను, ప్రమాదాల సంభావ్యతను అంచనావేసుకొని సంసిద్ధంగా ఉండాల్సిన సందర్భాలు ఇవి.

ఇప్పటికే కొనసాగుతున్న రద్దీకి తోడు, మౌని అమావాస్య నాడు కోట్లాదిమంది అదనంగా వచ్చిచేరతారని సదరు మంచిరోజులకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న నిర్వాహకులకు తెలియనిదేమీకాదు. తొక్కిసలాటకు పురిగొల్పిన పరిస్థితులమీద విభిన్నమైన కథనాలు వినబడుతున్నాయి. ఘాట్ల వద్ద ఏర్పాటుచేసిన చెత్తడబ్బాలు చీకట్లో కనబడక కొందరు తన్నుకొనిపడిపోయారనీ, వెనక ఉన్నవారు నెత్తిమీద పెద్దపెద్దబ్యాగులతో సహా వీరిమీద పడ్డారని, పవిత్రస్నానాలకు సమయం ఆసన్నమైందన్న ప్రకటనలు మరోపక్క వినబడుతున్న హడావుడిలో ఈ మరణాలు సంభవించాయని కొన్ని కథనాలు చెబుతున్నాయి. బ్రహ్మముహూర్తానికి ముందు భక్తులు పెద్దసంఖ్యలో ఒక్కసారిగా వచ్చిపడి, కట్టుతప్పి, బారికేడ్లు ధ్వంసం చేసి, మరోదారిపట్టడంతో ఈ దారుణం జరిగిపోయిందని యూపీ పోలీసు ఉన్నతాధికారి చెబుతున్నారు. రెండునెలలకాలంలో 40కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని, ఆరు పవిత్రదినాల్లో పదికోట్లమందితో ఘాట్లు కిటకిటలాడతాయని ముందుగానే అంచనాలు ఉండగా, పెద్దపెద్ద ఘోరాలకు ఇలా చిన్నచిన్న కారణాలు చెబుతూంటే ఆశ్చర్యం కలుగుతుంది. భక్తజనం ఇంత భారీగా ఉన్నప్పుడు వారిని నియంత్రించడం, నిలువరించడం సులభమేమీ కాదు. కానీ, తగిన సదుపాయాలు, ఏర్పాట్లు చేశామంటూ విస్తృత ప్రచారంతో ప్రజలు పెద్ద ఎత్తున వచ్చేట్టుగా ప్రభుత్వాలే కృషి చేస్తున్నప్పుడు, ఆ పవిత్ర కార్యం క్షేమంగా పూర్తిచేయాల్సిన బాధ్యత మరింత ఉంది.

రాష్ట్రపతి, ప్రధాని, యూపీ ముఖ్యమంత్రి ఈ సంఘటనకు తీవ్రంగా చలించిపోయారు. ఘటన జరిగిన అనేకగంటలపాటు ఫోన్ సిగ్నల్స్ అందుబాటులో లేకుండాపోయాయని, వదంతుల వ్యాప్తిని నిరోధించడానికి ఇది జరిగివుంటుందని వార్తలు వచ్చాయి. కానీ, వాస్తవంగా జరిగిందేమిటో తెలియకపోవడం కూడా ఇటువంటి సందర్భాల్లో మరింత గందరగోళానికి, భయాలకు అవకాశం ఇస్తుంది. జరిగిన ఘటనమీద బాధను వ్యక్తపరుస్తూనే విపక్షాలు పలురకాల విమర్శలు చేస్తున్నాయి. అందులో రాజకీయం లేకపోలేదు కానీ, సామాన్యభక్త జనానికి అందుబాటులో ఉండాల్సిన ఘాట్ల సంఖ్యను కుదించడం, వీఐపీలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి విమర్శలు పూర్తిగా కొట్టిపారేయలేనివి. మౌని అమావాస్యనాడు సంగమఘాట్‌లో అమృత స్నానాలకు సామాన్య భక్తులు పోటెత్తడం సహజం. భక్తులు సంగమ ముఖద్వారం వద్దకు రావద్దనీ, సమీపంలో ఉన్న ఘాట్లలోనే స్నానాలు చేసి వెనక్కుపోవాలని సీఎంతో సహా అందరూ ఘటన అనంతరం చేస్తున్న సూచన ముందుగానే ప్రజలకు విస్తృతంగా చేరివుంటే ఈ ప్రమాదం జరిగివుండేది కాదేమో. వీఐపీలను అనుమతించలేదని పోలీసు అధికారి చెబుతున్నప్పటికీ, అధిక పాంటూన్ బ్రిడ్జీలను, మార్గాలను ముందుగానే మూసివేసి, సామాన్యజనానికి దారీతెన్నూ లేకుండా చేశారన్న విమర్శలున్నాయి. ఘటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే మార్గాలన్నీ మూసివేయడంతో అంతిమంగా అత్యధికసంఖ్యలో భక్తులు రోడ్లమీదే గంటలతరబడి నిలిచిపోవాల్సి వచ్చింది. తొక్కిసలాట బీభత్స దృశ్యాలు మనసును కలచివేస్తున్నాయి. ఆప్తులను కోల్పోయినవారు, అవయవాలు ఛిద్రమై ఆస్పత్రులపాలైనవారి వేదన తీర్చలేనిది. లక్షల్లోనూ, కోట్లలోనూ జనం చేరినప్పుడు తొక్కిసలాటలు సహజమేనని, స్వాతంత్ర్యానంతర తొలికుంభమేళా సహా పలు సందర్భాల్లో ఇంతకంటే ఎక్కువసంఖ్యలో జనం మరణించారని కొందరు వాదిస్తున్నారు. గతకాలపు విషాదాలను ఎవరు ఎందుకు ఇప్పుడు గుర్తుచేస్తారో తెలియనిదేమీకాదు. కానీ, ఈ మారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రపంచస్థాయి నిర్వహణ పద్ధతులను అమలుచేశామని చెబుతున్నందున ఇటువంటివి జరగవన్న నమ్మకం, నిర్వహణా వ్యవస్థల పట్ల విశ్వాసం ప్రజల్లో హెచ్చుతుంది. మరో మూడు పవిత్రస్నానాలతో సహా మహాకుంభమేళా అత్యంత భద్రంగా, సవ్యంగా పూర్తి కావాలని కోరుకుందాం.

దేశ ఖనిజ భవిష్యత్తుకు 'సప్తపది'

గనులు, ఖనిజాలు దేశ సంపద సృష్టికి మూలం. వేలాది సంవత్సరాలుగా భారతదేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల సంక్షేమం, దేశ భద్రతల్లో ఖనిజాల పాత్ర అత్యంత కీలకం. ప్రఖ్యాత తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త అయిన చాణక్యుడు కూడా తన అర్థశాస్త్రంలో దేశాభివృద్ధిలో ఖనిజాలు, గనుల పాత్ర ఎంత కీలకమో వివరించారు. 2500 ఏళ్ల క్రితం రాజస్థాన్‌లోని జావర్‌లో జింక్ మైనింగ్ జరిగిందని చారిత్రక ఆధారాలున్నాయి. కోహినూర్ వంటి విలువైన వజ్రాలు మన గనుల తవ్వకాల సందర్భంగా బయటపడ్డవే.

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ఖనిజ సంపదపై ప్రత్యేకమైన దృష్టి సారించలేదు. కానీ గత పదేళ్లుగా ఈ రంగానికి పునరుత్తేజం కల్పించేందుకు వివిధ చర్యలు చేపట్టాం. గనుల వేలంలో పారదర్శకతను తీసుకువచ్చి 440కు పైగా బ్లాక్స్‌ను వేలం వేశాం. దీని వల్ల దాదాపు రూ.2.7 లక్షల కోట్ల లబ్ధి రాష్ట్రాలకు చేకూరింది. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ (NMET) ద్వారా రూ.6వేల కోట్లు జమ అయ్యాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (DMF)లో లక్ష కోట్లకు పైగా నిధులు జమ అయ్యాయి. అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో, కీలకమైన ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్) దేశ భద్రతలోనూ కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ సందర్భంలో మన స్వాతంత్ర్యానికి వందేళ్లు పూర్తయ్యేనాటికి అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం జరగాలనేది ప్రధానమంత్రి మోదీ ఉక్కు సంకల్పం. ఇందుకోసం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా భద్రమైన దేశ భవిష్యత్తుకు సమ ప్రాధాన్యతనిస్తోంది. క్రిటికల్ మినరల్ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడుతూ, ఈ రంగంలో దేశ భవిష్యత్తును నిర్దేశించేందుకు 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను (NCMM) ప్రారంభించింది.

వికసిత భారత లక్ష్యాలను చేరుకోవడంలో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అత్యంత కీలకం. దేశ సుస్థిరాభివృద్ధితో పాటు, రవాణా, వ్యవసాయం, వైద్యం, ఇంధన భద్రత, సాంకేతిక పురోగతి, టెలికమ్యూనికేషన్స్, క్లీన్ ఎనర్జీ, తయారీ రంగంలో అడ్వాన్స్‌మెంట్, రక్షణ తదితర రంగాలకు క్రిటికల్ మినరల్స్ తగినంతగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

మరీ ముఖ్యంగా ప్రపంచదేశాలన్నీ క్లీన్ ఎనర్జీ వైపు, ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ఒక 'న్యూ ఆయిల్ (ప్రత్యామ్నాయం)'గా కనబడుతున్నాయి. లిథియం, కోబాల్ట్, నికెల్ వంటివి ఎలక్ట్రిక్ వాహనాల్లో, పునరుత్పాదక విద్యుత్ వ్యవస్థలో, సెమీకండక్టర్స్‌లో కీలకం. అదే ఫాస్పేట్, పొటాష్, గ్లకొనైట్ మొదలైనవి వ్యవసాయ రంగానికి అవసరం. టైటానియం, బెరీలియం వంటి ఖనిజాలు వైమానిక రంగం, రక్షణ రంగంలో చాలా కీలకం. ఇలా క్రిటికల్ మినరల్స్.. దేశ భద్రత, ఇంధన భద్రత, ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధిలో అత్యంత ప్రముఖమైన పాత్ర పోషించనున్నాయి.



భారతదేశం క్రిటికల్ మినరల్స్ కోసం పెద్ద మొత్తంలో దిగుమతులపై ఆధారపడుతోంది. దీన్ని తగ్గించుకుని, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ గనులను తీసుకుని అక్కడి నుంచి ఉత్పత్తిని పెంచుకోవడం వంటివి చాలా అవసరం. అందుకే 24 క్రిటికల్ మినరల్స్ జాబితాను నిర్దేశించుకుని, దేశీయంగా వెలికితీత, విదేశాల్లోని గనుల నుంచి సేకరణ, రీసైక్లింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మకంగా 'సప్తపది' నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోంది.



భారతదేశం క్రిటికల్ మినరల్స్ కోసం పెద్దమొత్తంలో దిగుమతులపై ఆధారపడుతోంది. దీన్ని తగ్గించుకుని, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, విదేశాల్లో క్రిటికల్ మినరల్స్ గనులను తీసుకుని అక్కడి నుంచి ఉత్పత్తిని పెంచుకోవడం వంటివి చాలా అవసరం. అందుకే 24 క్రిటికల్ మినరల్స్ జాబితాను నిర్దేశించుకుని, దేశీయంగా వెలికితీత, విదేశాల్లోని గనుల నుంచి సేకరణ, రీసైక్లింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మకంగా 'సప్తపది' నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులోని పలు అంశాలపై ఇప్పటికే పనిచేస్తున్నప్పటికీ, ఈ వేగాన్ని టాప్ గేర్‌లో ముందుకు తీసుకెళ్లేందుకు ఏడు అంశాలను నిర్దేశించుకుని పని మొదలుపెట్టనుంది.

ఈ సప్తపదిలో మొదటిది– దేశీయంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తిని పెంచడం. దిగుమతులను తగ్గించుకునేందుకు ఇదొక కీలకమైన ప్రక్రియ. భారతదేశంలోనూ గణనీయమైన ఖనిజ సంపద ఉంది. దీన్ని వెలికి తీసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) ఎక్స్‌ప్లొరేషన్ ప్రయత్నాలను వేగవంతం చేసింది. 2020–21లో GSI చేతిలో 65 ప్రాజెక్టులు మాత్రమే ఉంటే, 2025–26 నాటికి 227 ప్రాజెక్టుల్లో ఎక్స్‌ప్లొరేషన్ పనులు చేపట్టింది. దీంతోపాటుగా NMET ద్వారా ప్రైవేటు ఏజెన్సీలకు కూడా ఐదు విడతల క్రిటికల్ మినరల్స్ గనులను వేలం విషయంలోనూ ఊహించని స్పందన కనిపించింది. 10 రాష్ట్రాల్లోని 23 క్రిటికల్ మినరల్ బ్లాక్స్ కేటాయింపులు పూర్తయ్యాయి. ఇలా దేశీయంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తికి బాటలు పడటం, మన వనరులను వెలికితీయడంతోపాటుగా గ్లోబల్ సప్లయ్ చైన్స్‌పై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గిస్తాయి.

రెండో కీలకమైన అడుగు– విదేశాల్లోని కీలకమైన ఖనిజాల గనుల్లో నుంచి క్రిటికల్ మినరల్స్‌ను సేకరించడం. భారతదేశంలో లిథియం, నికెల్, కోబాల్ట్ మొదలైన కొన్ని మినరల్స్ లభ్యత తక్కువగా ఉంది. అందుకోసం ఈ ఖనిజాల లభ్యత ఎక్కువగా ఉన్న దేశాలతో ఒప్పందాలు చేసుకుని అక్కడినుంచి వీటిని సేకరించేందుకు 'కాబిల్' (ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్) అనే ప్రభుత్వ రంగ సంస్థ 2019లో ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఇప్పటికే అర్జెంటీనాతో పాటుగా వివిధ దేశాలతో ఆ దేశాల్లోని ఖనిజాల సేకరణకు ఒప్పందాలు చేసుకుని ముందడుగు కూడా వేశాం. అర్జెంటీనాలో 15,500 హెక్టార్ల పరిధిలో 5 లిథియం బ్లాక్స్‌లో ఎక్స్‌ప్లొరేషన్ ఒప్పందం జరిగింది. ఇతర దేశాల్లోనూ ఇదే విధంగా క్రిటికల్ మినరల్ బ్లాక్స్‌ను చేజిక్కించుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తున్నాం. ఇందులో ప్రైవేటు సంస్థల సహకారం చాలా కీలకం. అందుకే ఆయా సంస్థలకు కూడా పెద్దపీట వేస్తున్నాం.

మూడోది– క్రిటికల్ మినరల్స్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడమూ, విదేశాల నుంచి సేకరించడమూ ఒక ఎత్తయితే.. వినియోగం పూర్తయిన వాటిని రీసైక్లింగ్ (శుద్ధి చేసిన తర్వాత పునర్వినియోగం) చేయడం మరో కీలకమైన అంశం. రీసైక్లింగ్ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే దిశగా చేస్తున్న ప్రయత్నాలను మరో అడుగు ముందుకు తీసుకెళ్లినట్లవుతుంది.

నాలుగోది– క్రిటికల్ మినరల్స్ వినియోగానికి సంబంధించి దేశీయంగా మార్కెట్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం. దీనికి సంబంధించిన పెట్టుబడులను ఆహ్వానిస్తూ పోటీ తత్వాన్ని పెంచేందుకు NCMM దోహదపడుతుంది.

దీంతోపాటుగా క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌పై విస్తృతంగా పరిశోధనలు జరపడంతో పాటుగా సాంకేతికత పురోగతి కోసం 2031 నాటికి మూడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటుచేయడం క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఐదవది. ఈ మిషన్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో నిపుణత కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేస్తాం. ఇంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం పూర్తి స్పష్టతతో ఉంది. మొత్తం 16,300 కోట్లను కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుంది. ఇది కాకుండా ప్రైవేటు రంగం, ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వాములు చేస్తూ వారి ద్వారా మరో రూ.18 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇది కాకుండా క్రిటికల్ మినరల్స్‌ను తీసుకొచ్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఫండింగ్, ఫైనాన్సింగ్, ఇన్సెంటివ్స్ (టాక్స్ క్రెడిట్, సాఫ్ట్ లోన్స్ వంటి వాటి ద్వారా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తికి ప్రోత్సాహం కల్పించడం) వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తాం.

ఇదంతా వచ్చే ఆరేళ్ల కోసం నిర్దేశించుకున్న ప్రణాళిక మాత్రమే. ఆ తర్వాత దీన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తూ 2047 నాటికి 'వికసిత భారత లక్ష్యా'న్ని సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఆలోచిస్తోంది. వివిధ రంగాల్లో ఆధునికతను తీసుకురావడంతోపాటుగా, భవిష్యత్తులో దేశభద్రతను సునిశ్చితం చేసే ఈ క్రిటికల్ మినరల్స్ విషయంలో కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకం. ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా, ఆత్మనిర్భరతను చాటుకునేందుకు, భారతదేశ ఆకాంక్షల సాకారానికి క్రిటికల్ మినరల్ మిషన్ ఓ మైలురాయిగా నిలవనుంది.

◆ కిషన్ రెడ్డి
కేంద్ర మంత్రి

మన డేటా ప్రభుత్వం చేతుల్లో క్షేమమేనా?

బ్రిటిష్ గణిత శాస్త్రజ్ఞుడు క్లైవ్ హమ్‌బీ 2006లో "డేటా కొత్త చమురు" (Data is the new oil) అనే ప్రసిద్ధ వ్యాఖ్య చేశారు. ఆ మాట ఇప్పటికీ నిజమే. ఈ డిజిటల్ యుగంలో డేటాకు గల శక్తి, ఆర్థిక విలువ ఏమిటో క్రమంగా అందరికీ అర్థమవుతున్నది. సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, బ్యాంకింగ్, వాణిజ్యం, వినోదం తదితర రంగాలలో డేటా కీలక పాత్ర పోషిస్తున్నది. అయితే సేవల పేరుతో ప్రభుత్వాలు, కంపెనీలు ప్రజల అనుమతి లేకుండానే వారి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. పాశ్చాత్య దేశాల్లోలా భారత్‌లో డేటా దుర్వినియోగాన్ని నివారించే బలమైన చట్టాలు లేవు. ఈ లోటును పూడ్చేందుకు, పౌర సమాజం డిమాండ్‌కు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం 2023లో డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టాన్ని (డీపీడీపీ చట్టం) తీసుకొచ్చింది. ఈ చట్టం 2023 ఆగస్టు 11న పార్లమెంటు ఆమోదం పొందింది.



కొత్తగా అమలులోకి రానున్న డేటా ప్రొటెక్షన్ నియమాలు గోప్యతకు సంబంధించిన సమస్యలను మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. అస్పష్టమైన పదజాలం, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు స్వతంత్రత లేకపోవడం వంటివి ఇందులో ఉన్నాయి. సరైన సంస్కరణలు లేకుండా అమలులోకి వస్తే ఈ నియమాలు ప్రజల గోప్యతను హరించడంతో పాటు డిజిటల్ గవర్నెన్స్‌పై నమ్మకాన్ని దెబ్బతీయగలవు.

2025 జనవరి 3న సాంకేతిక – సమాచార మంత్రిత్వ శాఖ 'ది డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) రూల్స్ – 2025' పేరుతో నియమావళిని విడుదల చేసింది. ఈ నియమాలపై ప్రజలు తమ అభిప్రాయాలను ఫిబ్రవరి 18 లోపల తెలియజేయవచ్చు. అయితే ఈ డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ నియమాలను చదివినప్పుడు అవి కావాలనే ఉద్దేశపూర్వకంగా అస్పష్టంగా ఉన్నాయి అనిపిస్తుంది. ఇది అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

నిజానికి డీపీడీపీ మూల చట్టంలోనే ఈ ఉద్దేశపూర్వక అస్పష్టత కనిపిస్తుంది. అందులో "కేంద్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చు" వంటి పదజాలం తరచుగా వాడారు. చట్టంలో ఉన్న ఈ అస్పష్టత నియమావళి రూపొందాక తొలగుతుందని ఆశిస్తే– ఇప్పుడు అలా జరగలేదు.

డీపీడీపీ నియమాలు ముఖ్యమైన విధాన నిర్ణయాలను పార్లమెంట్ నుంచి ప్రభుత్వానికి బదిలీ చేస్తాయి. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో ఈ సౌలభ్యం అవసరమని ప్రభుత్వం సమర్థించుకుంటున్నది. కేసు వారీగా నిర్ణయాలను తీసుకోవడానికి ఇది అనుకూలమని చెబుతోంది. డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 36, రూల్ 22తో అనుసంధానించి చదివితే ఈ నియమం తాలూకు సౌలభ్యం స్పష్టంగా కనిపిస్తుంది. దీని ప్రకారం ప్రభుత్వం సందర్భాన్ని అనుసరించి వేర్వేరు విధాలుగా నియమాలను అమలు చేయవచ్చు. కానీ దీనివల్ల సమానత్వ భావనకు విఘాతం కలగడమే గాక, ఇది అన్యాయమైన వ్యవహారాలకు దారితీసే అవకాశాలు కూడా ఉన్నాయి.

డీపీడీపీ చట్టాన్ని అనుసరించి– కేంద్ర ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత డేటాను సేకరించగల అధికారాన్ని పొందింది. సెక్షన్ 36, రూల్ 22 ప్రకారం ప్రభుత్వం 'జాతీయ భద్రత', 'దేశ సమగ్రత', 'ప్రజా ప్రయోజనాలు' వంటి కారణాలను చూపి ప్రజల సమాచారాన్ని సేకరించవచ్చు. సరిగా నిర్వచించకుండా 'జాతీయ భద్రత' వంటి పదాలను ఉపయోగించడం వల్ల, ఈ నిబంధనను సాకుగా చూపి పౌరుల అనుమతి లేకుండానే వారి వ్యక్తిగత డేటా సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగలదు. పైగా ఇలా సేకరించమని ఇచ్చే ఆదేశాలను గోప్యంగా ఉంచే హక్కు కూడా ప్రభుత్వానికి ఉంది. దీని వల్ల పౌరులకు తమ డేటా ఎలా వాడబడుతుందో తెలిసే అవకాశం ఉండదు. ఈ సూత్రం ప్రజల గోప్యతపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఎందుకంటే ప్రభుత్వం పెద్ద మొత్తంలో డేటాను సేకరిస్తూ, సామూహిక నిఘా కార్యక్రమాలను అమలు చేయగలదు. ఈ నిబంధనల కారణంగా సంక్షేమ పథకాల అమలులో కూడా పౌరుల డేటా సేకరణ తప్పనిసరి అవుతోంది. ఇది పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కులపై ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇలా గోప్యతను ఉల్లంఘించే నిబంధనలు సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన కె.ఎస్. పుట్టస్వామి తీర్పు (2018) స్ఫూర్తికి విరుద్ధం.

డీపీడీపీ చట్టం, నియమాల ప్రకారం చట్ట ఉల్లంఘనలపై ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు, డేటా రక్షణను పర్యవేక్షించేందుకు 'డేటా ప్రొటెక్షన్ బోర్డు' ఏర్పాటు చెయ్యాలి. అయితే, బోర్డు సభ్యుల నియామక ప్రక్రియలో స్వతంత్ర పర్యవేక్షణ యంత్రాంగం ఏదీ లేదు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధికారుల ఆధీనంలో ఉంటుంది. అలాగే బోర్డు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ 'ఎలక్ట్రానిక్స్ – ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ' ఆధీనంలో పనిచేయడం కూడా బోర్డు స్వతంత్రతపై సందేహాన్ని రేకెత్తిస్తుంది. దీనివల్ల బోర్డు నిర్ణయాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే అవకాశాలు ఎక్కువ. అంతేగాక, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు ప్రత్యేకంగా ఒక ఆఫీసు లేకుండా పని చేస్తుంది. ఫిర్యాదులు కేవలం ఆన్లైన్ ద్వారా చేయాలి. ఈ కారణంగా అట్టడుగు వర్గాల ప్రజలకు ఇది అందుబాటులో ఉండదు.

డీపీడీపీ నియమాలపై ప్రస్తుతం ప్రజల అభిప్రాయాలను కోరుతూ చేపట్టిన సంప్రదింపు ప్రక్రియ కూడా పారదర్శకత విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నది. ఈ నియమాలను కేవలం ఇంగ్లీష్, హిందీలో అందుబాటులో ఉంచారు. అంతేగాక, అభిప్రాయాలను సమర్పించాలంటే ఒక ప్రభుత్వ పోర్టల్‌లో ఖాతా నమోదు చేసుకోవాలి. పైగా, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను 'గోప్య సమాచారం'గా వర్గీకరించడం వల్ల వాటి గురించి తెలుసుకునే అవకాశం లేకపోయింది. వ్యతిరేక అభిప్రాయాలపై చర్చకు అవకాశమే లేకుండా పోయింది. ఇటువంటి వ్యవహారం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుంది, పౌరుల నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది.

డేటా లోకలైజేషన్ నిబంధనలలోనూ స్పష్టత లేదు. సేకరించిన ప్రజల డేటాను పూర్తిగా దేశంలోనే నిల్వ చేయాలా? లేక విదేశాలకు బదిలీ చేయొచ్చా? ఒకవేళ చేయొచ్చు అంటే ఏ మేరకు, ఏ అంశాలలో చేయవచ్చు? అనే విషయాలపై స్పష్టత లేదు. ఫలితంగా గూగుల్, ఫేస్బుక్ వంటి పెద్ద డేటా కంపెనీలు తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొనే అవకాశం ఉంది.

ప్రభుత్వాలకు, పౌరులకు డేటా అత్యంత కీలకం. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విధానపరమైన నిర్ణయాలకు సహాయపడుతుంది. అంతేగాక, ప్రభుత్వం తీసుకున్న చర్యల పురోగతిని అంచనా వేయడంలోనూ, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలోనూ డేటా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కానీ ప్రస్తుత డేటా ప్రొటెక్షన్ నియమాలు ప్రజలకు సంబంధించిన డేటాపై కేంద్ర ప్రభుత్వానికి అవాంఛనీయమైన పెత్తనాన్ని కట్టబెడతాయని, ప్రజలకు మాత్రం వ్యక్తిగత డేటా రక్షణ పేరుతో సమాచారాన్ని అందకుండా చేస్తాయని ఆందోళన వ్యక్తమవుతున్నది.

స్థూలంగా చెప్పాలంటే డీపీడీపీ నియమాలు డేటా గోప్యతకు సంబంధించి ఉన్న సమస్యలను మరింత ఆందోళనకరంగా మారుస్తున్నాయి. అస్పష్టమైన పదజాలం, డేటా ప్రొటెక్షన్ బోర్డుకు స్వతంత్రత లేకపోవడం వంటి ఆందోళనకరమైన అంశాలు ఇందులో ఉన్నాయి. సరైన సంస్కరణలు లేకుండా అమలులోకి వస్తే ఈ నియమాలు ప్రజల గోప్యతను హరించడంతో పాటు డిజిటల్ గవర్నెన్స్‌పై నమ్మకాన్ని దెబ్బతీయగలవు. కాబట్టి డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రజల గోప్యతను కాపాడగలదని, సార్వజనిక ప్రయోజనానికి దారి తీయగలదని నమ్మకాన్ని కల్పించాలి. డేటా ప్రొటెక్షన్ బోర్డు స్వతంత్ర ప్రతిపత్తిని నిర్ధారించే మార్పులు అవసరం. అలాగే, అన్ని భాషల్లో నియమాలను అందుబాటులోకి తెచ్చి విస్తృత చర్చలు నిర్వహించాలి. అలాగే సామాజిక తనిఖీలకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి.

● చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు, లిబ్‌టెక్ ఇండియా

కాసుల గలగలలే వృద్ధికి ఉద్దీపన

ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌లో పట్టణ వినియోగాన్ని పెంచడంపై ప్రప్రథమంగా దృష్టి సారించవచ్చు. ఎగుమతులు తగ్గిన నేపథ్యంలో దేశీయ వినియోగాన్ని పెంచడం అత్యంత అవసరం. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో ఖర్చు చేయడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉండాలి. ఇందుకోసం సగటు మనిషికి కొంత ఊరట కల్పించే చర్యలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయవచ్చు. దీంతో పాటు దేశీయ ఉత్పత్తి, డిమాండ్‌ను ఉద్దీపింపచేయడం, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలందించడం వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి సారించే ఆస్కారం ఉంది.



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ శనివారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి కొత్త బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. గత కొన్నేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఏదో ఒక రకమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ వృద్ధిని నిలబెట్టుకుంటూ దాని ఫలాలు అందరికీ అందేలా చేయడం ఆర్థికమంత్రికి కత్తిమీద సాముగానే భావించాలి. గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు కొంతమేరకు క్షీణించి ప్రతికూలతలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది బడ్జెట్ ఎలా ఉండబోతోంది అన్న ఉత్కంఠ ప్రతీ ఒక్కరిలోనూ ఉంది. ప్రస్తుత వాతావరణంలో బడ్జెట్ రూపకల్పన విషయంలో ఆర్థికమంత్రి ముందు సానుకూలతలెంతగా ఉన్నాయో సవాళ్లు కూడా అంతగానే ఉన్నాయి.

ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే మన దేశంలో వృద్ధిరేటు ప్రోత్సాహకరంగా ఉండడం తొలి సానుకూలాంశం. ప్రస్తుత ప్రతికూలతల కారణంగా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో 7 శాతం వృద్ధిరేటు సాధించడం కొంచెం కష్టంగానే కనిపిస్తున్నప్పటికీ 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని ఖాయంగానే చెప్పవచ్చు. రుతుపవనాలు సానుకూలంగా ఉన్నందువల్ల గ్రామీణ వినియోగం పెరిగింది. సేవల రంగం కూడా మంచి వృద్ధిని కొనసాగిస్తోంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ వంటి అధిక విలువ గల వస్తువుల ఎగుమతులు కూడా ప్రోత్సాహకరంగానే ఉన్నాయి. సీజన్లవారీగా ఏర్పడే పరిణామాల్లో భాగంగా ఆహార వస్తువుల ధరలు అధికంగానే ఉన్నప్పటికీ సాధారణ ద్రవ్యోల్బణం మాత్రం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన 4 శాతం పరిధికి సమీపంలోనే ఉంది. దేశంలో పొదుపు రేటు 30 శాతంగా ఉంది. జీడీపీలో రుణాల నిష్పత్తి కూడా అదుపులోనే ఉంది. పన్ను వసూళ్లు కూడా అత్యంత సానుకూలంగా ఉన్నాయి. నవంబరు నాటికే బడ్జెట్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 60 శాతం మేరకు పన్ను వసూళ్లుండడం ఆదాయపు పన్ను, జీఎస్టీల్లో మంచి వృద్ధి నమోదవుతోందనేందుకు సంకేతం. ప్రజల్లో కూడా నిజాయతీగా పన్నులు చెల్లించే వైఖరి పెరిగింది. అందుకే గత రెండు మూడేళ్లుగా బడ్జెట్ లక్ష్యాన్ని మించి పన్నులు వసూలవుతున్నాయి.

సమాంతరంగా ఆర్థికమంత్రి ముందు కొన్ని పెను సవాళ్లు కూడా ఉన్నాయి. అధిక విలువ గల వస్తువుల ఎగుమతులు పెరిగినా, స్థూల ఎగుమతులు మాత్రం గణనీయంగా తగ్గాయి. ఫలితంగా దేశంలో పారిశ్రామికోత్పత్తి తగ్గింది. ప్రపంచ దేశాల్లో డిమాండు తగ్గడంతో గత ఏడాది 3.0 శాతం ఉన్న ఎగుమతుల వృద్ధిరేటు ఈ ఏడాది 2.8 శాతానికి క్షీణించింది. వారం రోజుల క్రితం గద్దెనెక్కిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆత్మరక్షణ చర్యలకు దిగుతున్నారు. తమ దేశంతో వాణిజ్య మిగులు ఉన్న దేశాల నుంచి దిగుమతులు అదుపు చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఆ జాబితాలో చైనాతో పాటు మన దేశం కూడా ఉంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దుతామని మన దేశం హామీ ఇచ్చినందువల్ల అందుకు అనుగుణంగా జరిగే సర్దుబాట్లలో అమెరికాకు ఎగుమతులు తగ్గవచ్చు. చైనా దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించినట్టయితే ఆ వస్తువులన్నింటినీ మన దేశంలో డంప్ చేయడానికి చైనా ప్రయత్నించవచ్చు. ఈ కారణంగా ఒక పక్క అమెరికాతో వాణిజ్య బంధాన్ని దృష్టిలో ఉంచుకుని సుంకాల్లో సర్దుబాటు చేసుకుంటూనే, చైనా డంపింగ్‌ను అడ్డుకునేందుకు కూడా చర్యలు చేపట్టాలి. ఇతర ప్రతికూలతల విషయానికి వస్తే బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్, రుణ వృద్ధిరేటు తగ్గింది. ఈక్విటీల్లో విదేశీ పెట్టుబడులు నిరంతరం తరలిపోతూ ఉండడం వల్ల స్టాక్‌మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ప్రభుత్వ పెట్టుబడులు కూడా గతంతో పోల్చితే తగ్గాయి. 2023–24 సంవత్సరంలో రూ.10 లక్షల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే 7–8 లక్షల కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయగలిగింది. అలాగే 2024–25 సంవత్సరంలో రూ.11 లక్షల కోట్లు లక్ష్యం అయితే చివరి లెక్క ఎంత తేలుతుందో వేచి చూడాలి. స్థూల దేశీయ పెట్టుబడుల (జీసీఎఫ్) వృద్ధిరేటు కూడా గణనీయంగా తగ్గింది. ఉదాహరణకి 8 శాతం వృద్ధిరేటు రావాలంటే జీసీఎఫ్ 40 నుంచి 50 శాతం ఉండాలి. గత ఏడాది జీసీఎఫ్ వృద్ధిరేటు 49 శాతం ఉంటే ఈ ఏడాది ఇప్పటివరకు 5.4 శాతం మాత్రమే ఉంది. నగరజీవులపై ద్రవ్యోల్బణ ప్రభావం, పన్ను భారం కారణంగా వారు చేసే వ్యయాలు గణనీయంగా తగ్గాయి.

ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌లో పట్టణ వినియోగాన్ని పెంచడంపై ప్రప్రథమంగా దృష్టి సారించవచ్చు. ఎగుమతులు తగ్గిన నేపథ్యంలో దేశీయ వినియోగాన్ని పెంచడం అత్యంత అవసరం. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో ఖర్చు చేయడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉండాలి. ఇందుకోసం సగటు మనిషికి కొంత ఊరట కల్పించే చర్యలకు ఆర్థికమంత్రి పెద్దపీట వేయవచ్చు. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) శ్లాబ్‌లలో కొన్ని సర్దుబాట్లు చేసే ఆస్కారం ఉంది. ప్రస్తుతం ఉన్న శ్లాబ్‌లకు అదనంగా మరో శ్లాబ్ పెట్టే ఆస్కారం ఉన్నదని వినిపిస్తోంది. ప్రస్తుతం 20 లక్షలు దాటితే తదుపరి శ్లాబ్ 30 లక్షలుగా ఉంది. ఈ రెండింటికీ మధ్య 25 శాతం శ్లాబ్ ఒకటి ప్రవేశపెట్టవచ్చు. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్స్ కూడా పెంచవచ్చు. అలాగే అన్ని రకాల బీమా పాలసీలపై మినహాయింపు పరిమితులు పెంచాలని దీర్ఘకాలికంగా డిమాండు చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ఇందుకు కూడా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది. అలాగే బీమాపై జీఎస్టీ రేటు తగ్గించాలనే డిమాండు కొన్నేళ్లుగా వస్తోంది. దీనికి కేంద్రం సానుకూలంగానే ఉన్నా రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యతిరేకతల కారణంగా ఈ ప్రతిపాదన జీఎస్టీ కౌన్సిల్ వరకు వెళ్లి వాపసు వస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో దానిపై ఒక విధాన నిర్ణయం ప్రకటించవచ్చు. ఈ చర్యలతో ప్రజల చేతిలో ఖర్చు చేయదగిన నగదు నిల్వ పెరుగుతుంది.

అలాగే ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లలో ఆటుపోట్లను దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులపై దీర్ఘకాలిక లాభాల పన్ను (ఎల్‌టీసీజీ), సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) తగ్గించవచ్చు. కొవిడ్ అనంతర కాలంలో దేశీయంగా రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య పెరిగింది. విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నప్పటికీ మార్కెట్ నిలదొక్కుకోవడానికి ఇది సహాయకారి అయింది. అందువల్ల వీరిని ప్రోత్సహించే చర్యలు బడ్జెట్‌లో తీసుకోవడం తప్పనిసరి. నానాటికీ తీసికట్టుగా ఉన్న రూపాయి విలువను కాపాడేందుకు మరిన్ని ఎగుమతి ప్రోత్సాహకాలు కూడా కల్పించవచ్చు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం మౌలిక వసతులపై పెట్టుబడులు పెంచుతూ వస్తోంది. ఇదే వరుసలో ఈసారి కూడా మౌలిక వసతులపై పెట్టుబడులు పెంచవచ్చు. దేశంలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ మౌలిక వసతులకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇవ్వవచ్చు. పారిశ్రామికోత్పత్తిని పెంచడం లక్ష్యంగా కొత్తగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ఆదాయపు పన్ను ప్రోత్సాహకాలు తిరిగి ప్రవేశపెట్టే ఆస్కారం ఉంది. గతంలో ఇలాంటి కంపెనీలకు 80(ఐ), 80(జె) వంటి సెక్షన్ల కింద ప్రోత్సాహకాలిచ్చేవారు. దేశీయంగా వస్తూత్పత్తిని పెంచి పారిశ్రామిక రంగాన్ని ఉత్తేజితం చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) 14 రంగాలకు వర్తిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో మరిన్ని రంగాలకు పీఎల్ఐని విస్తరించవచ్చు. పీఎల్ఐ అమలు గడువును కూడా పెంచవచ్చు.

శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి విలువైన విదేశీమారక ద్రవ్యం ఆదా చేసే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా విద్యుత్ వాహనాలు, సోలార్ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించే ఆస్కారం ఉంది. ద్విచక్ర వాహనాల్లో ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగించేందుకు కూడా ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. ఇందుకోసం ద్విచక్ర వాహనాల ఇంజన్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇలా ఇంజన్‌లో మార్పులు చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలందించే ప్రకటన బడ్జెట్‌లో ఉండవచ్చు. అంతే కాదు, వివిధ వస్తువులపై కస్టమ్స్ సుంకాలు ఎలా ఉన్నాయి అన్నది సమీక్షించి బడ్జెట్‌లో వాటిని హేతుబద్ధం చేయవచ్చు.

ప్రస్తుతం ఏఐ (కృత్రిమ మేధ) అనేది అందరి నోళ్లలో నానుతున్న పదం. ఏఐ ఆధారిత హెల్త్‌కేర్, భిన్న రంగాల్లో ఏఐ వినియోగం వంటివి ప్రోత్సహించడం కోసం ఏఐ ఆధారిత పెట్టుబడులపై ప్రోత్సాహకాలు కల్పించే విధానం కూడా బడ్జెట్‌లో ప్రకటించవచ్చు. భారతీయ రైల్వేలు, లాజిస్టిక్స్ వంటి విభాగాలపై కూడా పెట్టుబడులు పెంచే ఆస్కారం ఉంది. లాజిస్టిక్స్ రంగంలో మన దేశ పోటీ సామర్థ్యం పెంచడం అత్యంత అవసరం. అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మరో కీలక రంగం రియల్ ఎస్టేట్. ఈ రంగంలో కొద్దికాలంగా స్తబ్ధత ఆవరించి ఉంది. ఇటీవల కాలంలో మధ్యతరగతి ఇళ్లకు డిమాండు గణనీయంగా పెరిగింది. ఇప్పుడిప్పుడే లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లు కూడా వేగం అందుకుంటున్నాయి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని రియల్టీ రంగానికి కూడా కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించవచ్చు. గత మూడు, నాలుగు సంవత్సరాల బడ్జెట్లు చూసినట్టయితే వ్యవసాయం, డ్రోన్ల వినియోగం, పంటల అనంతర నష్టాల అదుపు వంటి వాటిపై అధికంగా విధాన నిర్ణయాలు ప్రకటిస్తున్నారన్న విషయం అర్థమవుతుంది. అలాగే సహకార రంగాన్ని కూడా ప్రోత్సహించే చర్యలుండవచ్చు. మొత్తం మీద కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం సగటు జీవికి ఊరట కల్పించే చర్యలతో పాటు దేశీయ ఉత్పత్తి, డిమాండ్‌ను ఉద్దీపింపచేయడం, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలందించడం వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి సారించే ఆస్కారం ఉంది.



■ కె. నరసింహమూర్తి
ఆర్థికవేత్త, బ్యాంకింగ్ నిపుణుడు



పట్టుబడిన నగదుతో తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు

ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్, వీఆర్వో

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా..

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

కంచికచర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవి లంచం తీసుకుంటూ బుధవారం రాత్రి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. పాసు పుస్తకాలకు సంబంధించి ఒక కౌలు రైతు నుంచి లంచం తీసుకుంటూ ఆమె ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. మండలంలోని నక్కలంపేటకు చెందిన కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు తన యజమాని పొలం వన్‌బీ అడంగల్‌లో నమోదు చేసి, పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసి, కొద్ది రోజుల క్రితం రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. పాసుపుస్తకం కోసం తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు లక్ష రూపాయలకు పైగా నగదు డిమాండ్ చేశారు. పెద్దమొత్తం కావటంతో అంత ఇవ్వలేనని చెప్పటంతో చర్చల అనంతరం పాసుపుస్తకాలు ఇచ్చేందుకు రూ. 30 వేలకు అంగీకరించారు. దీంతో సదరు కౌలు రైతు విజయవాడ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి ఇక్కడ వచ్చిన ఏసీబీ అధికారులు ఒక పథకం ప్రకారం వల పన్నారు. కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు రాత్రి రెవెన్యూ కార్యాలయంకు వచ్చి వీఆర్వో రామారావు, తహసీల్దార్ జాహ్నవికి రూ. 30 వేలు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ విజయవాడ రేంజ్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సీఐలు సత్యనారాయణ, సురేష్ రెడ్‌హ్యాండెడ్‌గా తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావును పట్టుకున్నారు. వారి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, తహసీల్దార్, వీఆర్వోను అదుపులోకి తీసుకున్నారు. గతంలో మాజీ మంత్రి జోగి రమేష్ ఆయన తనయుడు అగ్రిగోల్డ్ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో కూడా అప్పట్లో విజయవాడ రూరల్ తహసీల్దార్‌గా ఉన్న జాహ్నవిపై కేసు నమోదు కావటం గమనార్హం.

మధుర మామిడికి.. మంచు దెబ్బ!



6లో

గుడివాడలో.. టీ ట్యాక్స్!


గుడివాడలో అన్నింటికీ టీ ట్యాక్స్ చెల్లించాల్సిందే. టీ ట్యాక్స్ అంటే తులసి ట్యాక్స్. తులసి అంటే ఒక చట్టవ్యతిరేక శక్తి. గుడివాడలో తులసి దళం చేసిన అకృత్యాలు అన్నీ, ఇన్నీ కావు. మద్యం, ఇసుక, రేషన్ బియ్యం, కాంట్రాక్టుల సిండికేట్లన్నీ తులసి దళం గుప్పెట్లోనే. బినామీలతో మద్యం దుకాణాలు, రైతు బజార్లలో దాదాగిరీ చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ప్రశ్నిస్తే సొంత పార్టీ వారైనా సరే .. అసభ్యకర ట్రోలింగ్స్‌తో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వంటి వి కృతక్రీడలతో పాటు..ప్రశ్నించే గొంతుకలపై వేధింపులు, దాడులకు పాల్పడటం ఇలా చెప్పాలంటే తులసిదళం అరాచకాలెన్నో. రాజ్యాంగేతర శక్తిగా మారిన తులసి దళం అరాచకాలపై ప్రత్యేక కథనం..

తవ్వినకొద్దీ తులసి దళం అరాచకాలు వెలుగులోకి..

ఇసుక, బుసక, మట్టి, గ్రావెల్ తోలాలంటే ట్యాక్స్ కట్టాల్సిందే!

- రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పనులు ఇలా ఏ పనైనా సరే వాటాలు ఇవ్వాల్సిందే..
- మద్యం, రేషన్ మాఫియా సిండికేట్లతో అవినీతి సామ్రాజ్యం
- యథేచ్ఛగా అరాచకాలు.. ప్రశ్నిస్తే దాడులు

(ఆంధ్రజ్యోతి-గుడివాడ): కామేపల్లి తులసిబాబు. గుడివాడలో ఈ పేరు తెలియని వారు లేరు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగానూ తులసిబాబు గురించి చర్చ నడుస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ-6గా రిమాండ్ ఖైదీగా ఉన్న తులసిబాబు ఏడు నెలల్లో గుడివాడ నియోజకవర్గ ప్రజలను ఏడు చెరువుల నీళ్లు తాగించాడు. గుడివాడలో తులసి దళం సాగించిన అకృత్యాలు అన్నీఇన్నీ కావు. అసాంఘిక శక్తులు, రౌడీ గ్యాంగులను వెంటేసుకుని సెటిల్‌మెంట్లు, దందాలతో తులసి దళం రెచ్చిపోయింది. మద్యం సిండికేట్ పేరుతో బెదిరింపులు, బినామీలతో మద్యం దుకాణాల ఏర్పాటు, అక్రమ మట్టి తరలింపు, ఇసుక దొంగతనం, రైతు బజారులో దందా, రేషన్ బియ్యంలో కమీషన్లు, ఆజ్ఞలను అతిక్రవిస్తే సొంత పార్టీ వారిని సైతం వదలకుండా వ్యక్తిత్వహననానికి పాల్పడటం వంటి వాటితో పాటు గుడివాడ నియోజకవర్గంలో టి ట్యాక్స్‌ను అమలు చేస్తున్నాడు.



తులసి ట్యాక్స్ అమలు ఇలా :

- గుడివాడ మండలంలో రహదారుల నిర్మాణ పనుల్లో తులసి ట్యాక్స్‌ను అమలు చేశారు. ముఖ్యంగా కాంట్రాక్టర్ ఎవరైనా కప్పం కట్టాల్సిందేనని హెచ్చరికలు జారీ చేశారు. బిల్లును బట్టి లక్షల్లో ట్యాక్స్‌ను వసూలు చేశారు. ఇటీవల ఒక రహదారి నిర్మాణ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించి, వచ్చిన బిల్లులో తన కమీషన్‌గా రూ.2లక్షల టీ ట్యాక్స్‌ను వసూలు చేశారు.



- టిడ్కో కాలనీలో ఎవరైనా వ్యాపారాలు పెట్టుకోవాలంటే ఖచ్చితంగా తులసి ట్యాక్స్ చెల్లించాల్సిందే. వ్యాపారాన్ని బట్టి రూ.5వేలు నుంచి రూ.20వేలు వరకు చెల్లించాలి. ఆజ్ఞలను పాటించని వారిపైకి మున్సిపల్ అధికారులను పంపి షాపులను సీజ్ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డారు.
- ఎండ బాలయ్య అనే వ్యక్తి కిందటి వైసీపీ ప్రభుత్వంలో గుడివాడ మండలం బొమ్ములూరు దగ్గర వ్యాపార నిమిత్తం వైసీపీ నాయకుడి స్థలాన్ని లీజుకు తీసుకున్నాడు. ఎన్నికల కోడ్ రాకముందే భారీ స్థాయిలో ఇసుకను డంప్ చేసుకున్నాడు. తులసి దళం రంగప్రవేశం చేసి టీ ట్యాక్స్ చెల్లించాలని లేకపోతే 12 లారీల ఇసుకను కప్పంగా చెల్లించాలని హుకుం జారీ చేసింది. సీజ్‌లో ఉన్న డంప్‌కు యజమాని ద్వారానే తాళాలు తీయించి 200 టన్నుల ఇసుకను తరలించుకు పోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు.
- ఒక విద్యాసంస్థ అధినేతతో కలిసి నియోజకవర్గంలోని ప్రైవేటు విద్యా సంస్థల స్థాయిని బట్టి ట్యాక్స్ వసూలు చేసినట్లు సమాచారం. ప్రముఖ విద్యాసంస్థపైన ఇదే విధంగా తులసిదళం బెదిరింపులకు పాల్పడింది. విద్యాసంస్థల అధినేత రాష్ట్ర మంత్రి ఒకరి దృష్టికి తీసుకువెళ్లగా వివాదం సదుమణిగింది.
- నియోజకవర్గంలో ఇసుక, బుసక లారీల లావాదేవీలు నెరపాలంటే కప్పం చెల్లించాల్సిందే. బుసక లారీకి రూ.500, ఇసుక లారీకి రూ.1000 కప్పం కట్టాల్సిందే. లేని పక్షంలో పోలీస్, రవాణా అధికారులను పంపి లారీలను సీజ్ చేయించారన్న ఫిర్యాదులు ఉన్నాయి.
- బిల్డర్లు ఎవరైన మిగతా 6లో..

రైతు బజార్లలో రాజకీయ రాబందులు!

రాజకీయ రాబందులు రైతు బజార్లలో వాలిపోతున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రైతుబజార్‌ను పంచుకుంటున్నాయి. తాము చెప్పినట్టుగానే వ్యవస్థ నడవాలని హుకుం జారీ చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటను అమ్ముకోనివ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. రైతు వారీ షాపుల కార్డుల రెన్యువల్ దగ్గర నుంచి అక్కడ విక్రయించే కూరగాయల వరకు అన్నీ ఈ రాబందులు చెప్పినట్లే జరగాలంటున్నాయి. ఒక్కో రాజకీయ రాబందు ఒక్కో రాజకీయ నాయకుడి పేరుతో రైతుబజార్లలోకి చొరబడుతున్నాయి. వీటి వేధింపులు తట్టుకోలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అడ్డుకోవాల్సిన ఈవోలు రాజకీయ రాబందులకు వంతపాడుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ నేతల పేర్లు చెప్పి రైతు బజారుల్లోకి చొరబాటు

రైతు వారీ షాపుల రెన్యువల్‌కు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు వసూలు

- కూరగాయల కొనుగోళ్లపై వ్యాపారులకు ఆంక్షలు.. ఆపై నగదు వసూలు
- అడ్డుకోవాల్సిన ఈవోలకు దళారులతో దోస్తీ!
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లాలో సుమారుగా 12 రైతుబజార్లు ఉన్నాయి. ప్రతి రైతుబజార్లో శాశ్వత దుకాణాలు, రైతు వారీ దుకాణాలు ఉంటాయి. విభిన్న ప్రతిభావంతులు, డ్వాక్రా సంఘాలు, రైతు సొసైటీలకు శాశ్వత దుకాణాలను కేటాయిస్తారు. ఇవి కాకుండా పండించిన పంటలను నేరుగా రైతుబజార్లలో విక్రయించుకునేందుకు రైతులకు రైతు వారీ దుకాణాలను ఇస్తారు. జిల్లాలో ఉన్న రైతు బజార్లలో 513 శాశ్వత దుకాణాలు, 1,000 రైతు వారీ దుకాణాలున్నాయి. రైతు



వారీ షాపులను నిర్వహించుకునే వారికి మార్కెటింగ్ శాఖ కార్డులను జారీ చేస్తుంది. ఈ కార్డులను ప్రతి మూడు నెలలకు ఒకసారి రెన్యువల్ చేయాలి. ఈ ప్రక్రియను సంబంధిత రైతు బజార్ల ఈవోలు నిర్వర్తిస్తారు. దీనిలోకి రాజకీయ దళారులు చొరబడుతున్నారు. రెన్యువల్‌కి ఒక్కో కార్డుకు రూ.20 వేల నుంచి 30వేలు మిగతా 6లో..

సరుకు మాది.. అమ్మకం మీది!

రైతు బజార్లలోని వ్యాపారులు కూరగాయలను హోల్‌సేల్ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తారు. రైతులు తమ పొలాల్లో పండించిన పంటలను ఇక్కడ విక్రయించుకుంటే కొంతమంది వ్యాపారులు మాత్రం హోల్‌సేల్ మార్కెట్ నుంచి సరుకులు తెచ్చుకుని వ్యాపారం చేస్తుంటారు. అయితే కూరగాయలను తమ వద్ద కొనుగోలు చేయాలని దళారులు వ్యాపారులను బెదిరిస్తున్నారు. తాము సరఫరా చేసిన సరుకు మాత్రమే రైతు బజార్లలో అమ్మకాలకు ఉండాలని ఒత్తిడి చేస్తున్నారు. తమను కాదని బయటి మార్కెట్ నుంచి కూరగాయలు కొనుగోలు చేస్తే బస్తాకు రూ.50 జరిమానా విధిస్తున్నారు. ఇలా ఒక వ్యాపారి రోజుకు ఎన్ని బస్తాల కూరగాయలను అమ్మితే అన్ని రూ.50లను దళారులకు చెల్లిస్తున్నారు. రోజురోజుకు ఈ దళారులు రైతు బజార్లలో పేట్రేగిపోతున్నారు. కట్టడి చేయాల్సిన ఈవోలు దళారుల వెనుక ఉన్న రాజకీయ గుర్తులను చూసి మౌనం వహిస్తున్నారు. వాళ్లతో వివాదాలు ఎందుకులే అని భావించి దళారులతోనే స్నేహ బంధాన్ని నడుపుకుంటున్నారు. ఫలితంగా రైతుబజార్ మీద వచ్చిన ఆదాయాన్ని చెరిసగం చేసుకుంటున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 3న నోటిఫికేషన్

10న నామినేషన్ల స్వీకరణ.. 11న పరిశీలన

- 27న పోలింగ్.. మార్చి 3న ఓట్ల లెక్కింపు
- షెడ్యూలు విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- మార్చి 29తో ముగియనున్న ఎమ్మెల్సీ పదవీకాలం

మచిలీపట్నం, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పదవీకాలం ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూలును విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 10వతేదీలోగా అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేయాల్సి ఉంది. 11న నామినేషన్‌ల పరిశీలన ఉంటుంది. 13వతేదీ వరకు నామినేషన్‌లను ఉపసంహరించేందుకు అవకాశం కల్పించారు. 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేస్తారు. మార్చి 8వ తేదీ నాటికి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేస్తారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు కొనసాగుతున్నారు.



నానో యూరియా!

రబీ సీజన్‌లో రైతుల ఇక్కట్లు!

- మార్క్‌ఫెడ్ నుంచి సకాలంలో అందని యూరియా
- అదే అదనుగా సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

6లో



రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

- మంత్రి కొల్లు రవీంద్ర

8లో

కోర్టు తీర్పు ఆనందం కలిగించింది

- ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ

8లో

రైల్వే హబ్‌గా బెజవాడను తీర్చిదిద్దుదాం

- జిల్లా సమన్వయ సమావేశంలో ఎంపీ శివనాథ్

8లో

రెండు రోజులే గడువు..

1 నుంచి పెరగనున్న భూముల ధరలు

- ఎనీవేర్ డాక్యుమెంట్ల పరిశీలనలో జాప్యం చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు
- 48 గంటల వరకు లభించని ఆమోదం
- రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని ప్రజల్లో ఆందోళన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భూముల ధరలు పెరగటానికి మరో రెండు రోజులే సమయం మిగిలి ఉండటంతో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు పెద్ద సంఖ్యలో సాగుతున్నాయి. ముఖ్యంగా ఎనీవేర్(ఎక్కడైనా) రిజిస్ట్రేషన్లకు డిమాండ్ ఏర్పడింది. దూరబారాన ఉన్న వారు తమ దగ్గర ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో ఇటీవల కాలంలో పలు మార్పులు చేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దరఖాస్తు వచ్చినపుడు దాని మాతృక ఎక్కడో అక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళుతుంది. గంటలోపు అక్కడి సబ్ రిజిస్ట్రార్ దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ డాక్యుమెంట్‌ను పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే ఓకే చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం 48 గంటల సమయం ఇచ్చారు. దీంతో ఎనీవేర్ కింద పెట్టుకున్న డాక్యుమెంట్స్ విషయంలో సబ్‌రిజిస్ట్రార్లు 48 గంటల సమయం ఉంది కదా అని తాత్సారం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఈ ఇబ్బంది పెద్దగా ఎవరికీ తెలియలేదు. బహిర్గతం కూడా కాలేదు. ప్రస్తుతం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల ధరలు పెంచుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయన్న ఉద్దేశంతో లావాదేవీలు ఒక్కసారిగా పెరిగాయి. ఇలా పెరిగిన రిజిస్ట్రేషన్లలో చాలా వరకు ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. త్వరగా లావాదేవీలు అవుతాయన్న కారణంతో ఎక్కువ మంది ఎనీవేర్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్నారు. ఎనీవేర్‌లో వచ్చిన డాక్యుమెంట్లను సబ్‌రిజిస్ట్రార్లు పక్కన మిగతా 6లో..

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

రైల్వేతో ముడిపడిన నగరాభివృద్ధి ప్రాజెక్టులకు ముందడుగు

డీఆర్ఎం, కలెక్టర్, కమిషనర్ ఒక్కటిగా భేటీ

- కమిటీ సమావేశానికి చొరవచూపిన ఎంపీ చిన్ని
- పదేళ్ల తర్వాత డీఆర్ఎంతో జిల్లా, నగర అధికారుల భేటీ
- రైల్వే ఆక్రమణలపై సహకరించాలని డీఆర్ఎం విజ్ఞప్తి
- రైల్వే బకాయిలు విడుదల చేయాలని కోరిన కమిషనర్

8లో


పొగమంచుతో మల్లవల్లి మామిడి తోటలు.. మాడిపోయిన పూత, రాలిన పిందెలు

మధుర మామిడికి.. మంచు దెబ్బ!

మాడిపోతున్న పూత, రాలుతున్న పిందె



వాతావరణ మార్పులతో రైతుల్లో కలవరం మామిడిరైతును మంచు వణికిస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో పూతతో కళకళలాడుతూ మామిడి తోటలు రైతుల్లో ఆశలు నింపాయి. అంతలోనే వారి ఆశలు మంచు రూపంలో అవిరయ్యాయి. మంచు దెబ్బకు పూత మాడి.. పిందెలు రాలిపోవడంతో రైతులకు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మంచు ఇలాగే కొనసాగితే మామిడిపై ఆశలు వదులు కోవల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్‌రూరల్)

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది.. రైల్వేకు కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చిపెట్టే నూజివీడు, బాపులపాడు మండలాల్లోని మామిడిరైతు ఈ ఏడాది వాతావరణ మార్పులతో తల్లడిల్లుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ సహాయ నిరాకరణ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మామిడి రైతును పొగమంచు తీవ్రంగా దెబ్బతీస్తోంది. అయిల్‌పామ్ వలే ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్ప మామిడితోటలు వేసేందుకు రైతులు అసక్తి చూపడంలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గతంలో 20వేల హెక్టార్లకు పైగా ఉండే మామిడితోటలు 8వేల హెక్టార్లకు పడిపోయాయి. వాతావరణ పరిస్థితులు, ప్రోత్సాహం కరువవడంతో ఉన్న తోటలను తీసివేసి ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మామిడికాయ లభ్యమవడమే కష్టమన్నారు.

● కాపు నిలబడితే చాలు..

ఈ సంవత్సరం పూత ఆలస్యమైనా బాగా వచ్చిందని, కానీ మంచు దెబ్బకు మాడి, పిందె దశలో ఉన్న కాయలు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కాపు నిలబడితే అదే పదివేలన్నారు. కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి ఎంతవరకూ వస్తుందనేది అంచనా వేయలేకపోతున్నామని, మంచు దెబ్బకు కాయ సైజు తగ్గడంతో మార్కెట్‌లో రేటు పలకదని, ముందస్తు కొనుగోలు చేసే వ్యాపారులు కూడా వెనకడుగువేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సహకారం అవసరం : అచ్చి రమేష్



ఎకరానికి రూ.60వేల వరకు పెట్టుబడి అవుతుందని, గతంలో ముందస్తుగా కొనుగోలు దారులే పెట్టుబడి పెట్టి ఆదుకునేవారని తెలిపారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో దిగుబడి అంచనా వేయలేక వారు కూడా కాపు వచ్చిన తరువాతే అంటున్నారని తెలిపారు. ఎకరానికి 4టన్నుల దిగుబడి వచ్చి టన్ను రూ.20వేలకు పైగా ధర పలికితే పెట్టుబడి బ్యాంకు వడ్డీలకే సరిపోతుందన్నారు. మంచు కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో పాటు, కాయ చిన్నగా వస్తుందని ధర పలకదని తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్ప వచ్చే సంవత్సరం మామిడితోట తీసివేయక తప్పదని చెబుతున్నారు.

రైపెనింగ్ చాంబర్ అందుబాటులోకి రావాలి

- కట్టుబోయిన శ్రీనివాసరావు



మల్లవల్లి పారిశ్రామికవాడలోని రైపెనింగ్ చాంబర్ అందుబాటులోకి వస్తే మామిడి రైతును ఆదుకున్నట్టవుతుంది. నూజివీడు మామిడికి మళ్లీ కళ రావాలంటే ప్రభుత్వ సహకారం తప్పనిసరి. గతంలో బాపులపాడు మండలంలోని మల్లవల్లి, రేమల్లె, కొత్తపల్లి, మడిచర్ల తదితర ప్రాంతాల్లో 10వేల ఎకరాలకు పైగా మామిడి సాగు చేసే వారు.. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం, సబ్సిడీలు అందించకపోవడంతో సగానికి పైగా తోటలు తీసివేసారు. మామిడి రైతును ప్రోత్సహించేందుకు నాణ్యతతో కూడిన దిగుబడికి సాంకేతికతతో కూడిన సబ్సిడీ పరికరాలు అవసరం. ప్రభుత్వం ఈదిశగా ఆలోచించి సహకరించాలి.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

- జె.జ్యోతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



ఆరుతడి నీటి యాజమాన్య పద్ధతులతో.. తక్కువ మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నాణ్యమైన దిగుబడితో లాభాలు అర్జించవచ్చు. నీటి యాజమాన్యం, పిందె రాలకుండా చర్యలు చేపట్టాలి. తడిపెట్టినపుడు కేజీ యూరియా, పొటాష్‌ల మిశ్రమాన్ని పాదులో వేయడం వల్ల చెట్టుకు బలం అంది కాపు రాలదు. పిందె రాలకుండా ఉండేందుకు ప్లానోఫిక్స్ హార్మోన్ ద్రావణాన్ని 1మిలీ 4.5మిలీ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ సమయంలోనే సూక్ష్మపోషకాలు అందేలా చర్యలు చేపట్టాలి. లేదా ఎన్.పీ.కే ద్రావణాన్ని 5వి.లీను 1లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగుమందులు తక్కువ వాడటం ద్వారా ఫలదీకరణకు ఉపయోగపడే తేనెటీగలకు సహకరించాలి. దీనివల్ల పిందెకట్టు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. సబ్సిడీపై ఫ్రూట్ కవర్లు, వేపనూనె స్థానిక ఆర్బీకే(రైతు సేవా కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయి.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మామిడి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలురకాల సబ్సిడీలపై వివిధ పరికరాలను కూడా అందజేస్తున్నదని, మండల ఉద్యానశాఖ అధికారిని సంప్రదించి అవసరమైన వాటిని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన అధిక దిగుబడులతో మామిడి రైతులు లాభాలు ఆర్జించాలి.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

సబ్సిడీపై బయోగ్యాస్ యూనిట్లు

» విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలతో పాటు విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అందజేస్తున్న బయో గ్యాస్ ప్రాజెక్టును కూడా పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఒయాసిస్ కార్బన్ క్రెడిట్ ప్రోగామ్ ద్వారా పాడి రైతులకు బయో గ్యాస్ యూనిట్ల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏజీఎం అన్వేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో చలసాని మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా నిర్మించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును పాడి రైతులు స్వీకరించాలన్నారు. పాడి రైతులు బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసి వినియోగించేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పశువుల పేడతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసి తద్వారా గ్యాస్‌ను తక్కువ ఖర్చుతో గృహ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. సింగపూర్‌కు చెందిన అరుఖా, పూనేకు చెందిన సిస్టెమా బయో కంపెనీలు సంయుక్తంగా రూ.50వేలు విలువ చేసే బయో గ్యాస్ యూనిట్‌ను కేవలం రూ.7వేలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఇది వినియోగించే రైతులకు ఐదేళ్ల పాటు ప్రోత్సాహకంగా ప్రతినెల నగదును అందిస్తుందని వివరించారు. విజయవాడ చుట్ట పక్కల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యూనిట్లు బాగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అరుఖా సంస్థ ప్రతినిధులు బయో గ్యాస్ ఏర్పాటు, నిర్వహణ, వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, అరుఖా, సిస్టెమా బయో కంపెనీ ప్రతినిధులు, విజయ డెయిరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గుడివాడలో టీ ట్యాక్స్!

(5వ పేజీ తరువాయి)

సరే స్క్వేర్ ఫీట్‌కు కొంత మొత్తంగా ట్యాక్స్ చెల్లిస్తేనే నిర్మాణ పనులు చేపట్టాలి. నియోజకవర్గంలో బెల్టు షాపు పెట్టుకోవాలంటే రూ.5వేలు రుసుంగా చెల్లించాలి. నెలనెలా కప్పం కట్టి వ్యాపారం చేసుకోవాలి. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారికంగానే 150 బెల్టు షాపులు నడుస్తున్నట్లు సమాచారం.

కాదు కూడదంటే కార్యాలయానికి రావాల్సిందే!

ఎవరైన తులసి చెప్పిన పని చేయకున్న, చెప్పిన మొత్తాన్ని ట్యాక్స్‌గా చెల్లించకున్న గుడివాడ బైపాస్ రోడ్డులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో తన ఎదుట హాజరు కావాల్సిందే. ఇక్కడి నుంచే హెచ్చరికలు, దందాలు, సెటిల్‌మెంట్లు నడిచాయి. ఇరిగేషన్, డ్రైనేజీ విభాగాలకు సంబంధించిన పనుల్లో తన కమీషన్ తేలకపోవడంతో టెండర్లనే నిలుపుదల చేయించినట్లు సొంత పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో పనుల తాలుకు టెండర్లు తెరవగా, ఒత్తిడి తట్టుకోలేక గుడివాడ నియోజకవర్గ పరిధిలోని టెండర్లను అధికారులు రద్దు చేశారు. మద్యం టెండర్ల విషయంలో కూడా తాను చెప్పిన వారే టెండర్లు వేయాలని, టెండర్లు వేసేందుకు వచ్చిన కొందరిపై తులసి తన దళాన్ని ఉసిగొల్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.

●ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1.36 కోట్ల వ్యయంతో ఫిల్టర్ బెడ్ రిపేర్లను స్థానిక నాయకుడి పేరు పెట్టి గుంటూరుకుచెందిన తన వర్గీయులతో కాంట్రాక్టు పనులు చేయించినట్లు కూటమి నాయకులు బాహాటంగా విమర్శిస్తున్నారు.

● తోట్లవల్లూరులోని ఒక ఇసుక రీచ్‌ని తన వశం చేసుకుని తన బౌన్సర్‌లను పెట్టి మరీ ఇసుకను తరలించుకుపోయినట్లు సమాచారం.

● మాట వినడం లేదని రైతు బజారు ఎస్టేట్ అధికారిపై తన అనుచరుడుతో దాడి చేయించి, స్టాల్స్‌ను అమ్ముకున్నట్లు తెలిసింది.

● మార్కెట్ యార్డులో గతప్రభుత్వ హయాంలో నిల్వచేసిన ప్రభుత్వ ఇసుకను సైతం తులసి దళం వదల్లేదు. లారీలతో, ట్రాక్టర్లతో తరలించుకుపోయి అమ్ముకుని సొమ్ముచేసుకున్నారు. తాము చెప్పింది వినకుంటే సొంత పార్టీ అనే తేడా లేకుండా సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోలింగ్ చేయించిన ఘనత తులసిదళానికే దక్కుతుంది.

రైతు బజార్లలో రాజకీయ రాబందులు!

(5వ పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నట్టు రైతులు నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఈ మొత్తాన్ని ముట్టజెప్పిన రైతుల కార్డులను మాత్రమే రెన్యువల్ చేయాలని ఈవోలను దళారులు ఆదేశించడం గమనార్హం. రైతుల పక్షాన ఉండాల్సిన ఈవోలు దళారులతో దోస్తీ కడుతున్నారు. కార్డులను రెన్యువల్ చేయాలని వెళ్లిన రైతులను ఈవోలే దళారుల వద్దకు పంపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. డిమాండ్ చేసిన మొత్తాన్ని కౌంటర్‌లో జమ చేసిన తర్వాతే కార్డులు రెన్యువల్ అవుతున్నాయి. ఇలా చేయని రైతులను మాత్రం ఈవోలు, దళారులు తిప్పించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఒక వైపు కన్నీరు పెట్టిస్తుంటే ప్రతి మూడు నెలలకు ఒకసారి రాజకీయ దళారులు అక్రమ వసూళ్లతో కన్నీరు పెట్టిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మినీబస్సుకు అదనంగా వసూలు చేసిన రశీదు, బొడ్డుబొమ్మ సెంటర్‌లో నగదు వసూలు చేస్తున్న సిబ్బంది

పార్కింగ్ పేరుతో అక్రమ వసూళ్లు!

» వీఎంసీ ఆదాయానికి గండి.. పట్టని అధికారులు

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్, రథం సెంటర్ బొడ్డుబొమ్మ వద్ద అనధికారికంగా వాహనదారుల నుంచి ఓ కాంట్రాక్టర్ పార్కింగ్ రుసుము వసూలు చేస్తు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నాడు. వాహనదారుల నుంచి అదనంగా రుసుము వసూలుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాధరపురానికి చెందిన ఓ కాంట్రాక్టర్ గత ఏడాది వన్‌టౌన్ కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి వెనుక పార్కింగ్ ప్రదేశాన్ని (వెయ్యి చదరపు అడుగులు) ఏడాదికి రూ.32.50లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించే విధంగా పాడుకున్నాడు. కార్పొరేషన్ నిబంధనల మేరకు ప్రతి మూడుగంటలకు కారుకు రూ.30, ఆ తర్వాత ప్రతి గంటకు అదనంగా రూ.10 వసూలు చేయాలి. ఆటోకు ప్రతి 3 గంటలకు రూ.15, ఆ తరువాత ప్రతి గంటకు రూ.10 వసూలు చేయాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ ఆ పార్కింగ్ పక్కనే కార్పొరేషన్ పరిధిలో ఉన్న బొడ్డుబొమ్మ సెంటర్ వద్ద అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్నాడు. మినీ బస్సు, తుఫాన్, ఇతర వాహనాలకు ప్రతి 3 గంటలకు రూ.200 చొప్పున, గంటకు రూ.100చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నాడు. దుర్గగుడికి వచ్చే భక్తుల నుంచి సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పార్కింగ్ రుసుము వసూలు చేయటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్పొరేషన్ ఆదాయానికి లక్షల్లో గండిపడుతోంది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దుర్గగుడిలో అభివృద్ధి పనుల్లో భాగంగా బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్ ప్రాంతాన్ని దేవస్థానానికి కేటాయించాలని ఆలయ సిబ్బంది, భక్తులు కోరుతున్నారు.

నందిగామ సివిల్ జడ్జికి పదోన్నతి

విజయవాడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా నందిగామ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యంను పదోన్నతిపై కర్నూలులోని అదనపు జిల్లాసెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. రాష్ట్రంలో న్యాయాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అవనిగడ్డ సివిల్‌జడ్జి బి.బాబునాయక్‌ను చిత్తూరు ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు న్యాయాధికారిగా తాత్కాలికంగా నియమించింది.

ఆరో అదనపు జిల్లాకోర్టు జడ్జిగా పూర్ణిమ

మచిలీపట్నం : కృష్ణాజిల్లా ఆరవ అదనపు కోర్టు జడ్జిగా ఎ పూర్ణిమను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరుజిల్లా నరసారావుపేట కోర్టులో అడిషనల్ సివిల్‌జడ్జి(సీనియర్ డివిజన్)గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి ఇచ్చి కృష్ణాజిల్లా కోర్టులో ఆరవ అదనపు జిల్లాజడ్జిగా నియమించారు.

ఇగ్నో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సీనియర్ రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షను దేశవ్యాప్తంగా మార్చి 16న నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడ, తిరుపతిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. దరఖాస్తు చేసుకోవటానికి ఫిబ్రవరి 21తో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూ.ఐజీఎన్ఓయు.ఎసి.ఇన్) ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా దగ్గరలో ఉన్న ఇగ్నో అధ్యయన కేంద్రంలో గానీ, 0866-2565253 నెంబరు ద్వారాగాని సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

రెండు రోజులే గడువు..

(5వ పేజీ తరువాయి)

పెట్టేస్తున్నారు. వాస్తవానికి 48 గంటల వరకు పక్కన పెట్టాల్సిన అవసరం కూడా లేదు. గంట కాకపోతే రెండు గంటల్లో అయినా పరిశీలించి ఒకే చేయవచ్చు. అభ్యంతరాలుంటే తిరస్కరించవచ్చు. సబ్ రిజిస్ట్రార్లు ఈ పని చేయకపోవటం వల్ల సమస్య ఏర్పడుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, కంచికచర్ల, మైలవరం, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కేటగిరీలో వచ్చిన డాక్యుమెంట్లపై తీవ్ర జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వెంటనే తిరస్కరిస్తే సరిదిద్దుకుని మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. నలభై ఎనిమిది గంటల జాప్యం వల్ల ఫిబ్రవరి 1వ తేదీ వచ్చేస్తే అధిక ధరలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పోలీసులు x న్యాయవాదులు

» న్యాయవాది తరపున బార్ పోరాటం
» ఎస్ఐని సస్పెండ్ చేయాలని లాయర్ల రిలేదీక్షలు
» న్యాయవాదికి వ్యతిరేకంగా కదిలిన పెద్దమోదుగపల్లి జనం
» సివిల్‌కోర్టుల వద్ద పోటాపోటీ దీక్షలు
» రెండు వర్గాలతో సీఐ చర్చలు.. ఎట్టకేలకు దీక్షల విరమణ

జగ్గయ్యపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట సివిల్ కోర్టుల సముదాయం వద్ద బుధవారం హైడ్రామా నెలకొంది. మహిళపై దాడి కేసులో ముద్దాయిగా ఉన్న న్యాయవాదిపై కేసు నమోదు చేసిన వత్సవాయి ఎస్ఐ ఉమాను సస్పెండ్ చేయాలని, అక్రమ కేసును ఎత్తివేయాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టగా, గ్రామంలో అశాంతిని నెలకొల్పుతూ తప్పుడు కేసులతో దౌర్జన్యానికి పాల్పడుతున్న న్యాయవాది బిక్షమయ్యను బార్ అసోసియేషన్ నుంచి సస్పెండ్ చేయాలని, అతడి అనుచరులను అరెస్టు చేయాలని డిమాండ్


న్యాయవాదుల రిలేదీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు సుందరరావు

చేస్తూ పెదమోదుగపల్లి గ్రామస్థులు, బాధిత మహిళతో కలిసి పోటీగా కోర్టు ఎదుట రిలేదీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కోర్టు గేటు వద్ద పోటాపోటీ శిబిరాలు, గత రెండు రోజులుగా న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి రోడ్డెక్కి ఆందోళనలు చేయటంతో పాటు కోర్టు ఎదుట దీక్షలు చేపట్టడంతో జగ్గయ్యపేట ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు రంగంలోకి దిగి రెండు వర్గాలతో చర్చలు జరిపారు. కోర్టు ఎదుట పోలీసుల సహకారంతోనే వేరే గ్రామం నుంచి వచ్చి రిలేదీక్షలు చేస్తున్నారని న్యాయవాదులు భావిస్తుండగా, చట్ట ప్రకారం వ్యవహరించే పోలీసులపై న్యాయవాదులు ఈ విధంగా రోడ్డెక్కి ఆందోళనలు చేయటమేమిటని ఇటు పోలీసులు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు అటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో, జగ్గయ్యపేట ఎస్సై 2 బి.ఇ.వెంకటేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎస్సై ఎం.ఎస్.కె.అర్జున్‌లు పెదమోదుగపల్లి గ్రామ బాధితులతో చర్చలు జరిపారు. చర్చలలో న్యాయవాదులు వత్సవాయి ఎస్ఐ తీరు బాగాలేదని, న్యాయవాదిపై తప్పుడు కేసు పెట్టడంతో పాటు, గతంలో వేరే కేసులో వెళ్లిన ఇద్దరు


పేట కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న పెద్ద మోదుగపల్లి గ్రామస్థులు

న్యాయవాదుల ఎదుట ముద్దాయిలను చితక బాది దుర్భాషలాడటం, న్యాయవాదులను హోంగార్డులతో అడ్డుకున్నారని సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదులతోనే అతని ప్రవర్తన అలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటో ఆలోచన చేయాలని కోరారు. పెదమోదుగపల్లి కేసులో న్యాయవాది బిక్షమయ్య పాత్రపై విచారణ చేసి, అతని పాత్ర లేదని తేలితే పేరు తొలగిస్తామని, వత్సవాయి ఎస్ఐపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని, రిలేదీక్షలను ఉపసంహరించుకోవాలని కోరారు. దీంతో పెదమోదుగపల్లి గ్రామస్థులు రిలేదీక్షలు తాత్కాలికంగా నిలిపివేసేందుకు అంగీకరించారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చి వెళ్లిపోయాక న్యాయవాదులు కాసేపు రిలేదీక్షలు కొనసాగించారు. బార్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు పోలీసు ఉన్నతాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ల సూచనతోనే రిలేదీక్షలు తాత్కాలికంగా ఆపేస్తున్నామని ప్రకటించారు. సీనియర్ న్యాయవాదులు ఈవీ జగన్నాథరావు, సామినేని వెంకటేశ్వరరావు, బద్దుల వెంకట్రామయ్య, గోనేల వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని సస్పెండ్ చేయాలి

» బాధితురాలు రాయల కరుణ డిమాండ్

జగ్గయ్యపేట : తనపై దౌర్జన్యంగా వ్యవహరించిన న్యాయవాది బెజవాడ బిక్షమయ్య ప్రాక్టీస్ చేయకుండా బార్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని పెద్దమోదుగపల్లికి చెందిన గ్రామ బాధితురాలు రాయల కరుణ డిమాండ్ చేశారు. కోర్టు వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ దిమ్మెపై దాడికేసులో ఏమాత్రం సంబంధం లేని నాపై బిక్షమయ్య నానా దుర్భాషలాడుతు, మహిళ అని చూడకుండా దౌర్జన్యం చేశారని ఆరోపించారు. బిక్షమయ్య ప్రోద్బలంతో తేటకూర నాగేశ్వరరావు, కిరణ్, అంగన్వాడీ వర్కర్ మరియమ్మలు దాడిచేయగా.. వారిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని చెప్పారు.

నానో యూరియా!



కేంద్రం ప్రమోట్ చేస్తున్న నానో యూరియా బాటిళ్లు

బెజవాడ కేంద్రంగా బడా వ్యాపారుల కనుసన్నల్లో ఎరువుల అక్రమ వ్యాపారం జరుగుతోంది. వ్యాపారులు తమ వద్ద ఉన్న సరుకును అధిక ధరలకు రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల మార్క్‌ఫెడ్ ద్వారా సహకార సంఘాలకు, ఆర్‌బీకేలకు ఇంతవరకూ యూరియా అందలేదు. యూరియా వ్యాపారుల సిండికేట్‌ను ప్రశ్నించేందుకు అధికారులూ సాహసించలేని పరిస్థితి.

» రబీ సీజన్‌లో రైతుల ఇక్కట్లు!
» మార్క్‌ఫెడ్ నుంచి సకాలంలో అందని యూరియా
» అదే అదనుగా సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి, నందిగామ)

బహిరంగ మార్కెట్‌లో ఎరువుల ధరలను స్థిరీకరించటానికి మార్క్‌ఫెడ్ ద్వారా యూరియాను ప్రభుత్వం అందిస్తోంది. మార్క్‌ఫెడ్‌కు సకాలంలో యూరియా రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదు. దాళ్వా సాగుతో పాటు మిర్చి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం యూరియా అవసరం ఎంతో ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల అవసరాలే ఆసరాగా.. ప్రైవేటు వ్యాపారులు రూ. 266లకు విక్రయించాల్సిన 45 కేజీల యూరియా బస్తా రూ.380 నుంచి రూ.450వరకు విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు స్టాక్ లేదని సమాధానం చెబుతున్నారు. అదును పోతే పంట చేతికి రాదన్న బాధతో అడిగినంత చెల్లించి యూరియా కొనుగోలు చేస్తున్నారు.

నానో యూరియా ప్రమోషన్ వల్లే బ్లాక్ మార్కెట్ : వ్యాపారులు

యూరియా 45 కేజీల బస్తాకు కేంద్ర ప్రభుత్వం రూ.1170.79ల సబ్సిడీ ఇస్తోంది. పంటల వారీగా సరాసరి ప్రతి రైతు ఎకరాకు కనీసం మూడు బస్తాల యూరియా వినియోగిస్తారు. ప్రభుత్వంపై భారం పడుతున్న కారణంగా కేంద్రం నానో యూరియా, నానో డీఏపీలను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. లీటరు రూ. 220లకే లభించే నానో యూరియాపై కేంద్రం ఒక్క రూపాయి కూడా సబ్సిడీ ఇచ్చే అవసరం లేదు. యూరియా స్థానంలో నానో యూరియా వినియోగించాలని ప్రభుత్వం సూచిస్తున్నది. అయితే నానో యూరియాలో కేవలం 21శాతం మాత్రమే నత్రజని ఉండడంతో రైతులు 45శాతం నత్రజని ఉన్న సాంప్రదాయ యూరియా వైపే మొగ్గు చూపుతున్నారు. పైగా యూరియాను భూమిలో వేయడం వల్ల నత్రజని గాలికి ఆవిరి కాకుండా మొక్కలకు అందుతుంది. నానో యూరియా స్ప్రే చేయడం వల్ల చాలా వరకు గాలిలో కలిసి పోతుందని రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆర్థిక భారం తగ్గించుకొనేందుకు నానో యూరియాను బలవంతంగానైనా వాడించాలని సంకల్పించింది. ఏళ్ల తరబడి యూరియా వినియోగం బల్ల భూములు సారం కోల్పోతాయని, నానో యూరియాతో మొక్కకు శక్తి రావడంతో పాటు భూసారానికి వచ్చే ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అన్నదాతలు మాత్రం నానో యూరియా వినియోగానికి మొగ్గు చూపడం లేదు. భారమైనా బ్లాక్‌లో కొనుగోలు చేసి మరీ సాంప్రదాయ యూరియానే వినియోగిస్తున్నారు.

వ్యాపారులకు సహకరించేలా మార్క్‌ఫెడ్ అధికారుల చర్యలు

రబీ ప్రారంభమైనా మార్కెఫెడ్ ద్వారా పంపిణీ జరగాల్సిన యూరియాను అధికారులు సిద్ధం చేయలేదు. మార్కెఫెడ్‌కు యూరియా వచ్చినా వ్యాపారుల లబ్ధి కోసం పంపిణీలో జాప్యం చేశారని అధికారులపై అన్నదాతలు మండిపడుతున్నారు. సకాలంలో యూరియా అందజేస్తే తమకు ఈ పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు మార్కెఫెడ్ ఏర్పడిందని, అటువంటి మార్కెఫెడ్‌ను సైతం వ్యాపారులు బ్లాక్ చేసి తమ వద్ద ఉన్న సరుకు అమ్ముకొనే వరకూ పంపిణీ చేయకుండా నిలువరించారని ఆరోపిస్తున్నారు. మార్క్‌ఫెడ్ అధికారుల అవినీతికి తాము బలయ్యామని, నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

యూరియా బ్లాక్‌లో కొనవద్దు..

రబీకి సరిపడా యూరియా సిద్ధంగా ఉన్నట్టు జిల్లా అధికారిణి విజయకుమారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జిల్లాలోని మొత్తం 30 సహకార సంఘాలకు 25 టన్నుల చొప్పున 16,650 బస్తాల యూరియాను మార్క్‌ఫెడ్ నుంచి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వ్యాపారుల బ్లాక్ మార్కెట్ పైనా, మార్కెఫెడ్ నుంచి యూరియా పంపిణీలో జాప్యంపైనా ఆమె సమాధానం దాటవేశారు. మార్కెఫెడ్‌కు కొంత ఆలస్యంగా సరుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. మార్కెఫెడ్ కంటే వ్యాపారులకు ముందుగా సరుకు ఎలా వచ్చిందన్న దానిపై వ్యవసాయ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. నానో యూరియాను అడ్డుపెట్టుకొని వ్యాపారులు దోపిడీ చేస్తుండగా, సబ్సిడీ భారం తగ్గించుకునేందుకు రైతులను నానో యూరియా వైపు నడిపించాలని అధికారులు చూస్తున్నారు.

నానో యూరియా కొంటేనే సాధారణ యూరియా

నానో యూరియా ప్రమోట్ చేయడానికి అధికారులు డీలర్లకు నిబంధనలు పెడుతూ వస్తోంది. ఒక లారీ(20)టన్నుల యూరియా కొనుగోలు చేసిన వ్యాపారులు ఎనిమిది కేసుల నానో యూరియా కొనుగోలు చేయాలన్న నిబంధనను విధించారు. ఈ కారణాన్ని చూపుతూ వ్యాపారులు ఆ ధరను కూడా యూరియా బస్తాలపై వేసి రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం దివాలా: ఎమ్మెల్యే గద్దె

పటమట: జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. బుధవారం 12వ డివిజన్‌కు చెందిన తుమ్మల వెంకట్ టీడీపీ యాప్ ద్వారా రూ. లక్ష చెల్లించి పార్టీ జీవితకాల సభ్యత్వ నమోదును తీసుకున్నారు. స్వయంగా ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పు, ఏడాదికి 71 వేల కోట్ల అసలు రూ.140 వేల కోట్ల వడ్డీ చెల్లింపు భారం రాష్ట్ర ఖజానాపై పడిందన్నారు. ఇలా తెచ్చిన అప్పులను జగన్మోహన్ రెడ్డి విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేశారన్నారు. కార్పొరేటర్లు సాయిబాబు, ప్రసాద్, గద్దె క్రాంతికుమార్, బుజ్జి పాల్గొన్నారు.

డ్రెయినేజీలో తెట్టులా ...చెత్త, వ్యర్థాలు




కరెన్సీనగర్ మూడో వార్డులోని బాబూజీ రోడ్డు పక్కన డ్రెయినేజీ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో మురుగుపారుదల నిలిచిపోయింది. రోజుల తరబడి పారుదల లేక దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు పేరుకుపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. స్వచ్ఛ సర్వేక్షన్ అంటూ నగర పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు ఇటువంటివి కనపడకపోవడం విడ్డూరం. ఈ డ్రెయినేజీకి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు.

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

అర్హులకు రుణ సదుపాయం కల్పిస్తాం



అభ్యర్థులకు రుణ మంజూరు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చిత్రంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ తదితరులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తామని, నిజమైన లబ్ధిదారులకు నష్టం కలగకుండా బ్యాంకు నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ని అందిస్తామని, పలు బ్యాంకుల నుంచి 428 మందికి రుణ సదుపాయం అందించినట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం ఆటోనగర్ ఏటీప హాలులో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంఅవగాహన సదుస్సు, రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత గల ప్రతి అభ్యర్థికీ రుణం మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. అనంతరం అభ్యర్థులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూబీఐ బ్యాంక్ మేనేజర్ మూర్తి, ఎస్ఎల్బీసీ కన్వీనర్ శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ డీసీ చంద్రమౌళి, జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ సాంబయ్య, కార్పొరేట్ అపర్ణ పాల్గొనారు.

కార్యకర్తకు ఆర్థికసాయం

రామలింగేశ్వరనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ బుధవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గులాబీ రోడ్డులో నివశిస్తున్న పార్టీ సీనియర్ కార్యకర్త గాదం ప్రసాద్ బాబును పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మీకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు, జనసేన నేత గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు.

రేపటి వరకు ఇళ్ల రిజిస్ట్రేషన్ గడువు

చిట్టినగర్: నగర పాలక సంస్థ జారీ చేసిన పట్టాలకు గజం రూ.100కే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పించినట్టు నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఈ నెల 31 ఆఖరు కావడం తో బుధవారం వీఎంసీ నూతన భవనంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. పాయకాపురం, కొత్త రాజ రాజేశ్వరి పేట ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు విస్తరించాలి

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

గుణదల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలను విస్తరింపజేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ భవన్లో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు ప్రజలకు మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తానని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ బిజినెస్ విజయవాడలో బాగా జరిగేలా చేసి ఏపీలోనే ప్రథమ స్థానం కైవసం చేసుకోవడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ జీఎం కె.మురళీకృష్ణ మాట్లాడుతూ త్వరలోనే విజయవాడ బిజినెస్ ఏరియాలోని అన్ని టవర్లను 4జీ లోకి మార్చి ఆ తర్వాత 5జీ సేవలను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ విజయవాడ పరిధిలోగల పలు శాఖలకు చెందిన డీజీఎంలు, ఏజీఎంలు, సీఏవోలు, ఎస్‌డీఈలు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలించండి

● అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీస్తున్న కమిషనర్

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఉన్న అన్ని అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతను నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా పరిశీలించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం తన పర్యటనలో భాగంగా ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ఉన్న అన్న క్యాంటీన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, సదుపాయాల్లో ఎటువంటి మరమ్మతులు ఉన్నా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, కిచెన్‌లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. నిరంతరాయంగా తాగునీరు ఉండాలని, వాడుక నీటి పైప్‌లైన్లలో లీకేజీ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థ విద్యార్థికి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్

పెనమలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కానూరులోని వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో ఎంసీఏ రెండో సంవత్సర విద్యార్థి ఉప్పల సాయి సుబ్రహ్మణ్యంకు ఆల్ ఇండియా సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ వచ్చినట్లు యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పోతిని రఘు తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు పాండిచ్చేరిలో జరిగిన 21వ సీనియర్ సౌత్‌జోన్ పోటీల్లో విజేత సుబ్రహ్మణ్యంను ప్రో వీసీ రత్నప్రసాద్, డీన్లు వెంకటరావు, డైరెక్టర్ పాండురంగారావు, ఎంసీఏ విభాగ అధిపతులు అభినందించారు.



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పొటెన్షియల్ ట్రైనర్ సుధను సత్కరిస్తున్న ఎంఎస్‌జే సత్యానందం, చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్

కేసుల సత్వర పరిష్కారంలో న్యాయవాదులదే కీలక పాత్ర

● రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పొటెన్షియల్ ట్రైనర్ సుధ

విజయవాడ లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా కేసుల సత్వర న్యాయ పరిష్కారానికి మీడియేషన్ సెంటర్ ఉత్తమమైన మార్గమని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పొటెన్షియల్ ట్రైనర్ సుధ అన్నారు. బుధవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో మధ్యవర్తిత్వం దాని ప్రాముఖ్యతపై జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేసులు సత్వర న్యాయ పరిష్కారానికి న్యాయవాదులదే కీలకమైన పాత్ర అని అన్నారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, బెజవాడ బార్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్, బార్ మాజీ అధ్యక్షుడు మట్టా జయకర్, వేముల హజరత్తయ్య గుప్తా, మహిళా కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఎంఎస్ఎంఈ దోహదం

● రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు

మొగల్రాజపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల సంస్థ ఎన్నో పథకాలను అందిస్తోందని ఆ సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు తెలిపారు. జనశిక్షణా సంస్థాన్ మొగల్రాజపురం కార్యాలయంలో బుధవారం తరుణీ తరంగాలు సంస్థ సహకారంతో నూతన పారిశ్రామిక విధానం -మహిళకు ప్రోత్సాహకాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సూక్ష్మ చిన్నమధ్య తరహా పరిశ్రమలకు కోట్లలో పెట్టుబడి సమకూర్చడం వల్ల ఫుడ్, క్లాత్, కిరాణా, వస్తు ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పరిశ్రమలు పెట్టుకునే వారికి యంత్రాలు సమకూరుస్తామన్నారు. ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ సంఘం గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు మాట్లాడుతూ వృత్తి విద్య నేర్చుకున్న వారికి ఎంఎస్ఎంఈ ఎంతో సాయంగా ఉంటుందన్నారు. రాజేశ్వరి ఇండస్ట్రీస్ ఎండీ కె.కనకదుర్గ, కోవే ఇండియా జాతీయ కోశాధికారి డి. అపర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా అధ్యక్షత వహించగా డైరెక్టర్ ఎ. పూర్ణిమ, తరుణీ తరంగాల సభ్యులు, సంస్థాన్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్క్‌షాపు

లబ్బీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో ఎడ్యూస్కిల్స్ టెక్ క్యాంప్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెంకడ్ ఇయర్ బీఎస్సీ విద్యార్థులకు ఆల్టరీక్స్ డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్క్‌షాపును మూడు రోజుల పాటు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఎడ్యూస్కిల్స్ అసోసియేట్ మేనేజర్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రైనర్ ఎస్.వి.పవన్‌కుమార్ విద్యార్థులకు ఆధునిక సాంకేతికత, డేటా ఎనలిటిక్స్‌లో వివిధ టెక్నిక్స్‌ని సులభంగా అర్థమయ్యేలా వివరించారు. అనంతరం 60మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.దుర్గాభవాని, బి.చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● ఎంపీ కేశినేని శివనాథ్


వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతోపాటు ఆటల్లో కూడా రాణించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.కేబీఎన్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో బుధవారం ఆయన విజయవాడ, తిరువూరు డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. నారా లోకేశ్ జన్మదినం రోజు క్రీడా కిట్లను అందచేసే కార్యక్రమాన్ని ప్రారంభించి తొలుత పశ్చిమ నియోజకవర్గంలోని అయిదు పాఠశాలలకు అందించామన్నారు. జిల్లాలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ఎంపీ తన సొంత నిధులతో క్రీడా సామగ్రిని సమకూర్చటం అభినందనీయమన్నారు. డాక్టర్ వి.నారాయణ రావు, టి.శ్రీనివాస్, ఎం.ఎస్.బేగ్, ఫతావుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మంచు పల్లెలు





చుట్టూ విస్తరించిన పచ్చని పంటపొలాలు.. అక్కడక్కడ సాలె గూళ్లు వాటిపై వెండిలా తళుక్కుమంటూ మెరిసిపోతున్న మంచు తెరల తుంపర్లు.. పొలాల మధ్య పనిచేసుకుంటున్న రైతులు , ఆహ్లాదకరమైన చల్లని గాలి.. వెరసి గ్రామీణ వాతావరణంలో కనిపించిన సుందర దృశ్యాలు కనులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న చలి.. మంచు కురుస్తున్న దృశ్యాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.











ఎన్నాళ్లకెన్నాళ్లకు!

రైల్వేతో ముడిపడిన నగరాభివృద్ధి ప్రాజెక్టులకు ముందడుగు / డీఆర్‌ఎం, కలెక్టర్, కమిషనర్ ఒక్కటిగా భేటీ

- కమిటీ సమావేశానికి చొరవచూపిన ఎంపీ చిన్ని
- పదేళ్ల తర్వాత డీఆర్‌ఎంతో జిల్లా, నగర అధికారుల భేటీ
- రైల్వే ఆక్రమణలపై సహకరించాలని డీఆర్‌ఎం విజ్ఞప్తి
- రైల్వే బకాయిలు విడుదల చేయాలని కోరిన కమిషనర్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రైల్వే ప్రాజెక్టులతో ముడిపడిన నగరాభివృద్ధి ప్రాజెక్టులకు ఎట్టకేలకు ముందడుగు పడింది. గుణదల మినీ ఫ్లై ఓవర్, రైల్వేలైన్ వెంబడి ఉన్న కాలువల ఆధునీకరణ, బుడమేరు అభివృద్ధి, రామవరప్పాడు, కొండపల్లి వద్ద ఆర్‌వోబీల ప్రతిపాదనలు, వాంబేకాలనీ ఆర్‌వోబీ, సింగ్‌నగర్, రామకృష్ణాపురం వద్ద అదనపు వెంట్స్ వంటి రైల్వేతో ముడిపడిన సమస్యలపై ఏకాభిప్రాయం కుదిరింది. దాదాపు దశాబ్దకాలం తర్వాత రైల్వే అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చొరవతో ఇది సాధ్యమైంది. ఎంపీ శివనాథ్ అధ్యక్షతన డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎప్పటి నుంచో రైల్వేతో సుహృద్భావ వాతావరణం లేకుండా అపరిష్కృతంగా ఉన్న అన్ని అంశాలపైనా ఈ సమావేశంలో పరిష్కారం దిశగా సానుకూల సంకేతాలు వచ్చాయి. రైల్వే పరంగా ఉన్న అన్ని అభ్యంతరాలు దాదాపుగా తొలిగాయి. మనసువిప్పి మాట్లాడుకోవటంతో దాదాపుగా రైల్వే నుంచి అన్ని ప్రాజెక్టులకు సంబంధించి సానుకూలంగా సంకేతాలు వచ్చాయి. రైల్వే కూడా వీఎంసీతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రస్తావించింది. ప్రధానంగా రాజీవ్‌గాంధీ పార్కు వద్ద పూలమార్కెట్ స్థలం తమదేనని ఆక్రమణలను తొలగించాలని డీఆర్‌ఎం ప్రతిపాదించారు. ప్రతిగా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర రైల్వే నుంచి రావాల్సిన పన్ను బకాయిలను ప్రస్తావించారు. ఈ సమస్యలకు ఒక అడుగు అయితే ముందుకు పడింది. ప్రజలతో ముడిపడి ఉన్న సమస్యలకు రైల్వే నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయి. ఆక్రమణల విషయంలోనూ ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కార్పొరేషన్, జిల్లా అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించాయి. ఇప్పటికిప్పుడు పరిష్కారమైపోతాయని చెప్పలేం కానీ, ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న అంశాలకు పరిష్కార దిశ అడుగులు పడటం ఆశలను రేకెత్తిస్తున్నాయి.

రైల్వే హబ్‌గా విజయవాడను తీర్చిదిద్దుదాం

- ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల డీపీఆర్‌లను సిద్ధం చేయండి
- జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఎంపీ శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు

కృష్ణలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రైల్వేతో ముడిపడిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను సమష్టి భాగస్వామ్యంతో త్వరగా పూర్తిచేసేందుకు డీపీఆర్‌లను త్వరగా సిద్ధం చేయాలని, ఇప్పటికే చేపట్టిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ శివనాథ్ అధ్యక్షతన డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రైల్వేతో ముడిపడిన ఇంజనీరింగ్, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఎస్టేట్ సెక్షన్ల అంశాలపై సమావేశం దృష్టి సారించింది. విజయవాడను ఇబ్బందిపెట్టిన వరదలు పునరావృతం కాకుండా రైల్వే భాగస్వామ్యంతో చేపట్టాల్సిన పనులు నిరాటంకంగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డ్రైన్లలో పూడికతీత, పారిశుధ్యంతో పాటు మ్యాన్‌హోల్స్ వద్ద తేలియాడే చెత్తాచెదారం తొలగింపు, సీసీ అప్రోచ్, ఆర్‌వోబీ/ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం ఆక్రమణల తొలగింపు, డీపీఆర్‌ల తయారీపై కూలంకుషంగా చర్చించి తక్షణ కార్యాచరణకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్‌లను వెంటనే సిద్ధం చేసి, అనుమతులు సాధించేలా కృషిచేయాలన్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ, బుల్లెట్ ట్రైన్, మెట్రోలైన్ నిర్మాణం వంటి వాటిని కేంద్రం దృష్టికి తీసుకొచ్చి అనుమతులు, నిధుల మంజూరుకు తనవంతు కృషి చేసి నగరాన్ని రైల్వే హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, బుడమేరు ఆధునీకరణతో పాటు నగరాభివృద్ధిపై దృష్టిపెట్టారని, అందుకు అనుగుణంగా వేసవిలో పనుల పూర్తికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. వీఎంసీకి రైల్వేశాఖ చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తే మరిన్ని నిధులు వస్తాయన్నారు.

సమావేశాలతో మెరుగైన ఫలితాలు: డీఆర్‌ఎం

రైల్వే ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక దృష్టిసారించారని, పెద్దఎత్తున ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పనుల పూర్తికి ఇలాంటి సమావేశాలతో మెరుగైన ఫలితాలుంటాయని డీఆర్‌ఎం పాటిల్ అన్నారు. డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (సమన్వయం) ఎస్ వరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు

- రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- మంత్రి కొల్లు రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర మంత్రులు దావోస్‌లో పారిశ్రామిక వేత్తల సదస్సులో పాల్గొని రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులు తెచ్చారని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావోస్‌లో మైనస్ 6 డిగ్రీల చలిని సైతం లెక్క చేయకుండా సీఎం చంద్రబాబు పర్యటించారన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు దాదాపు రూ.6 లక్షల 35 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. పునరుత్పాదక శక్తి, స్టీల్, ఐటీ రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళుతుందన్నారు. తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు సైతం చంద్రబాబు కృషిని అభినందించారని, ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహనరెడ్డి మాత్రం విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మంత్రి లోకేష్ ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రూ.లక్షా 46వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. ఇప్పటికే టీసీఎస్, బీపీసీఎల్, రిలయన్స్, గ్రీన్‌కో, పీపుల్‌టెక్ వంటి కంపెనీలతో ఎంవోయూలు పూర్తయ్యాయన్నారు. పనులను ప్రారంభించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ సీనియర్ నేతలు గొర్రెపాటి గోపీచంద్, కొనకళ్ల బుల్లయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నేతలు లంకే నారాయణ ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, కుంచే నాని, బీజేపీ నేత పంతం గజేంద్ర, జనసేన నేత మాదివాడ రాము, లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే ఉన్నాం: ఘంటా

ఆటోనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసేందుకే తామున్నామే తప్ప ఏ రాజకీయ నేతకీ పాలేరుగా పనిచేయడానికి కాదని పంచాయతీ కార్యదర్శుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఘంటా రామ్మోహన్ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎనికేపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై గన్నవరం జనసేన నేతలు దుర్భాషలాడటమనేది ఆక్షేపణీయమని, వారితీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ప్రభుత్వాధికారులతో మార్యదగా వ్యవహరిస్తారని, జనసేన నేతలు కూడా అలాగే నడుచుకోవాలన్నారు. ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

117 జీవో రద్దుచేసి.. ఎస్జీటీ పోస్టులు పెంచాలి

వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 117 జీవోపై అభిప్రాయ సేకరణ చేయటాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 117 జీవో రద్దు చేసి సింగిల్ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటి) పోస్టులను పెంచి వాటిని కూడా డీఎస్సీలో కలిపి ప్రకటించాలన్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులను 6 నుంచి 10వ తరగతి వరకున్న పాఠశాలలకు తరలింపుతో లక్షలాదిమంది స్థానిక ప్రైవేటు పాఠశాలల్లో చేరారన్నారు. కొందరు విద్యకు దూరమయ్యారన్నారు. దీంతో ఎస్జీటీ పోస్టులు కూడా తగ్గిపోయాయన్నారు. రానున్న డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులను కలపాలన్నారు.

విజన్‌కు విధ్వంసానికి తేడా తెలుసుకోవాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలన చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వం విజన్‌తో ఎన్నో అభివృద్ధి, ఉపాధి వ్యవస్థలను నిర్మిస్తే వాటిని ధ్వంసం చేసిందని, ప్రజలు విజన్‌కు, విధ్వంసానికి తేడా తెలుసుకోవాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలో బుధవారం ఆయన పర్యటించారు. జక్కంపూడిలో 2018లో టీడీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. కాంప్లెక్స్‌ను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టిన సంస్థ ప్రతినిధులు, అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లల్లో ఉండే పేద, మధ్యతరగతి ప్రజల ఉపాధి కోసం చంద్రబాబు కాంప్లెక్స్‌ను నిర్మాణం చేపట్టి దాదాపు పూర్తి చేశారన్నారు. మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి రానుందనగా వైసీపీ పాలన మొదలైందని, దీంతో కాంప్లెక్స్‌లో చిన్న, మధ్య తరగతి పరిశ్రమల కాంప్లెక్స్ ప్రారంభమవకుండానే పాడుబెట్టారని దుయ్యబట్టారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తి చేయడమే కాకుండా ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు ప్రాణం పోసి ప్రజలకు ఉపాధి భరోసా కల్పిస్తామని హామి ఇచ్చారు.

ఘనంగా వేటూరి జయంతి

విజయవాడ కల్చరల్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి జయంతి కార్యక్రమం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద సత్రంలో బుధవారం ఘనంగా జరిగింది. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వేటూరి సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయనీగాయకులు జయంతి చక్రవర్తి, వెంకటేశ్వరరావు, రవికుమార్, లక్ష్మణ్ నాయక్, రాజ్ కిషోర్, మునిపల్లె రమణి, రూపశ్రీ, సుహాసిని మధురంగా గానం చేశారు. వ్యాఖ్యానం దామోదర గణపతి చేయగా చలపతిరావు, బ్రూస్లీ సహకరించారు. కోకిలమ్మ పెళ్లికి కోనంత పందిరి, గిరిలో లాహిరి, వెన్నెలవే వెన్నెలవే తదితర మధుర గీతాలను గానం చేశారు. ముందుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలోని వేటూరి కాంస్యవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోళ్ల నారాయణరావు, జి.శ్రీనివాస్, కారుమంచి రాజు, దండు చంద్రశేఖర్, ప్రభల శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, ఆంజనేయ రాజు రాజు, రాజ్ కిషోర్, శ్యాం ప్రసాద్, చలపతిరావు పాల్గొన్నారు.

ముగిసిన నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై జరుగుతున్న నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు బుధవారంతో ముగిశాయి. జానపద నృత్య కళాకారులు కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్‌కు ఘన సత్కారం జరిగింది. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్త, కార్యదర్శి సూర్యదేవర జగన్నాధరావు, సభాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, ముఖ్యఅతిథిగా గుమ్మడి గోపాలకృష్ణ, గౌరవ, ఆత్మీయ అతిధులుగా రాకేష్, డాక్టర్ బి.జయప్రకాష్, జవ్వాజి నారాయణ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. అధ్యక్షుడు హజరత్తయ్య గుప్తా అతిథులను, కళాకారులను సత్కరించారు.

దుర్గమ్మ భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- ఎమ్మెల్యే సుజనాచౌదరి



దుర్గగుడి అధికారులతో మాస్టర్‌ప్లాన్‌పై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

పెనమలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకొనే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి వెల్లడించారు. దుర్గగుడి అభివృద్ధికి అమలు చేయాల్సిన మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై ఎమ్మెల్యే సుజనాచౌదరి బుధవారం తాడిగడపలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధికి సరికొత్త మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై ఆయన అధికారులతో మాట్లాడారు. దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్టులు, టెక్నికల్ టీంతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలందించడానికి, భవిష్యత్తులో ఎంత మంది భక్తులు వచ్చినా అసౌకర్యం కలగకుండా ఇబ్బందులు రాకుండా ఉండడానికి సరికొత్త మాస్టర్ ప్లాన్‌పై అధికారుల నుంచి వివరాలు తెలుసుకొన్నారు. గతంలో పెట్టిన అంశాలతో పాటు మరికొన్ని అంశాలను పొందుపరచాలని ఆదేశించారు. సమీక్షలో దుర్గగుడి ఈఈలు వైకుంఠరావు, కోటేశ్వరరావు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ రమేష్, శ్రీనివాస్, సుమంత్ పాల్గొన్నారు.



సిమెంట్ తయారీ విధానాన్ని విద్యార్థులకు తెలియజేస్తున్న స్టాలిన్ బాబు, చిత్రంలో ప్రిన్సిపల్ డాక్టర్ కడియాల రవి, డిప్లొమా ఇన్‌చార్జి డి. హేమ, సురేష్‌బాబు తదితరులు

కాలుష్య రహిత సిమెంట్ తయారీపై విద్యార్థులకు అవగాహన అవసరం

నిపుణులు స్టాలిన్ బాబు

గంగూరు (కంకిపాడు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సిమెంట్ తయారీ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించటం అభినందనీయమని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కడియాల రవి అన్నారు. కాలుష్య రహిత సిమెంట్ తయారీ విధానంపై ప్రముఖ సిమెంట్ కంపెనీల నిపుణుడు స్టాలిన్ బాబు బుధవారం ధనేకుల డిప్లొమా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి. హేమ మాట్లాడుతూ సిమెంట్ కంపెనీల ద్వారా వచ్చే కాలుష్యంతో ప్రకృతి దెబ్బదింటుందన్నారు. రిటైర్ట్ ఇంజనీర్ స్టాలిన్ బాబు తన అనుభవంతో కాలుష్య నివారణ సిమెంట్ తయారీ యంత్ర నమూనాను తయారు చేయడం ఆయనకు పనిపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, హెచ్‌వోడీ రావి సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు సిమెంట్ తయారీ కంపెనీల వద్దకు తీసుకువెళ్లి అవగాహన కల్పించటం కష్టతరమన్నారు. అలాంటి అవసరం లేకుండానే స్టాలిన్ బాబు యంత్ర నమూనాను తెచ్చి విద్యార్థులు అవగాహన కల్పించారన్నారు.

కోర్టు తీర్పు ఆనందం కలిగించింది

- ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ

లబ్బీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖేల్‌రత్న అవార్డు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ఆనందం కలిగించిదని ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో పేరు లేకపోవడం ఆవేదన కలిగించిందని, అన్ని వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశానన్నారు. కమిటీ సభ్యులంతా ఏకాభిప్రాయానికి రాలేదా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలున్నా అవార్డుల విషయంలో ప్రతిభను గుర్తించకపోవడంతో ఆవేదనకు గురయ్యానన్నారు. అనేక టోర్నమెంట్లలో మెడల్స్ సాధించానని, ఇటీవల ప్రకటించిన అవార్డుల్లో తన పేరు లేకపోవడంతో ఆవేదన కలిగిందని, అందుకే హైకోర్టును ఆశ్రయించి అన్ని వివరాలు సమర్పించానన్నారు. కోర్టు పరిశీలించి తనకు అవార్డు ఇవ్వాలని ఆదేశించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి తనకు అవార్డు అందజేస్తుందని ఆశిస్తున్నానన్నారు.

2న వ్యాపారవేత్తల కాన్‌క్లేవ్ 3.0 సదస్సు

లబ్బీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చి, పరస్పర వాణిజ్య ప్రయోజనాలను మెరుగుపరిచే లక్ష్యంతో బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్‌క్లేవ్ 3.0 నిర్వహిస్తున్నట్టు బీఎన్ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లబ్బీపేటలోని జీఆర్టీ గ్రాండ్ హోటల్‌లో ఫిబ్రవరి 2న ఈ కాన్‌క్లేవ్ జరుగుతుందని, లెజండరీ క్రికెటర్ జాంటీరోడ్స్ ఈ సదస్సుకు హాజరవుతారని, వ్యాపారవేత్తల్లో స్ఫూర్తిని నింపేలా ఆయన ప్రసంగం ఉంటుందన్నారు. సదస్సులో 1500 మంది వ్యాపారవేత్తలు పాల్గొంటారని, వ్యాపారవేత్తలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. కాన్‌క్లేవ్ 3.0 చైర్మన్ మేఘన ఆచంట, మెంటార్ నందూరి త్రినాథ్, కన్వీనర్ పి.యువ కిషోర్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ముఖ్యం

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్

లబ్బీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైందని, ప్రజలకు సేవలందించడంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలని, రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గతేడాది బుడమేరు వరద బీభత్సంతో అతలాకుతలమైన నగర ప్రజలకు రాత్రింబవళ్లు సేవలందించిన 427 మందికి సచివాలయంలో బుధవారం మంత్రి ఫరూక్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వరమే అండగా నిలిచేందుకు తానిచ్చిన పిలుపునకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ ఆధ్వర్యంలో సమితి బృంద సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు.

మైనారిటీ సంక్షేమ అంశాలపై చర్చ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలపై మంత్రి ఫరూక్ బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి కే హర్షవర్ధన్, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ సిహెచ్.శ్రీధర్‌తో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ సంక్షేమానికిస్తున్న ప్రాధాన్యతలో భాగంగా నిధుల మంజూరు, చేపట్టబోయే కార్యక్రమాలకు ప్రతిపాదనలపై చర్చించారు.



క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులతో కలెక్టర్ లక్ష్మీశ

జంతు సంక్షేమం మనందరి బాధ్యత

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్షేమమనేది మనందరి బాధ్యతని, జిల్లాలో జంతు సంరక్షణలో స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలు (జనవరి 14-30) సందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు గ్రామ, మండల స్థాయిలో క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా, విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలన్నారు. జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోసెస్ వెస్లీ, ఏడీ డాక్టర్ వి.కృష్ణమూర్తి, సమగ్రశిక్ష ఏఎంవో ఎస్.అశోక్‌బాబు, సెంట్రల్ ఎంఈవో విజయరామారావు పాల్గొన్నారు.



ఖఫ్తాన్ శారీతో కొత్తగా...

ఫ్యాషన్ డ్రెస్‌లు సౌకర్యానికి పెద్ద పీట వేస్తాయి. అలాగని సంప్రదాయాన్ని వదిలిపెట్టవు. అందుకే అవంటే అందరూ మోజు పడుతుంటారు. ఇలాంటి ఫ్యాషన్ ప్రపంచంలోకి 'ఖఫ్తాన్ శారీస్' మేమున్నామంటూ వచ్చేశాయి. మహిళలకు విపరీతంగా నచ్చేశాయి. ఒకవైపు చీరలా కనిపిస్తూ మరోవైపు అందమైన కుర్తీని గుర్తుకు తెస్తూ ఇండో వెస్ట్రన్ లుక్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చీర అంటే ఇష్టం ఉన్నప్పటికీ కట్టుకోవడానికి ఇబ్బంది పడే యువతులకు ఈ ఖఫ్తాన్ శారీ వరం లాంటిది.

- ఖఫ్తాన్ శారీని కాటన్, పట్టు, చందేరీ సిల్క్, జార్జెట్, టస్సర్... ఇలా ఏ రకం ఫ్యాబ్రిక్ చీరతోనైనా రూపొందించవచ్చు.
- వీటి తయారీ విషయానికి వస్తే... చక్కని చీరకు కుచ్చిళ్లు సెట్ చేసి... లెహంగా మాదిరి కుట్టేస్తారు. కొంగులో కొంత భాగాన్ని కుర్తీలా కుట్టి, మిగిలిన దాన్ని భుజాలమీదుగా వేలాడేలా జతచేస్తారు. చీర కొంగుకు ఉన్నట్టే కుర్తీని కూడా స్టెప్స్‌తో రూపొందిస్తున్నారు! ఇలాంటివి చిన్న పార్టీల్లో వేసుకోవడానికి బాగుంటాయి.
- కుర్తీకి కాలర్, స్టార్, వి, రౌండ్ నెక్ డిజైన్‌లను అమరుస్తున్నారు. నెక్ డిజైన్‌ను అనుసరించి బటన్స్ కూడా అమరుస్తున్నారు. వీటితోపాటు చక్కని ఎంబ్రాయిడరీ, సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌లు చేసిన ఖఫ్తాన్ శారీలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.
- కుర్తీ పొట్టిగా ఉన్నపుడు నడుము భాగంలో బెల్ట్ పెట్టుకుంటే చీర కట్టుకున్నట్టే కనిపిస్తుంది. అదే పొడవుగా ఉంటే లాంగ్ గౌన్ లుక్ వస్తుంది.
- ఖఫ్తాన్ శారీ ధరించినపుడు ఎక్కువగా ఆభరణాల అవసరం ఉండదు. చిన్న గొలుసు, ఒక ఉంగరం, చక్కని స్టడ్స్ ఉంటే చాలు. అలాగే ప్రత్యేకమైన హెయిర్ స్టయిల్ కూడా అక్కర్లేదు. ఎంత సాధారణంగా ఉంటే అంత హుందాగా కనిపిస్తారు. కేవలం ఈ డ్రెస్ స్టయిల్ ఒక్కటే అందరినీ చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది.



ఇలా చేద్దాం

ఇంట్లోనే కుంకుమ తయారీ ఇలా...

మహిళలు రోజూ నుదుటిమీద కుంకుమ బొట్టు పెట్టుకుంటూ ఉంటారు. కొంతమంది పాపిడి మధ్యలో సిందూరం దిద్దుకుంటారు. బజార్లో కొనుక్కున్న కుంకుమ వల్ల ఒక్కోసారి చర్మం మీద నల్లని మచ్చలు, కురుపులు ఏర్పడుతుంటాయి. అలాకాకుండా ఇంట్లోనే ఎర్రని కుంకుమ ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం!

కుంకుమ తయారీ

- ముందుగా మిక్సీ గిన్నెల్లో చిన్నదాన్ని తీసుకొని లోపల నీళ్ల చుక్కలు లేకుండా శుభ్రంగా తుడవాలి. అందులో నాలుగు చెంచాల పసుపు పొడి, ఒక చెంచా నెయ్యి వేసి రెండూ కలిసేలా చెంచాతో కలపాలి. తరవాత ఒక చెంచా నిమ్మరసం, చిటికెడు సున్నం వేసి కలపాలి. ఒక చెంచా గులాబీ నీళ్లు కూడా వేసి ఉండలు రాకుండా కలపాలి. ఈ గిన్నెను గ్రైండర్‌కు అమర్చి ఒక నిమిషం



గ్రైండ్ చేయాలి. మిక్సీ గిన్నెలో ఎర్రని కుంకుమ తయారవుతుంది. దాన్ని ఒక పళ్లెంలోకి తీసి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత అందమైన కుంకుమ భరిణెలో దాన్ని నిల్వ చేసుకోవచ్చు.

ఆమె గురించే అందరి ఆరా!

దివా జైమిన్ షా..... గౌతమ్ అదానీకి కాబోయే చిన్న కోడలిగా ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్‌లో పాల్గొన్న అదానీ కుటుంబం .. ఫిబ్రవరి 7న జీత్ అదానీ, దివాల వివాహాన్ని సంప్రదాయ రీతిలో జరిపిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో ఈమె గురించి నెట్టింట తెగ వెతికేస్తున్నారు.

ఎవరీ దివా జైమిన్ షా?

దేశంలో ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కూతురే దివా. వజ్రాల తయారీ సంస్థల్లో పేరుగాంచిన 'సి. దినేష్ అండ్ కో ప్రైవేట్ లిమిటెడ్ సహ యజమాని కూడా. సూరత్, ముంబైలలో పలు కేంద్రాలను నెలకొల్పి వజ్రాల వ్యాపారంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. అంతేకాదు తండ్రి మార్గనిర్దేశకత్వంతోపాటు జిగర్ దోషి, అమిత్ దోషి, యోమేష్ షా వంటి బృంద సభ్యుల సహకారంతో వ్యాపారాన్ని గ్లోబల్ డైమండ్ మార్కెట్ స్థాయికి చేర్చారు. నెదర్లాండ్స్ హాంకాంగ్‌లలోనూ కార్యాలయాలు స్థాపించారు. సామాజిక మాధ్యమాల్లో దివా యాక్టివ్‌గా ఉండరు. అయితే ఫైనాన్స్ వ్యాపార రంగాలకు సంబంధించి పలు అంశాల్లో ఆమెకు మంచి పట్టు ఉంది. ఇదే అదానీ కుటుంబాన్ని బాగా ఆకర్షించింది.



సాదాసీదాగా పెళ్లి!

ఇరు కుటుంబాలు ధనిక వర్గానికి చెందినవే కావడంతో వివాహం చాలా గ్రాండ్‌గా జరుగుతుందనీ, దేశ విదేశాల నుంచి ప్రముఖులు వస్తారనీ ఊహాగానాలు వినిపించాయి. కానీ పెళ్లి సాదాసీదాగా సంప్రదాయ పద్ధతిలో జరుగుతుందని గౌతమ్ అదానీ చెప్పారు. 2023 మార్చి 14న జీత్, దివాల నిశ్చితార్థం కాగా గత డిసెంబరులో ఉదయ్‌పూర్‌లో ప్రీ వెడ్డింగ్ ఫంక్షన్ జరిగింది. జీత్ అదానీ ప్రస్తుతం అదానీ గ్రూప్ ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్ అదానీ డిజిటల్ ల్యాబ్స్ వ్యవహారాలు కూడా చూసుకుంటున్నారు.



ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు

"పర్వతారోహణకు ధైర్య సాహసాలతోపాటు వాతావరణ పరిస్థితులను తట్టుకొనే దారుఢ్యం, ఓర్పు, సమయస్ఫూర్తి ఉండాలి. దాని కోసం నిరంతరమైన సాధన అవసరం అవుతుంది. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఉన్న అకాంగోవా పర్వతారోహణ కూడా ఎన్నో సవాళ్లు విసిరింది. ఈ నెల (2025 జనవరి) 10వ తేదీన మన దేశంలో బయలుదేరి.. 12వ తేదీన అర్జెంటీనా చేరుకున్నాను. సముద్ర మట్టానికి 6,961 మీటర్ల ఎత్తులో ఉన్న అంకాగోవా పర్వతాన్ని ఎక్కడానికి అవసరమైన డాక్యుమెంటేషన్ పూర్తి చేశాను. మా బృందంలో మొత్తం తొమ్మిదిమంది ఉన్నాం. అయిదుగురు మహిళలం, నలుగురు పురుషులు. మేము 13వ తేదీన బేస్‌క్యాంప్ నుంచి పర్వతారోహణ ప్రారంభించాం. మైనస్ 25 నుంచి మైనస్ 30 డిగ్రీల అతి శీతలమైన వాతావరణంలో, తీవ్రమైన చలిగాలుల మధ్య మా యాత్ర సాగింది. బేస్‌క్యాంప్‌నకు, గమ్యానికి మధ్య 70 శాతం భాగం మంచుతో కప్పేసి ఉంది. మిగిలిన భాగమంతా జారుడుగా ఉన్న రాళ్ల మార్గం. దాదాపు 6 వేల మీటర్ల ఎత్తుకు చేరుకొనేసరికి... పరిస్థితులను భరించలేక ఆరుగురు వెనుతిరిగారు. ఇద్దరు పురుషులు, నేను మాత్రమే గమ్యాన్ని చేరుకోగలిగాం. 13 రోజులపాటు సాగిన మా ఆరోహణ.... మన గణతంత్ర దినమైన జనవరి 26వ తేదీ ఉదయం అకాంగోవా శిఖరాగ్రం దగ్గర ముగిసింది. అక్కడ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను. 'భారత్ మాతాకీ జై' అని నినదిస్తూ మన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాను. ఆ క్షణంలో... నాలో ఏదో మహత్తరమైన భావోద్వేగం.

భువనగిరి ఖిల్లా మీద...

మాది తెలంగాణలోని యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి. నాన్న పడమటి మధుసూదన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ చంద్రకళ అంగన్వాడీ టీచర్. నాలుగేళ్ల క్రితం ఎంబీయే పూర్తి చేశాను. పర్వతారోహణ పట్ల నా ఆసక్తిని గమనించిన ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి. ఎవరెస్టర్ శేఖర్‌బాబు ఆ దిశగా ప్రోత్సహించారు. ఆయన పర్యవేక్షణలో భువనగిరి ఖిల్లా మీద నా ప్రాథమిక శిక్షణ సాగింది. అప్పుడే ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దేశ, విదేశాల్లోని అనేక పర్వతాల ఆరోహణతో నా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకున్నాను. ఆఫ్రికా ఖండంలో... సముద్రమట్టానికి 5,896 మీటర్ల ఎత్తులో ఉన్న కిలిమంజారోను 2020 జనవరిలో అధిరోహించడంతో నా సప్త ఖండాల పర్వతారోహణ మొదలయింది. 2021 డిసెంబరు 7న 5,642 మీటర్ల ఎత్తైన ఎల్‌బ్రస్ (యూరప్), 2022 మే 16న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 8,848.86 మీటర్ల ఎవరెస్ట్ శిఖరం (ఆసియా ఖండం), 2022 డిసెంబరు 17న సముద్రమట్టానికి 4,892 మీటర్ల ఎత్తులో ఉన్న విన్సన్ (అంటార్కిటికా) పర్వతాలను అధిరోహించాను. అయిదవదిగా... దక్షిణ అమెరికా ఖండంలోని అకాంగోవా కూడా పూర్తయింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన అన్విత కన్‌స్ట్రక్షన్స్ ఆర్థిక సాయం చేసింది. ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్‌గా వ్యవహరించింది. ప్రస్తుతం అన్విత ట్రాన్సెండ్ అకాడమీ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాను. ఇంకా... ఉత్తర అమెరికా ఖండంలోని అలస్కాలో... సముద్ర మట్టానికి 6,990 మీటర్ల ఎత్తులో ఉన్న డెనాలీ పర్వతాన్ని, ఆస్ట్రేలియాలో సముద్రమట్టానికి 2,228 మీటర్ల ఎత్తైన కోజిస్కో పర్వతాన్ని అధిరోహించాలి. త్వరలోనే వాటిని కూడా ఎక్కి... నా లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాను."

• పోతంశెట్టి కరుణాకర్
భువనగిరి టౌన్

విజేత



గెలుపు ముంగిట తడబడిన ప్రతిసారీ... మరింత పట్టుదలగా ప్రయత్నించింది. బలహీనతలను అధిగమించి... నైపుణ్యాన్ని మెరుగులు అద్దుకొని... బలమైన ప్రత్యర్థిగా మారింది. గ్రాండ్‌స్లామ్ గెలవాలన్న చిన్ననాటి కలను... మూడు పదుల వయసులో నెరవేర్చుకుంది. మహామహులను మట్టికరిపించి... 'ఆస్ట్రేలియన్ ఓపెన్'లో సరికొత్త చాంపియన్‌గా అవతరించిన అమెరికా సంచలనం... మాడిసన్ కీస్ కథ ఇది.

పడిలేచిన కెరటం

దాదాపు ఏడాదిన్నర కిందట... యూఎస్ ఓపెన్ సెమీఫైనల్. అవతలివైపు రెండో సీడ్ అరినా సబలెంక. పదిహేడో సీడ్‌గా బరిలోకి దిగిన మాడిసన్ కీస్... అంచనాలను తలకిందులు చేస్తూ తొలి సెట్‌ను ఏకపక్షంగా గెలుచుకుంది. రెండో సెట్... ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా తట్టుకొని... 5-4తో ముందుకు సాగింది. ఇంకొక్క గేమ్! గెలిస్తే ఫైనల్స్ బెర్త్. కీస్... సర్వీస్. స్టేడియం అంతా ఊపిరి బిగబట్టి వీక్షిస్తోంది. ఇంతలో ఊహించని మలుపు. సబలెంక మెరుపు దాడికి కీస్ కుదేలైంది. టైబ్రేకర్‌తో ఆ సెట్‌నే కాదు... తరువాతి సెట్‌ను కూడా ప్రత్యర్థికి కోల్పోయి... చేతులోకి వచ్చిన మ్యాచ్‌ను చేజార్చుకుంది కీస్. ఆటలో సరిజోడీగా పోటీపడినా... కీలక సమయంలో ఒత్తిడికి తల వంచింది. కానీ ఆ పరాజయం ఆమెలో మరింత కసి పెంచింది. విజయానికి దాన్ని ఒక సోపానంగా భావించింది. 'ఈ మ్యాచ్‌ను సానుకూలంగా తీసుకొంటే ఓటమిని గెలుపుగా మలచడం అసాధ్యమేమీ కాదు' అంటూ నాడు మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది కీస్. చెప్పినట్టే సరిగ్గా 16 నెలలు తిరక్కుండానే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలుచుకుంది. ఫైనల్లో డబుల్ డిఫెండింగ్ చాంపియన్, నెంబర్ వన్ సీడ్... సబలెంకాను ఓడించి కొత్త ఏడాది అద్భుత ఆరంభాన్ని అందుకుంది.

ఓటమి కొత్తకాదు...

వాస్తవానికి అంతిమ సమరంలో తడబడడం కీస్‌కు కొత్తేమీ కాదు. ఏడేళ్ల కిందట 2017లో కూడా యూఎస్ ఓపెన్ ఫైనల్ దాకా వచ్చి, టైటిల్ చేజార్చుకుంది. కెరీర్‌లో పది టైటిల్స్ సాధించిన ఆమె... గ్రాండ్‌స్లామ్ పోటీలకు వచ్చేసరికి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. ఇదే ఆఖరి నిమిషంలో గెలుపును దూరం చేస్తోంది. దీని నుంచి బయటపడడానికి ఎంతోమంది మానసిక నిపుణులను సంప్రతించింది. వారి సూచనలతో ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ అదే పరిస్థితి. భర్త, కోచ్ బిజోర్న్ ఫ్రాటాంజెలో నేతృత్వంలో పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకొని, శారీరకంగా, మానసికంగా తనను తాను మార్చుకోవాలని నిశ్చయించుకుంది. అప్పటివరకు పొట్టి హ్యాండిల్ ఉన్న విల్సన్ రాకెట్‌తో ఆడిన ఆమె... కాస్త పొడుగు హ్యాండిల్ గల యోనెక్స్ రాకెట్‌ను పట్టుకుంది. గత సీజన్‌లో సగానికిపైగా మ్యాచ్‌లను దానికి అవాటుపడటానికి కేటాయించింది. స్పోర్ట్స్ సైకాలజిస్టును కలిసి మానసికంగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను అతడి ముందు పెట్టింది.

ఆత్మసమీక్ష చేసుకొని...

'గతంలో ఎన్నో స్పోర్ట్స్ థెరపీలు తీసుకున్నా. అవన్నీ ఆట నుంచి దృష్టి మరలకుండా మనల్ని మనం నియంత్రించుకోగలగడం గురించి. అయితే దానికన్నా ప్రస్తుతం అనుసరిస్తున్న థెరపీ మరింత మెరుగైన ఫలితాలను ఇస్తోంది. ఇందులో నా గురించి నేను ఏమనుకొంటున్నాను? నా పట్ల నేను ఎంత నిజాయతీగా ఉన్నాను? అనేది తెలుసుకోగలగడం ప్రధానం. నిజంగా ఇది చాలా కష్టం. ఎందుకంటే మానసిక ఆందోళనకు గురవుతున్నాననే విషయం నేను చాలా రోజులు అంగీకరించలేకపోయాను. నిజాయతీగా ఆత్మసమీక్ష చేసుకున్నాక నా దృక్పథంలో మార్పు వచ్చింది. సన్నిహితులతో కూడా ఈ విషయాలపై దాపరికం లేకుండా చర్చించడం మొదలుపెట్టాను' అంటున్న కీస్‌లో ఇప్పుడు మైదానంలో మునుపెన్నడూ లేనంతగా ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతోంది.

ఫెదరర్ స్ఫూర్తితో...

ఇలినాయిస్‌లోని రాక్ ఐలాండ్‌లో పుట్టిన కీస్... టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు వీరాభిమాని. అతడి స్ఫూర్తితోనే



ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా ఎదిగింది. టీవీలో వింబుల్డన్ చూస్తూ ఆటపై మక్కువ పెంచుకున్న ఆమె... నాలుగేళ్ల వయసులోనే టెన్నిస్ కోర్టులోకి అడుగుపెట్టింది. ఆమె తండ్రి రిక్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. నలుగురు కూతుళ్లలో రెండో సంతానం కీస్. 'క్రిస్ ఎవర్ట్ టెన్నిస్ అకాడమీ'లో శిక్షణ పొందింది. ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా 2009లో కెరీర్‌ను ప్రారంభించి, ఏడాది తిరక్కుండానే తొలి ఐటీఎఫ్ టైటిల్ సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచింది. 2017 యూఎస్ గ్రాండ్‌స్లామ్‌లో ఫైనల్స్‌కు చేరి అందర్నీ ఆశ్చర్యపరిచింది. రెండేళ్ల తరువాత సిన్సినాటీ టైటిల్ నెగ్గిన ఆమె... ఆ తరువాత మరింత దూకుడు పెంచింది. 2023లో ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్10లో స్థానం సంపాదించింది. అప్పటి నుంచీ అద్భుతమైన ఫామ్‌తో అదరగొడుతూ... ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టింది. గతవారం ముగిసిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కీస్ ఆట మరో స్థాయిలో ఉందనేది మాజీల మాట. మూడో రౌండ్‌లో పదో సీడ్ కొలిన్స్‌ను ఇంటి దారి పట్టించిన ఆమె... నాలుగో రౌండ్‌లో ఆరో సీడ్ ఎలెనా రిబికినాను ఓడించింది. సెమీస్‌లో రెండో సీడ్, పోలండ్ స్టార్ ఇగా స్వియటెక్‌పై గెలిచి, తుది పోరులో టాప్‌సీడ్ సబలెంకాను ఓడించి, కెరీర్‌లో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడింది. తొలి, రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ మధ్య దాదాపు ఎనిమిదేళ్ల విరామం ఉంది. గ్రాండ్‌స్లామ్ చరిత్రలో ఇదే సుదీర్ఘ విరామం. అంతేకాదు... పెనెట్టా (49), బర్తోలి (47) తరువాత అత్యంత పెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది.

గాయాలు వేధించినా...

గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భుజం గాయంతో ఇబ్బంది పడిన కీస్, ఆ తరువాత తొడ కండరాల సమస్యతో వింబుల్డన్ నాలుగో రౌండ్ నుంచే నిష్క్రమించింది. ముఖ్యమైన టోర్నీల్లో గాయాలు వేధించినా, మధ్యలోనే తప్పుకోవాల్సిన పరిస్థితులు ఎదురైనా ఆమె దిగులు పడలేదు. అలాంటి క్లిష్ట సమయంలో భర్త అండతో... అతడి మార్గదర్శకత్వంలో గాయాల నుంచి కోలుకుంది. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి బరిలోకి దిగింది. ఇప్పుడు టెన్నిస్ కోర్టులో పాదరసంలా కదులుతూ ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అత్యంత కీలక దశల్లో ఒత్తిడిని జయించి విజృంభిస్తోంది.

ఇల్లు శుభ్రంగా ఉండాలంటే...

ఇల్లు అద్దంలా మెరుస్తూ ఉండాలని అందరూ కోరుకుంటారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడమనేది నిరంతర ప్రక్రియ. ఇంట్లో గోడలు, తలుపులు, వస్తువులపై సాధారణంగా ఏర్పడే మరకలు ఇంటి అందాన్ని తగ్గిస్తుంటాయి. చిన్న చిట్కాలు పాటిస్తూ ఇంటిని ఆహ్లాదరకరంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం!

- వంటగదిలో స్టీల్ సింక్‌పైన, కుళాయిల చుట్టూ తెల్లని నీటి మరకలు ఏర్పడుతుంటాయి. వీటిని ఎంత రుద్ది కడిగినా పోవు. అలాంటప్పుడు ఒక చెంచా ఆలివ్ నూనెకి అరచెంచా ఉప్పు కలిపి ఈ మిశ్రమాన్ని మరకల మీద రాయాలి. గంటసేపు ఆరినతరవాత వేడినీళ్లతో కడిగేస్తే మరకలన్నీ పోతాయి.
- సాధారణంగా ఇంట్లో గోడలపై చిన్న పిల్లలు క్రేయాన్స్‌తో గీతలు గీస్తుంటారు. బొమ్మలు వేస్తుంటారు. వీటిని పోగొట్టడానికి చేసే ప్రయత్నాల వల్ల గోడలు పాడైపోతుంటాయి. అలాకాకుండా హెయిర్ డ్రైయర్‌తో వేడిగాలిని మరకలకు తగిలేలా చేయాలి. తరవాత సబ్బునీళ్లలో ముంచిన గుడ్డతో తుడిచేస్తే క్రేయాన్స్ మరకలతోపాటు చేతి గుర్తులు, ఇతర జిడ్డు మరకలు కూడా పోతాయి.
- ఓవెన్‌లో ఒక్కోసారి పదార్థాలు పడిపోతూ ఉంటాయి. లోపలి భాగం అంతా జిడ్డుగా మారుతుంది కూడా. అలాంటప్పుడు ఒక గిన్నెలో రెండు నిమ్మ చెక్కలు వేసి దాన్ని ఓవెన్‌లో పెట్టి అధిక ఉష్ణోగ్రత సెట్ చేసి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత ఓ తడిగుడ్డతో లోపల తుడిచేస్తే చాలు. అలాగే.. ఓవెన్ తలుపు మీద కూడా చేతి గుర్తులు, ఇతర మరకలు ఏర్పడుతుంటాయి. ఒక చెంచా బేకింగ్ సోడాకు అర



చెంచా నీళ్లు కలిపి ఈ మిశ్రమాన్ని తలుపు మీద రాసి అరగంట తరవాత పొడిగుడ్డతో తుడిచేస్తే మరకలన్నీ పోయి ఓవెన్ తలుపు తళతళలాడుతుంది.

- వంట పూర్తయిన వెంటనే స్టవ్‌ను కాగితం లేదా పలుచని గుడ్డతో తుడిచేయాలి. దీనివల్ల స్టవ్ పరిశుభ్రంగా ఉండడమే కాకుండా ఎక్కువకాలం మన్నుతుంది. స్టవ్‌ను ఉంచిన గట్టును రెండు రోజులకోసారి సబ్బునీళ్లతో శుభ్రం చేయాలి.
- వాష్‌బేసిన్‌పై కూడా రకరకాల మరకలు ఏర్పడుతుంటాయి. వీటిపై టూత్‌పేస్ట్ రాసి అరగంట తరవాత నీళ్లతో తడిపిన స్పాంజ్‌తో తుడిచేస్తే చాలు.
- డ్రెస్సింగ్ మిర్రర్, కిటికీల అద్దాలను తరచూ కాగితంతో తుడవడం వల్ల అవి మెరుస్తుంటాయి. టీవీ స్క్రీన్, ఫ్రిజ్, సోఫాలను రోజుకు ఒకసారి పొడి గుడ్డతో తుడవాలి.
- ఇంట్లో ఉండే ఫ్యాన్‌లు, కిటికీలు, తలుపులను వారానికి ఒకసారి సబ్బునీళ్లతో శుభ్రం చేయాలి.
- బూజు, దుమ్ము, ధూళి లేకుండా ఇంటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

సజ్జ రొట్టెలు మెత్తమెత్తగా...

సజ్జ పిండిలో జీర్ణవ్యవస్థకు హాని కలిగించే గ్లూటన్ ఉండదు. ఈ పిండి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. అందుకే సజ్జ రొట్టెలు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సజ్జ రొట్టెలు మెత్తగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.

- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి అరచెంచా ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి అయిదు నిమిషాలు మరిగించి దించాలి. ఇందులో ఒక గ్లాసు సజ్జ పిండి వేసి మెల్లగా కలుపుతూ ముద్దలా చేయాలి. దీనిపై తడిగుడ్డ కప్పి పది నిమిషాలు నాననిస్తే పిండి ఉబ్బుతుంది. రొట్టెలు కూడా మెత్తగా వస్తాయి.
- సజ్జ పిండిని ఎక్కువసేపు కలపకూడదు. నీళ్లు కలిసి ముద్దలా అయితే చాలు. గోధుమపిండి మాదిరి ఒత్తుతూ కలిపితే సజ్జపిండి జిగురుగా మారుతుంది. రొట్టెలు చేయడం కష్టమవుతుంది.
- సజ్జ రొట్టెలను పలుచగా ఒత్తకూడదు. కొంచెం మందంగానే ఉండాలి. పొడి పిండి చల్లుకుంటూ పెద్దగా నొక్కకుండా తేలికగా ఒత్తాలి.
- స్టవ్ మీద ఇనప పెనం పెట్టి అది వేడెక్కాక సజ్జ రొట్టెను జాగ్రత్తగా వేయాలి. ఒకవైపు కాలిన తరవాతే రెండో వైపుతిప్పాలి.
- సజ్జ రొట్టెలు త్వరగా గట్టిపడతాయి. కాబట్టి ఎక్కువసేపు కాల్చకూడదు. రొట్టెమీద గోధుమ రంగుచుక్కలు కనిపించగానే రెండోవైపునకు తిప్పాలి. రెండు వైపులా దోరగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసి కొద్దిగా నెయ్యి రాయాలి. రొట్టెలు ఆరిపోకుండా పలుచని గుడ్డ కప్పాలి. ఇలాచేస్తే చాలా సమయం వరకు రొట్టెలు మెత్తగా ఉంటాయి.



బిజినెస్

విజయవాడ ● గురువారం 30 జనవరి 2025

ఐటీసీ హోటల్స్ షేరు 5 శాతం డౌన్

ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ షేరు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టయింది. బీఎస్ఈలో రూ.188 వద్ద లిస్టయిన షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 5 శాతం నష్టంతో రూ.178.60 వద్దకు జారుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.37,169.71 కోట్లుగా నమోదైంది. దేశంలోని అతిపెద్ద వ్యాపార గ్రూప్‌ల్లో ఒకటైన ఐటీసీ లిమిటెడ్.. తన హోటళ్ల వ్యాపారాన్ని ప్రత్యేక సంస్థగా విభజించింది. ఈ జనవరి 1 నుంచి వ్యాపార విభజన అమల్లోకి రాగా.. ఐటీసీ హోటల్స్ షేర్ల కేటాయింపునకు అర్హులైన వాటాదారులను ఈనెల 6న గుర్తించారు. డీమెర్జర్ పథకం ప్రకారం.. ఐటీసీ లిమిటెడ్ షేర్‌హోల్డర్లు తాము కలిగి ఉన్న ప్రతి 10 షేర్లకుగాను ఐటీసీ హోటల్స్ లిమిటెడ్‌కు చెందిన షేరు ఒకటి లభించింది.

వచ్చే ఐదేళ్లలో 200కు పైగా హోటళ్లు

ఐటీసీ హోటల్స్ వ్యాపారాన్ని వేగంగా విస్తరించాలనుకుంటోంది. వచ్చే ఐదేళ్లలో హోటళ్ల సంఖ్యను 200 పై స్థాయికి పెంచుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం ఐటీసీ హోటల్స్ దేశవ్యాప్తంగా 140కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.

కీలక ఖనిజాల మిషన్‌కు రూ.34,300 కోట్లు

కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర..పీఎస్‌యూల నుంచి రూ.18,000 కోట్లు



న్యూఢిల్లీ: జాతీయ ప్రాధాన్యత ఉన్న అరుదైన రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి 24 కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎం) పేరుతో ప్రత్యేక జాతీయ మిషన్ ఏర్పాటు చేసింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ కీలక ఖనిజాల దిగుమతులను తగ్గించి, స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ విషన్ ద్వారా వచ్చే ఏడేళ్లలో రూ.34,300 కోట్లు ఖర్చు చేయనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఇందులో రూ.18,000 కోట్లు ప్రభుత్వ రంగ సంస్థలు, రూ.16,300 కోట్లు ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెడతాయన్నారు.

ఎందుకంటే ?

ప్రస్తుతం దేశంలో నడుస్తున్న వాహనాల్లో దాదాపు 90 శాతం పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలతో నడుస్తూ, పెద్ద ఎత్తున పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. విద్యుత్ వాహనాల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అయితే ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీలతో పాటు పవన విద్యుత్ కేంద్రాల టర్బైన్లు, విద్యుత్ పరికరాలు, సరఫరాల్లోనూ ఈ ఖనిజాలది కీలక పాత్ర. ప్రస్తుతం మన దేశంలో ఈ ఖనిజ నిక్షేపాలు, నిల్వలు చాలా తక్కువ. ఈ సమస్యను అధిగమించేందుకు దేశ, విదేశాల్లో ఈ ఖనిజాల అన్వేషణ, ప్రాసెసింగ్, ఉత్పత్తి, రీసైక్లింగ్ వరకు అన్ని స్థాయిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ఈ మిషన్ ప్రారంభించింది. విదేశాల్లో ఈ తరహా ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తికి ముందుకు వచ్చే దేశీయ కంపెనీలకు కూడా ప్రభుత్వం సహాయ పడుతుందని వైష్ణవ్ చెప్పారు.

ఇస్రోకు ఏటీఎల్, ఎంటార్ కీలక పరికరాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బుధవారం మన దేశం ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ విజయంలో హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్, ఎంటార్ టెక్నాలజీస్ కీలక పాత్ర పోషించాయి. ఇస్రో 100వ ఉపగ్రహ ప్రయోగం ఒక చారిత్రక విజయమని, ఆ విజయంలో తాము కూడా భాగస్వాములు కావడం ఆనందదాయకమని రెండు సంస్థలు ప్రకటించాయి. ఈ రెండు సంస్థలు ఎన్‌వీఎస్-02 ఉపగ్రహానికి, జీఎస్ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌కు కీలకమైన భాగాలు సరఫరా చేశాయి.

అనంత్ టెక్నాలజీస్: ఈ సంస్థ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహానికి ఆల్టిట్యూడ్, ఆర్బిట్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, డీసీ-డీసీ కన్వర్టర్‌తో కూడిన స్టార్ సెన్సర్ మార్క్-3 సరఫరా చేసింది. అలాగే జీఎస్ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌కు డేటా ఎక్విజిషన్ యూనిట్లు, ట్రాన్స్‌పాండర్లు, పవర్ మాడ్యూల్స్, రిలే యూనిట్లు, కంట్రోల్ మాడ్యూళ్ల సహా 40 కీలక వ్యవస్థలు సరఫరా చేసినట్టు కంపెనీ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు. తమ సంస్థ ఇప్పటివరకు 103 ఉపగ్రహాలు, 83 ప్రయోగవాహక రాకెట్లకు కీలక భాగాలు సమకూర్చి ఇస్రో విజయాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు.

ఎంటార్ టెక్నాలజీస్: ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో అందె వేసిన చేయిగా పేరొందిన ఎంటార్ టెక్నాలజీస్ జీఎస్ఎల్‌వీ రాకెట్‌కు వికాస్ ఇంజిన్లు, క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ వ్యవస్థలు, ఎలక్ట్రో న్యూమాటిక్ మాడ్యూల్స్ సరఫరా చేసినట్టు కంపెనీ ఎండీ పర్వత్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పరికరాలన్నీ రాకెట్ స్థిరత్వానికి, నిలకడగా పని చేయడానికి కీలకంగా నిలిచాయని తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి చేసిన పరికరాలతో పాటు విదేశాల నుంచి సేకరించిన ఆటమిక్ గడియారాలు కచ్చితమైన కాలాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడ్డాయన్నారు.

మైండ్‌స్పేస్ రీట్ చేతికి సస్టెయిన్ ప్రాపర్టీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రియల్టీ రంగంలోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్) హైదరాబాద్‌లో సస్టెయిన్ ప్రాపర్టీస్ కంపెనీని కొనుగోలు చేసింది. ఈ సంస్థ చేతిలో 18.2 లక్షల కార్యాలయ స్థలం అందుబాటులో ఉంది. ఈ డీల్ ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.2038 కోట్లు కాగా ఈక్విటీ విలువ రూ.613 కోట్లని మైండ్‌స్పేస్ రీట్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ప్రకటనలో తెలిపింది. సస్టెయిన్ ప్రాపర్టీస్‌లో నూరు శాతం వాటాల కొనుగోలుకు తాము కుదుర్చుకున్న ఈ డీల్ మార్చి నాటికి పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని 'కామర్‌జోన్, రాయదుర్గ్'లో క్వాల్‌కామ్ కంపెనీకి లీజుకిచ్చిన ఈ కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేయడానికి తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది. ఇందుకుగాను సస్టెయిన్ ప్రాపర్టీస్ వాటాదారులకు రూ.379.08 యూనిట్ విలువతో 1,61,68,090 మైండ్‌స్పేస్ రీట్ యూనిట్లు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన కేటాయించేందుకు బోర్డు ఆమోదించిందని పేర్కొంది. ఇందుకోసం కంపెనీ రూ.1400 కోట్ల రుణం సమీకరిస్తోంది.

టాప్ గేర్‌లో మారుతి

క్యూ3లో రూ.3,727 కోట్ల నికర లాభం

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ సంస్థ వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.38,764 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.3,727 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం, నికర లాభం 16 శాతం చొప్పున పెరిగాయి. ఏకీకృత (స్టాండ్ అలోన్) ప్రాతిపదికన క్యూ3లో కంపెనీ ఆదాయం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.31,860 కోట్ల నుంచి రూ.36,802 కోట్లకు చేరింది. నికర లాభం రూ.3,130 కోట్ల నుంచి రూ.3,525 కోట్లకు చేరింది.

తొమ్మిది నెలలకు: డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో మారుతి నికర అమ్మకాలు రూ.98,240 కోట్ల నుంచి రూ.1,06,266 కోట్లకు పెరిగాయి. ఇదే సమయంలో కంపెనీ నికర లాభం రూ.9,331 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు చేరింది.

వాహన అమ్మకాలూ అదుర్స్ : డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ 5,66,213 వాహనాలు విక్రయించింది. 2023 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 13 శాతం ఎక్కువ. ఇందులో 4,66,993 వాహనాలను దేశీయ మార్కెట్‌లో, 99,220 వాహనాలను విదేశీ మార్కెట్ల విక్రయించింది. గతంలో ఏ ఒక్క త్రైమాసికంలోనూ కంపెనీ ఇన్ని వాహనాలను ఎగుమతి చేయలేదు. డిసెంబరు, 24తో ముగిసిన తొమ్మిది నెలలను పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ వాహన అమ్మకాలు, డిసెంబరు, 23తో పోలిస్తే ఐదు శాతం వృద్ధితో 16,29,631 యూనిట్లకు చేరాయి. మళ్లీ ఇందులో 13,82,135 వాహనాలను దేశీయ మార్కెట్‌లో, 2,47,496 వాహనాలను విదేశాలకు ఎగుమతి చేసింది.

MARUTI SUZUKI

మళ్లీ టకెయుచినే ఎండీ, సీఈఓ

హిసాషి టకెయుచిని మరో మూడేళ్ల పాటు కంపెనీ ఎండీ, సీఈఓగా నియమించేందుకు బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. సుజుకీ మోటార్ గుజరాత్ కంపెనీని మారుతి సుజుకీ ఇండియాలో విలీనం చేసే తీర్మానానికి కూడా ఆమోదం తెలిపింది.

టాటా మోటార్స్ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో టాటా మోటార్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,13,575 కోట్ల ఆదాయంపై రూ.5,578 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం రూ.2,998 కోట్లు పెరిగినా, నికర లాభం మాత్రం 22 శాతం పడిపోయింది. ఖర్చులు రూ.1,04,494 కోట్ల నుంచి రూ.1,07,627 కోట్లకు పెరగడం మూడో త్రైమాసికంలో టాటా మోటార్స్ లాభాలకు గండి కొట్టింది. ప్రయాణికుల వాహన అమ్మకాల ఆదాయం 4.3 శాతం, వాణిజ్య వాహనాల అమ్మకాల ఆదాయం 8.4 శాతం పడిపోవడం కంపెనీ లాభాలను దెబ్బతీసింది. ఇదే సమయంలో జాగ్వార్ లాండ్ రోవర్ ఆదాయం రికార్డు స్థాయిలో 750 కోట్ల పౌండ్లకు చేరినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీశ్ వాఘ్ చెప్పారు.

పసిడి కొత్త రికార్డు

రూ.83,750కి చేరిన తులం ధర



న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం ధరలు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.910 పెరుగుదలతో రూ.83,750కి చేరుకుంది. 99.5 స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో పెరిగి రూ.83,350 స్థాయికి ఎగబాకింది. అంతర్జాతీయంగా బంగారం రేటు పెరగడంతో పాటు దేశీయంగా ఆభరణాల తయారీదారులు, రిటైలర్లు కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. కాగా, కిలో వెండి రూ.1,000 పెరుగుదలతో రూ.93,000 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,794.70 డాలర్ల స్థాయికి ఎగబాకగా.. వెండి 30.99 డాలర్ల వద్ద ట్రేడైంది.

631 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు జరపడంతో ఈక్విటీ సూచీలు బుధవారం ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ 631.55 పాయింట్ల లాభంతో 76,532.96 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 205.85 పాయింట్ల వృద్ధితో 23,163.10 వద్ద స్థిరపడింది. జొమాటో షేరు 6.79 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- బుధవారం లిస్టింగ్ అయిన డెంటా వాటర్ అండ్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ షేరు ఐపీఓ ధర రూ.294తో పోలిస్తే 17.84 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.346.45 వద్ద తొలిరోజు ట్రేడింగ్‌ను ముగించింది.
- డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓకు తొలిరోజు కేవలం 7 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,850 ▲	75,950 ▲	1,04,000 ▲
విజయవాడ	83,500 ▲	78,500 ▲	93,500 ▲
విశాఖపట్నం	80,840 ▲	74,100 ▲	91,680 ▲
రాజమండ్రి	82,850 ▲	75,950 ▲	92,600 ▼
ప్రొద్దుటూరు	82,200 ▲	76,120 ▲	93,000 ▲
ముంబై	80,980 ▲	74,170 ▲	90,680 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	120
వరంగల్	109	గుంటూరు	118
కరీంనగర్	109	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	97
కర్నూలు	109	నెల్లూరు	102
విశాఖపట్నం	112	అనంతపురం	102
గోదావరి	120		

స్పోర్ట్స్

మహిళల 400 మీ. కోచ్‌గా జెర్రీ లీ



న్యూఢిల్లీ : జెర్రీ లీ హోనెస్..జమైకాకు చెందిన ప్రఖ్యాత అథ్లెటిక్ కోచ్. ఎలాని థాంప్సన్, నెస్టా కార్టర్ వంటి ఒలింపిక్ చాంపియన్లకు మార్గదర్శనం చేశాడు. అలాంటి జెర్రీ..భారత మహిళల 400 మీటర్ల జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ మేరకు తిరువనంతపురంలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో అతడు బాధ్యతలు స్వీకరించాడు. 400 మీ. పరుగుతోపాటు 400 మీ. హర్డిల్స్ జట్టుకూ శిక్షణ ఇస్తాడు.

శ్రీకాంత్ శుభారంభం

పటుమ్యాన్ (థాయ్‌లాండ్): కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-18తో డుబోవెంకో (ఇజ్రాయిల్)పై గెలిచి, ముందంజ వేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో సుబ్రమణియన్ విజయం సాధించగా ఆయూష్ షెట్టి, మిథున్ మంజునాథ్ ఓటమి పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్వికా శివాని-రోహన్ కపూర్ జోడీ 21-8, 21-16తో సరారత్ చుబోకా-పక్షరుంగ్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గింది.

ఏపీఓఏ కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు

అమరావతి (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడలకు రాష్ట్రం నుంచి క్రీడాకారులను పంపే అధికార పరిధి ఆర్‌కె.పురుషోత్తం నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ)కే ఉందని సింగిల్ జడ్జి కె.మన్మథరావు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న తమ వాదనలు వినకుండా సింగిల్ జడ్జి తుది ఉత్తర్వులు ఇచ్చారంటూ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)తో పాటు రాష్ట్ర కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, జూడో సంఘాలు హైకోర్టులో పిటిషన్ వేశాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ ధీరజ్‌సింగ్ బెంచ్ క్రీడాకారులను పంపే విషయంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు అవరోధం కాబోవని స్పష్టం చేసింది. ఇక ఏపీఓఏకి సంబంధించిన ఇతర వ్యవహారాలపై విచారించేందుకు వీలుగా ఈ పిటిషన్‌ను వచ్చే నెల 3వ తేదీన సింగిల్ జడ్జి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

అర్జున్ పాయింట్ పంచుకున్నాడు!

విక్ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నీలో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి మరో గేమునూ డ్రా చేసుకున్నాడు. విన్సెంట్ కీమర్ (జర్మనీ)తో బుధవారం జరిగిన పదోరౌండ్ గేమ్‌లో 38 ఎత్తుల అనంతరం పాయింట్ పంచుకున్నాడు. అర్జున్‌కిది వరుసగా మూడో డ్రా. ఇక వార్మెర్డామ్‌పై గెలుపొందిన గుకేష్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఫెడొసీవ్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో భారత ఆటగాడు మెండోకా గేమ్ కూడా ఫలితం లేకుండా ముగిసింది.

తిలక్ @ 2

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



వరుణ్ చక్రవర్తి

తిలక్ వర్మ

దుబాయ్ : టీమిండియా యువ సంచలనం తిలక్ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఇక మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఏకంగా 25 స్థానాలు ఎగబాకాడు. హైదరాబాద్ బ్యాటర్ తిలక్..ఇంగ్లండ్‌తో ప్రస్తుత టీ20 సిరీస్ రెండో మ్యాచ్‌లో (72 నాటౌట్) అదరగొట్టాడు. దాంతో బుధవారంనాటి తాజా ర్యాంకింగ్స్‌లో అతడు 832 పాయింట్లతో రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ హెడ్ (855) కేవలం 23 పాయింట్ల ఆధిక్యంతో టాప్‌లో నిలిచాడు. తిలక్ తాజా ఫామ్‌ను బట్టిచూస్తే..రాబోయే ర్యాంకుల్లో అతడు టాప్‌నకు చేరే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే పిన్న వయస్సులో 'టాపర్'గా నిలిచిన రికార్డు కూడా వర్మ (22 ఏళ్ల)కు లభిస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు బాబర్ ఆజమ్ (23 ఏళ్ల 105 రోజులు) పేరిట ఉంది. తాజా రేటింగ్ పాయింట్లతో తిలక్..అత్యధిక పాయింట్లు పొందిన నాలుగో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు సూర్యకుమార్, విరాట్, కేఎల్ రాహుల్ ఈ జాబితాలో ఉన్నారు. ఇంగ్లండ్‌తో మూడో టీ20లో (5/24) ఐదు వికెట్లతో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తి (666 పాయింట్లు) ఐదో ర్యాంక్‌కు చేరాడు.

ధీనిధికి మూడు స్వర్ణాలు



హల్ద్వాని: జాతీయ క్రీడల్లో 14 ఏళ్ల పారిస్ ఒలింపిక్ స్విమ్మర్ ధీనిధి దేశింగు మూడు స్వర్ణాలతో ప్రకంపనలు సృష్టించింది. మరో పారిస్ ఒలింపియన్ శ్రీహరి నటరాజ్ కూడా రెండు పసిడి పతకాలు సొంతం చేసుకొన్నాడు. కర్నాటకకు చెందిన ధీనిధి మహిళల 200 మీటర్ల ఫ్రీ స్టయిల్ రేస్‌లో 2 నిమిషాల 3.24 సెకన్ల గేమ్స్ రికార్డు టైమింగ్‌తో స్వర్ణం నెగ్గింది. 2022లో జాతీయ క్రీడల్లో హషికా రామచంద్ర నెలకొల్పిన (2 నిమిషాల 7.08 సెకన్ల) రికార్డును ధీనిధి బద్దలుకొట్టింది. 100 మీ. బటర్‌ఫ్లై ఈవెంట్‌లో మరో పసిడిని దక్కించుకొన్న దేశింగు.. 4×100 మీ ఫ్రీ స్టయిల్ రిలే జట్టు స్వర్ణం నెగ్గడంలోనూ కీలకపాత్ర పోషించింది. 200 మీ.ఫ్రీ స్టయిల్‌లో శ్రీహరి తొలి స్వర్ణంతో మెరిశాడు. ఆ తర్వాత 4×100 మీ. ఫ్రీ స్టయిల్ రిలేలో అనీష్, ఆకాశ్‌మణి, చినాతన్‌తో కలసి శ్రీహరి రెండో పసిడి నెగ్గాడు.



హక్కుల కోసం ఆటతోనే ధిక్కారం!

- బరిలోకి అఫ్ఘాన్ మహిళా క్రికెట్ జట్టు
- నేడు మెల్‌బోర్న్ వేదికగా మ్యాచ్
- తాలిబన్లనే ఎదిరిస్తున్న ధీర వనితలు




ఫిరోజా అమీరి

మెల్‌బోర్న్: అఫ్ఘానిస్థాన్ క్రికెట్‌లో చారిత్రక ఘట్టం చోటు చేసుకోనుంది. మహిళల హక్కులను కాలరాస్తున్న తాలిబన్ల ఛాందస భావాలను నిగ్గదీసే ఉద్యమం అంతర్జాతీయ వేదికగా ఉవ్వెత్తున ఎగసిపడనుంది. స్వేచ్ఛ కోసం.. క్రికెట్‌పై ఉన్న ప్రేమ కోసం.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దులు దాటిన అఫ్ఘాన్ మహిళలు దాదాపు మూడేళ్ల తర్వాత జట్టుగా బరిలోకి దిగనున్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో గురువారం 'విత్‌అవుట్ బోర్డర్స్ లెవెన్'తో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో అఫ్ఘాన్ మహిళల జట్టు బరిలోకి దిగనుంది. ఇది కేవలం క్రికెట్ మ్యాచ్ కాదు. తమ హక్కులు.. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అఫ్ఘాన్ మహిళలు చేస్తున్న పోరాటం. ఆడవాళ్లు బయటకు రాకుండా, చదువుకోకుండా అణచి వేస్తున్న తాలిబన్ పాలకులను నిలదీస్తున్న ధీర వనితల పోరాటం. ప్రాణాలు పోతాయనే హెచ్చరికలు వచ్చినా.. అఫ్ఘాన్ మహిళా క్రికెటర్లు అదరలేదు.. బెదరలేదు. కోటి ఆశలతో కొంగొత్త జీవితాన్ని కోరుకొంటున్న ఈ అమ్మాయిలు.. అగచాట్లు అనుభవిస్తున్న సదరు అఫ్ఘాన్ మహిళలకు గొంతుక కావాలనుకొన్నారు. వీరందరికీ ఆదర్శం, మార్గదర్శి ఫిరోజా అమీరి. ఆశ్రయం కోసం పలు దేశాలను అభ్యర్థించిన అమీరికి ఆస్ట్రేలియా సాయం చేసింది. అయితే, తనతోపాటు తన టీమ్ కూడా రావాలని ఆమె చేసిన పోరాటం ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపింది. 2021లో అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు 21 మందికి కాంట్రాక్ట్‌లు ఇచ్చింది. అయితే, పాలన తాలిబన్ల చేతిలోకి వెళ్లడంతో వారందరూ చెల్లాచెదురయ్యారు. అమీరి వారిని సంఘటితం చేసి ఆస్ట్రేలియాలో ఆశ్రయం పొందేలా చేసింది. ఇప్పటి వరకూ వివిధ క్లబ్‌లకు ఆడుతూ ఉన్న వీరు.. మూడేళ్ల తర్వాత అఫ్ఘాన్ మహిళల క్రికెట్ జట్టుగా బరిలోకి దిగనున్నారు. 'మాకందరికీ ఈ రోజు ఎంతో ప్రత్యేకం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దేశాన్ని వీడాం. మళ్లీ ఇప్పుడు అందరం ఒక్కటయ్యాం' అని అమీరి భావోద్వేగంతో చెప్పింది. అఫ్ఘాన్ మహిళల విద్య, క్రీడలు, భవిష్యత్తుకు ఈ మ్యాచ్ దారులు తెరుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేసింది.

క్వార్టర్స్ చేరేదెవరో?

- నేటి నుంచి రంజీ ఆఖరి లీగ్ మ్యాచ్‌లు
- ప్రత్యేక ఆకర్షణగా కోహ్లీ



విరాట్ కోహ్లీ

న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ లీగ్ దశ తుది అంకానికి చేరుకొంది. విదర్భ మాత్రమే నాకౌట్ చేరుకోగా.. క్వార్టర్స్ బెర్త్ కోసం ఏడు జట్లు పోటీపడుతుండడంతో గురువారం నుంచి జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్ ఆయా జట్లకు కీలకంగా మారింది. ఇక, ఢిల్లీ తరఫున 12 ఏళ్ల తర్వాత విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ ఆడనుండడం ప్రత్యేక ఆకర్షణ. గ్రూప్-డిలో ఢిల్లీ నాకౌట్ అవకాశాలు చాలా స్వల్పంగా ఉన్నాయి. ఆ టీమ్ క్వార్టర్స్ చేరాలంటే రైల్వేస్‌పై బోనస్ పాయింట్‌తో గెలవడంతోపాటు మిగతా జట్ల ఫలితాల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌కు కోహ్లీ కోసం అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. టాప్-3లో తమిళనాడు (25 పాయింట్లు), చండీగఢ్ (19 పాయింట్లు), సౌరాష్ట్ర (18 పాయింట్లు) మధ్యే ఆసక్తికర పోటీ నెలకొంది. ఇక, గ్రూప్-ఎలో డిఫెండింగ్ చాంప్ ముంబై పరిస్థితి క్లిష్టంగా ఉంది. టేబుల్ టాపర్‌గా ఉన్న జమ్మూ కశ్మీర్ (29 పాయింట్లు) కేవలం ఒక్క పాయింట్ సాధిస్తే నాకౌట్‌కు చేరుకొంటుంది. ఇక, రెండో స్థానంలో ఉన్న బరోడా (27 పాయింట్లు) తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధిస్తే చాలు. గ్రూప్-బిలో పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. విదర్భ ఈపాటికే క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. రెండు, మూడు స్థానాల్లో ఉన్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ మధ్య నాకౌట్ కాని నాకౌట్ మ్యాచ్ జరగనుంది. ఈ రెండు జట్లలో ఎవరు నెగ్గితే వారు రౌండ్-8లోకి అడుగుపెడతారు. ఇక, గ్రూప్-సిలో త్రిముఖ పోరు నెలకొంది. క్వార్టర్స్ బెర్త్‌ల కోసం హరియాణా (26 పాయింట్లు), కేరళ (21 పాయింట్లు), కర్ణాటక (19 పాయింట్లు) మధ్య తీవ్ర పోటీనెలకొంది.

ఆధార్‌తో ఎంట్రీ ఫ్రీ..

రైల్వేస్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున విరాట్ బరిలోకి దిగనుండడంతో భారీగా ఫ్యాన్స్ హాజరయ్యే అవకాశం ఉంది. తొలి రోజు ఆట చూసేందుకు దాదాపు 10 వేల మంది వస్తారని ఢిల్లీ క్రికెట్ సంఘం అంచనా వేస్తుంది. ఈ నేపథ్యంలో ఉచిత ప్రవేశం అని ప్రకటించిన డీడీసీఏ.. ఆధార్ కార్డ్‌ను మాత్రం తప్పకుండా తీసుకురావాలనే షరతు విధించింది. జియో సినిమాలో మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

టీవీ నటితో సిరాజ్ డేటింగ్?





న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ సిరాజ్.. టీవీ నటితో డేటింగ్‌లో ఉన్నట్టు ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిగ్‌బాస్ కంటెస్టెంట్ మాహిరా శర్మతో అతడు ప్రేమలో ఉన్నాడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవలే ఆశా భోస్లే మనుమరాలు జనై భోస్లేతో సిరాజ్ డేటింగ్ చేస్తున్నాడని నెటిజన్లు కోడై కూశారు. కానీ, ఆమె తన సోదరి లాంటిదని చెప్పడంతో పుకార్లకు తెరపడింది. కానీ, ఇప్పుడు మాహిరాతో లవ్‌స్టోరీ మాత్రం నిజమేనన్నట్టుగా చెబుతున్నారు. మరి ఈ ఊహాగానాలపై సిరాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.

స్మిత్, ఖవాజా శతకాలు

- శ్రీలంకతో తొలి టెస్ట్



స్టీవ్ స్మిత్ (104 బ్యాటింగ్)

గాలె : ఖవాజా (147 బ్యాటింగ్), స్టీవ్ స్మిత్ (104 బ్యాటింగ్) అజేయ శతకాలతో అదరగొట్టడంతో శ్రీలంకతో బుధవారం ప్రారంభమైన తొలి టెస్ట్ మొదటి రోజే ఆస్ట్రేలియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు అభేద్యంగా 195 పరుగులు జోడించారు. దాంతో తొలి రోజు ఆఖరికి ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 330/2 స్కోరు చేసింది.

10వేల పరుగుల క్లబ్‌లో స్మిత్..: ఈ మ్యాచ్‌కు ముందు 9999 పరుగులతో ఉన్న స్మిత్..ఒక పరుగు తీయడం ద్వారా టెస్టుల్లో 10 వేల పరుగుల మైలు రాయిని చేరుకున్నాడు. ఈక్రమంలో తన సహచరులు పాంటింగ్, బోర్డర్, స్టీవ్ వా సరసన స్మిత్ చేరాడు. ఓవరాల్‌గా 10 వేల పరుగులు చేసిన 15వ బ్యాటర్‌గా నిలిచాడు. ఇక..35వ శతకం సాధించిన స్మిత్ ఈక్రమంలో 34 సెంచరీలు చేసిన గవాస్కర్, జయవర్దనే, యూనిస్ ఖాన్, లారాను అధిగమించాడు. 205 ఇన్నింగ్స్‌లలో 35వ శతకం సాధించిన స్టీవ్..పాంటింగ్ (194 ఇన్నింగ్స్), సచిన్ (200 ఇన్నింగ్స్) తర్వాత వేగంగా ఈ ఘనత అందుకున్న మూడో బ్యాటర్‌గా మరో రికార్డు సృష్టించాడు.

చాట్‌జీపీటీకి చైనా పోటీ!

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'డీప్‌సీక్' కృత్రిమ మేధ



చైనా ప్రధాని లీచాంగ్‌తో డీప్‌సీక్ ఏఐ సృష్టికర్త లియాంగ్ (కుడివైపు)

(సెంట్రల్ డెస్క్)

ప్రపంచమంతా వాషింగ్టన్‌డీసీలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించే వేడుకలపై దృష్టిసారించిన వేళ.. అదే రోజు (జనవరి 20న) శ్వేతసౌధానికి 12 వేల కిలోమీటర్లకు ఆవల.. చైనాలోని హాంగ్జౌ నగరంలో 'డీప్‌సీక్' అనే కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ తన ఏఐ మోడల్ 'ఆర్1'ను ఆవిష్కరించింది! ఆ తర్వాత వారంరోజుల్లోనే అది ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిపోయింది! చాట్ జీపీటీ, మెటా, జెమినై వంటి ప్రముఖ ఏఐ మోడళ్లకే సవాల్ విసిరే స్థాయిలో ప్రజాదరణ పొందింది. యాపిల్ యాప్‌స్టోర్‌లో చాట్‌జీపీటీని దాటేసి.. 'అత్యధికులు డౌన్‌లోడ్ చేసుకున్న ఉచిత యాప్'గా అగ్రస్థానంలో నిలిచింది. ఆ కథేంటో తెలియాలంటే.. ముందు ఈ 'డీప్‌సీక్'ను అభివృద్ధి చేసిన లియాంగ్ వెన్‌ఫెంగ్ (40) కథ తెలియాలి. దక్షిణ చైనాలోని గువాంగ్‌డాంగ్‌లో జన్మించిన లియాంగ్.. ఐటీ ఇంజనీరింగ్‌లో బాచిలర్స్ డిగ్రీ (2007), ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశాడు. 2015లో అతడు హై ఫ్లయర్ అనే హెడ్జ్ ఫండ్ కంపెనీని ప్రారంభించాడు. అది కంప్యూటర్ ఆధారిత స్టాక్ ట్రేడింగ్ కంపెనీ. దానికి అవసరమైన వ్యూహాలు రూపొందించేందుకు లియాంగ్ కృత్రిమ మేధపై దృష్టి సారించాడు. ఏఐ రూపకల్పనకు అత్యంత శక్తిమంతమైన చిప్‌లు కావాలి కాబట్టి.. 2021లో పదివేలకు పైగా ఎన్‌విడియా హెచ్800 చిప్‌లను కొనుగోలు చేశాడు. ఆ సమయంలో లియాంగ్ చుట్టూ ఉన్నవాళ్లంతా అతణ్ని పిచ్చివాడి కింద జమకట్టారు. కానీ.. తాను చేయబోతున్నదేంటో లియాంగ్‌కు తెలుసు. అందుకే.. 'ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని మాత్రమే వారికి చెప్పిన లియాంగ్ 2023 మే నెలలో డీప్‌సీక్ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత ఏడాదిన్నరలోపే.. డీప్‌సీక్ కోడర్, లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్, డీప్‌సీక్-వీ2, డీప్‌సీక్ కోడర్-వీ2 ఇలా పలు మోడళ్లను అభివృద్ధి చేశాడు. 2025 జనవరి 10న డీప్‌సీక్ వీ3ని విడుదల చేశాడు. దానికి కొనసాగింపుగా.. తర్కంతో కూడిన క్లిష్టమైన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పే డీప్‌సీక్ ఏఐ మోడల్ ఆర్1ను జనవరి 20న ఆవిష్కరించాడు.

ఖర్చు తక్కువ.. సామర్థ్యంలో మేటి..

ఓపెన్ ఏఐ సంస్థ చాట్‌జీపీటీని అభివృద్ధి చేయడానికి 10 కోట్ల డాలర్ల దాకా (దాదాపు రూ.865 కోట్లు) ఖర్చయితే.. లియాంగ్‌కు డీప్‌సీక్‌ను అభివృద్ధి చేయడానికి జస్ట్ 60 లక్షల డాలర్లు (దాదాపు రూ.52 కోట్లు) అయ్యిందంతే!! కంప్యూటింగ్ సామర్థ్యాన్ని కూడా డీప్‌సీక్ చాలా తక్కువగా వాడుకుంటుంది. ఉదాహరణకు.. ఓపెన్‌ఏఐ, మెటా వంటివి 16వేలు అంతకంటే ఎక్కువ అధునాతన చిప్‌లతో కూడిన సూపర్‌కంప్యూటర్ల ద్వారా ఏఐ చాట్‌బాట్లకు శిక్షణ ఇస్తుంటే.. డీప్‌సీక్ కేవలం 2000 పాత చిప్‌లతో అంతే సమర్థంగా శిక్షణ ఇస్తోంది. కానీ.. పనితీరులో మాత్రం అది మిగతా ఏఐలతో సమానంగా ఉందని వినియోగదారులు ప్రశంసిస్తున్నారు. లాజికల్ రీజనింగ్ టెస్ట్ స్కోర్ ఫలితాల్లో డీప్‌సీక్.. చాట్‌జీపీటీని, క్లాడ్ ఏఐని 7 నుంచి 14% తేడాతో అధిగించినట్టు చెబుతున్నారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో చాట్‌జీపీటీతో (78%) పోలిస్తే డీప్‌సీక్ (92%) బాగా పనిచేస్తున్నట్టు తెలిపారు.

ఖర్చు తగ్గించండి..

డీప్‌సీక్ జోరుపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ పరిణామాన్ని అమెరికన్ పరిశ్రమలకు మేలుకొలుపుగా భావించాలని హెచ్చరించారు. కృత్రిమ మేధ పోటీలో గెలుపుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఏఐ మోడళ్ల అభివృద్ధికి వందల కోట్ల డాలర్లు ఖర్చుచేయడం మాని తక్కువ ఖర్చుతో ఇవే సామర్థ్యాలను సాధించాలని సూచించారు. ఇక.. డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఆర్1 మోడల్ పనితీరు ఆకట్టుకునేలా ఉందని.. ఓపెన్‌ఏఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఈ రంగంలో కొత్త పోటీదారును కలిగి ఉండడం ఉత్సాహాన్నిస్తోందని ఆయన పేర్కొన్నారు.

టెక్ దిగ్గజాల షేర్లు ఢమాల్..

ఒపెన్ ఏఐ, మెటా, గూగుల్ వంటి సంస్థలు వందల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టి.. అత్యంత అధునాతన చిప్‌లు ఉపయోగించి తమ తమ కృత్రిమ మేధ మోడళ్లను అభివృద్ధి చేసినట్టు చెప్పుకొంటుంటే.. ఎప్పుడో నాలుగేళ్ల నాటి ఎన్‌విడియా చిప్‌లతో వాటికి పోటీనిచ్చే ఏఐ మోడల్‌ను చైనా కంపెనీ తయారుచేసిందన్న వార్త దావానలంలా వ్యాపించడంతో ఆయా కంపెనీల షేర్లు పతనమవడం ప్రారంభించాయి. ఎన్‌విడియా కంపెనీ షేరు ధర ఏకంగా 17% క్షీణించింది.. దీంతో ఒక్కరోజే ఆ సంస్థ దాదాపు రూ. 52 లక్షల కోట్ల మేర మార్కెట్ విలువను కోల్పోయింది. ఆ కంపెనీ సహవ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ ఆస్తుల నికర విలువ రూ.1.74 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. ఇది ఆయన మొత్తం ఆస్తిలో 20 శాతానికి సమానం. డీప్‌సీక్ దెబ్బకు నాస్‌డాక్ సూచీ 3.1 శాతం, ఎస్ అండ్ పీ ఇండెక్స్ 1.5% నష్టపోవడంతో టాప్-500 బిలియనీర్లు దాదాపు రూ.9.35 లక్షల కోట్లు నష్టపోయారు.

ఉచితంగా..

ఓపెన్‌ఏఐ, మెటా, గూగుల్ జెమినై, క్లాడ్ ఏఐ వంటివాటిని కొంతమేర మాత్రమే ఉచితంగా వాడుకోగలం. ఆధునిక వెర్షన్లు, ఫీచర్లు వాడుకోవాలంటే డబ్బు చెల్లించాల్సిందే. కానీ, డీప్‌సీక్ సంస్థ తన కృత్రిమమేధ మోడల్‌ను ఓపెన్‌సోర్స్ విధానంలో అందరికీ అందుబాటులోకి తెచ్చింది. అంటే.. వినియోగదారులు ఉచితంగా వాడుకోవడమే కాదు.. వ్యాపారసంస్థలు, పరిశోధకులు డీప్‌సీక్ కోడ్‌ను తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వీలు ఉంటుందన్నమాట. అయితే.. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ డేటాకు మాత్రం డీప్‌సీక్ సంస్థ కొంత మొత్తాన్ని వసూలు చేస్తోంది. అదీ ఇతర ఏఐలతో పోలిస్తే చాలా తక్కువ. కాగా.. డీప్‌సీక్ యాప్ డౌన్‌లోడ్‌కు కోట్లాది మంది ప్రయత్నిస్తుండడంతో సర్వర్లు స్తంభించిపోతున్నాయి.

అది మాత్రం అడక్కు!

ప్రపంచంలో ఏ విషయం గురించి అడిగినా ఠక్కున చెప్పే డీప్‌సీక్ ఏఐ.. చైనాకు సంబంధించిన, ఆ దేశాన్ని ఇబ్బంది పెట్టే అంశాల గురించి అడిగితే మాత్రం... 'ఆ ఒక్కటీ అడక్కు' అన్నట్టుగా ముడుచుకుపోతుంది. ఆ ప్రశ్నకు తనకు సమాధానం తెలియదంటుంది. ఉదాహరణకు.. అరుణాచల్ ప్రదేశ్ గురించి ఒక భారతీయుడు డీప్‌సీక్‌ను అడిగితే.. 'క్షమించండి. అది నా పరిధిలో లేని అంశం. మనం మరే ఇతర అంశం గురించైనా మాట్లాడుకుందాం' అని సమాధానం ఇచ్చింది. 'జిన్‌పింగ్ ఒక నియంతా?' అనే ప్రశ్నకు, 'తైవాన్ దేశం గురించి చెప్పు' అనే ప్రశ్నకు కూడా.. డీప్‌సీక్ అదే సమాధానం ఇవ్వడం గమనార్హం.

చిత్రజ్యోతి
SINCE 1965

'ఇంకా మేము బ్యాచిలర్సే'



సందీప్ కిషన్ కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మజాకా'. రీతూ వర్మ కథానాయిక. రావు రమేశ్, అన్షు కీలకపాత్రలు పోషిస్తున్నారు. రాజేశ్ దండ, ఉమేశ్ కేఆర్ బన్సల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. తొలిగీతాన్ని చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది. 'ఇంకా మేము బ్యాచిలర్సే' అంటూ హీరో తన ప్రేమ కోసం పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ సరదాగా సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, ధనుంజయ్ సీపాన ఆలపించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచారు.



నేటి సమాజంలో 'ప్రేమిస్తావా'

ఆకాశ్ మురళి, అదితి శంకర్ జంటగా విష్ణువర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'ప్రేమిస్తావా'. తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలై చక్కటి ప్రజాధరణ పొందింది. ఈ గురువారం మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ, గొడవల నేపథ్యంలో సాగిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ 'నేటి సమాజంలో ప్రేమలు, అనుబంధాలు ఎలా ఉన్నాయనేది ఈ సినిమా చూపిస్తుంది. అదితి, ఆకాశ్ చక్కగా నటించారు' అని అన్నారు. 'ఇది నా ఫస్ట్ లవ్‌స్టోరీ. లవ్, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అదితి చెప్పారు. విష్ణువర్ధన్ స్టైలిష్ మేకింగ్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని ఆకాశ్ మురళి చెప్పారు.



డాక్టర్ మోహన్‌బాబు, ఆయన తనయుడు విష్ణు 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తున్నారు. ఆ క్రమంలో బుధవారం గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను కలిశారు. 'కన్నప్ప' చిత్ర విశేషాలను భూపేంద్ర పటేల్ వారి నుంచి అడిగి తెలుసుకున్నారు.



ఒకే టైటిల్.. రెండు చిత్రాలు

గతంలో హిట్ అయిన సినిమా టైటిల్‌ను రిపీట్ చేస్తూ సినిమాలు రావడం జరుగుతున్నదే. అయితే ఇద్దరు హీరోలు నటించిన వేర్వేరు చిత్రాలకు ఒకే టైటిల్ పెట్టడం, ఒకే రోజు కొన్ని గంటల వ్యవధిలో ఆ రెండు చిత్రాల టైటిల్స్ అనౌన్స్ చేయడం తమిళ చిత్ర పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశం అయింది. విజయ్ ఆంటోనీ హీరోగా అరుణ్ ప్రభు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'శక్తి తిరుమగణ్' అని తమిళ్‌లో.. తెలుగులో 'పరాశక్తి' అని టైటిల్ పెట్టినట్లు ప్రకటించారు. ఇది ఆయనకు 25వ చిత్రం కావడం గమనార్హం. శివకార్తికేయన్ హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు కూడా 'పరాశక్తి' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. శివ కార్తికేయన్‌కు కూడా ఇది 25వ చిత్రమే. 73 ఏళ్ల క్రితం ఏవీఎం సంస్థ 'పరాశక్తి' పేరుతో ఓ చిత్రం నిర్మించింది. వారి అనుమతితో శివ కార్తికేయన్ హీరోగా నిర్మిస్తున్న చిత్రానికి 'పరాశక్తి' టైటిల్‌ను పెట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ డాన్ పిక్చర్స్ వెల్లడించింది. మరో వైపు విజయ్ ఆంటోనీ తన చిత్రానికి 'పరాశక్తి' అనే టైటిల్‌ను సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేశారు. ఇప్పుడు వీరిద్దరిలో ఎవరు వెనక్కి తగ్గుతారో వేచి చూడాలి.



మార్చిలో మొదలు

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'వీడీ 15' అనేది వర్కింగ్ టైటిల్. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతోంది. మార్చి మొదటివారం నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం వియత్నాంలో జరుగుతోంది. వినూత్నమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నామని, వరుణ్‌తేజ్ ఇప్పటివరకూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ చెప్పారు. 'వీడీ 15'కు తమన్ సంగీతం అందిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

అలాంటి వాళ్లంటే నాకిష్టం

- రష్మిక



పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన రష్మిక మందన్నా తాజా బాలీవుడ్ చిత్రం 'ఛావా'తో అభిమానులను పలకరించబోతున్నారు. తన కాలికి అయిన గాయాన్ని సైతం లెక్క చేయకుండా ఇటీవల మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హాజరయ్యారు. 'ఛావా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీ తాజా ఇంటర్వ్యూలో తన రిలేషన్‌షిప్‌పై ఓపెన్ అయ్యారు. ఇల్లే తనకు అత్యంత సంతోషకరమైన ప్రదేశమని, జీవితంలో గెలుపు అనేది వస్తూ, పోతూ ఉంటుందని, కానీ ఇల్లు ఎప్పటికీ శాశ్వతమని అన్నారు. రిలేషన్‌షిప్‌పై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఒక వ్యక్తి పట్ల ఆకర్షణ విషయానికొస్తే తన కళ్లే ప్రధానమని నేను నమ్ముతా. అంతేకాదు ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. స్మైలీ ఫేస్‌తోపాటు తన చుట్టూ ఉన్నవారిని గౌరవించే వాళ్లంటే నాకిష్టం' అని బదులిచ్చారు. కాగా, కొన్నేళ్లుగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో రష్మిక రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అలాగే ఓ ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తాను రిలేషన్‌షిప్‌లో ఉన్న విషయాన్ని తెలిపారు. అయితే ఎవరనేది వెల్లడించలేదు. సరైన సమయం వచ్చినప్పుడు ఆ వివరాలను వెల్లడిస్తానని అన్నారు.



రెగ్యులర్ షూట్ అప్పటి నుంచే!

దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రం ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. డాక్టర్. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో టెస్ట్ షూట్ జరుగుతోంది. వచ్చే నెల నుంచి ఆఫ్రికాలోని కెన్యాలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవ్వనున్నట్లు తెలిసింది. దాదాపు రూ.వెయ్యి కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగాన్ని 2027లో.. రెండవ భాగాన్ని 2029లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. కాగా, అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఎటువంటి విషయాలు బయటకు రాకుండా చిత్రబృందానికి గట్టి హెచ్చరికలు జారీచేశారట రాజమౌళి. ఈ మేరకు చిత్రబృందం కొన్ని కఠిన నియమాలను పాటిస్తోంది. ఇందులో భాగంగా సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులతో నాన్- డిస్‌క్లోస్ అగ్రిమెంట్‌ను మేకర్స్ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి ఏ చిన్న విషయం లీక్ చేసినా, సదరు వ్యక్తులు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.



యువతి ప్రతీకారం

వందకుపైగా సినిమాలకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా పని చేసిన ధర్మ ఇప్పుడు నిర్మాతగా మారి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సంహారం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఆదిత్య, కవిత మహతో హీరోహీరోయిన్లుగా నటించారు. ఇంతవరకూ 44 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన సాకేత్ సాయిరామ్ ఈ సినిమాలో విలన్‌గా నటించడం విశేషం. చిత్రానికి సంగీత దర్శకుడు కూడా ఆయనే. తనకు, తన అక్కకు అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఓ యువతి తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌తో దుష్ట సంహారం ఎలా జరిపిందన్నదే ఈ చిత్రకథ అని ధర్మ చెప్పారు.



వేట మొదలైంది

కలియుగంలో పరమశివుని భక్తుడైన మార్కండేయునికి ఎన్నో కష్టాలు ఎదురయ్యాయి, వాటిని శివుని అనుగ్రహంతో ఎలా అధిగమించాడు అనే కాల్పనిక కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' అనేది ఉపశీర్షిక. తేజస్ వీరమాచినేని, రోమీ జంటగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఇటీవలే యూనిట్ నిర్వహించింది. నటుడు సుమన్, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ చేతుల మీదుగా ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్రంలో శివయ్య పాట అద్భుతంగా ఉంటుంది, ప్రతి దేవాలయంలో ఈ పాట మార్మోగుతోంది అని నిర్మాత తెలిపారు. వినోదంతో పాటు సందేశం ఉన్న చిత్రమిదని దర్శకుడు చెప్పారు. బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

భళా ఏటికొప్పాక బొమ్మలు!

ఢిల్లీలోని గణతంత్ర పరేడ్‌లో ఆకట్టుకున్న ఏపీ శకటం.. జ్యూరీ తృతీయ అవార్డు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, అమరావతి, ఎలమంచిలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. రాష్ట్రంలోని చేతివృత్తుల కళా ప్రాముఖ్యతను చాటుతూ, ఆంధ్రప్రదేశ్ వారసత్వ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటికొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన శకటం 76వ రిపబ్లిక్ డే పరేడ్ ఉత్సవానికే హైలెట్‌గా నిలిచింది. సామాజిక మాధ్యమాల్లో సైతం లక్షలాది మంది ఈ శకటానికి ముగ్ధులై ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రంలోని చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఈ శకటాన్ని రూపొందించింది. శకటం ముందు వినాయకుడు, చివర కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఎత్తైన రూపాలతో ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టు ప్రతిబింబించేలా అమర్చిన ఏటికొప్పాక బొమ్మల కొలువుతో తీర్చిదిద్దారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సైతం ఈ శకటం మనోహరమైన రూపాన్ని చూసి పులకించిపోయారు. ఆన్‌లైన్ ఓటింగ్‌లోనూ ఈ శకటానికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. కాగా, దేశ రాజధానిలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏపీ శకటానికి 30 సంవత్సరాల తర్వాత తొలిసారిగా కేంద్ర ప్రభుత్వ జ్యూరీ పురస్కారం లభించింది. కేంద్ర రక్షణ శాఖ ప్రకటించిన ఉత్తమ శకటాల జాబితాలో తొలి స్థానంలో యూపీ శకటం, రెండో స్థానంలో త్రిపుర శకటం నిలవగా మూడో స్థానం ఏపీకి దక్కింది. ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ తృతీయ బహుమతిని ప్రకటించింది. అలాగే, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన భారత్ పర్వ్‌లో కోనసీమ జిల్లాకు చెందిన పి.బాబా సత్య వెంకట కుమార్ బృందం గరగ నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది.



ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఏటి కొప్పాక బొమ్మలతో కూడిన ఏపీ శకటం ప్రదర్శన

కళాకారులకు సీఎం అభినందనలు..

రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏపీ శకటానికి తృతీయ బహుమతి రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. శకటం రూపకర్తలకు, రాష్ట్ర అధికారులకు ప్రత్యేకించి ఏటికొప్పాక బొమ్మల తయారీ కళాకారులకు సీఎం అభినందనలు తెలిపారు. ఏపీ శకటం తృతీయ స్థానం సాధించడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏటికొప్పాక గ్రామంలో సంబరాలు

ఏటికొప్పాక బొమ్మల శకటానికి అవార్డు ప్రకటించడంతో అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. శకటం రూపశిల్పి గొర్సా సంతోష్ ఇంటి వద్ద స్థానికులంతా సంబరాలు జరుపుకున్నారు. సంతోష్‌కు గ్రామస్థులు స్వీట్లు తినిపించి అభినందించారు.

వెలకట్టలేని గౌరవం దక్కింది



నేను రూపొందించిన బొమ్మల శకటానికి అవార్డు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. వెలకట్టలేని గౌరవం దక్కినట్టయింది. ఈ విషయంలో ఐఅండ్‌పీఆర్, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకారం అందించాయి. ఏటికొప్పాక హస్త కళారంగానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందించిన ప్రోత్సాహం జీవితంలో మరిచిపోలేనిది.

-గొర్సా సంతోష్, బొమ్మల నమూనా రూపకర్త, ఏటికొప్పాక

తొక్కిసలాటపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటైంది

» హైకోర్టుకు నివేదించిన ఎస్‌జీపీ.. తీర్పు రిజర్వ్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట, భక్తుల మృతి ఘటనపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి బుధవారం హైకోర్టుకు నివేదించారు. పిటిషనర్.. కర్నూలు జిల్లాకు చెందిన గుడిబండ ప్రభాకర్‌రెడ్డి తరఫు న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తొక్కిసలాటపై విచారణ జరిపి నెలరోజుల్లో నివేదికను గవర్నర్‌కు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. నివేదికను నెలలో ఎలా ఇవ్వగలరని ప్రశ్నించింది. ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణకు ఆదేశించినందున పిల్ నిరర్థకం అవుతుందని, దీనిపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం పేర్కొంది.

డీజీపీ నియామకంపై సుప్రీంకు వెళ్లండి

డీజీపీ నియామకంలో సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం లేదంటూ దాఖలైన పిల్‌పై జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులతో ముడిపడి ఉన్నందున, సమాంతరంగా పిల్‌పై తాము విచారణ జరపలేమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

హైకోర్టు జీపీగా కనకరాజు

ఏపీ హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఉండ్రాజవరపు కనకరాజు జీపీగా నియమితులయ్యారు. మరోవైపు ఏపీపీఎస్సీ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది జి.శీనాకుమార్, వక్ఫ్‌బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది మహ్మద్ సలీం పాషాను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

అర్ధరాత్రి 12 వరకూ హోటళ్లు... త్వరలో నిర్ణయం

» లిక్కర్ లైసెన్స్ ధరలు తగ్గిస్తాం: మంత్రి దుర్గేశ్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కొన్నిచోట్ల అర్ధరాత్రి 12 గంటల వరకు హోటళ్లు తెరిచేలా త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని టూరిజం మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. కాకినాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'ఏపీలో లిక్కర్ లైసెన్స్ ధరలు హైదరాబాద్ కంటే అధికంగా ఉన్నాయని హోటళ్ల యాజమాన్యాలు అంటున్నాయి. దీన్ని తగ్గించడానికి సిద్ధంగా ఉన్నాం. పర్యాటక అభివృద్ధి కోసం టూరిజంకి ఇండస్ట్రీ హోదా కల్పిస్తాం. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ ఇస్తాం' అని దుర్గేశ్ అన్నారు.

మంత్రి కొల్లు మనస్తాపం!

» నాపై హత్య కేసుపెట్టిన మాజీ ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుకు వేదికపై చోటా?

» ప్రభుత్వ కార్యక్రమానికి ఆయన్ను టీడీపీ నేతలే ఎలా ఆహ్వానిస్తారు?

» అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని వెల్లడి



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తనను కేసులతో వేధించిన కృష్ణా జిల్లా మాజీ ఎస్పీ రవీంద్రనాథ్‌బాబును సొంత పార్టీ నేతలే ఆహ్వానించి వేదికపై కూర్చోబెట్టడంపై ఆయన బుధవారం బహిరంగంగానే నిరసన వ్యక్తం చేశారు. సదా సౌమ్యంగా కనిపించే కొల్లు ఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం టీడీపీ వర్గాల్లో కలకలం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు కొత్త పాలక వర్గాన్ని నియమించింది. ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన సదాశివం నియమితులయ్యారు. ఈ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. దీనికి మంత్రి కొల్లు కూడా హాజరు కావలసి ఉంది. అయితే స్థానికంగా ఆయన అందుబాటులో లేకపోవడంతో రాలేదు. అయితే నిర్వాహకులు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్ బాబును ఆహ్వానించారు. ఆయన హాజరై టీడీపీ నేతలతోపాటు వేదికపై కూర్చున్నారు. ఈ విషయం తెలిసి మంత్రి చాలా బాధపడ్డారు. బుధవారం ఉదయం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన ఆవేదన వ్యక్తం చేశారు. 'వైసీపీ హయాంలో రవీంద్రనాథ్‌బాబు కృష్ణా జిల్లా ఎస్పీగా ఉన్న సమయంలో నాపై అక్రమ కేసు మోపి నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా వేధించారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతలెందరో ఈ సంఘటనపై బాధపడ్డారు. అటువంటి వ్యక్తిని పిలిచి ప్రభుత్వ కార్యక్రమంలో వేదికపై కూర్చోబెట్టడం నన్నెంతో బాధకు గురి చేసింది. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాను.' అని అన్నారు. దీంతో టీడీపీకి అనుబంధంగా ఉన్న నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ నేతల సమావేశం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. వారంతా మంత్రికి సంఘీభావం తెలిపారు. వారంతా టీటీడీ బోర్డు సభ్యుడు శాంతిరాంతో కలిసి మాట్లాడారు. నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు సదాశివం తన సొంత ఆలోచనతో రవీంద్రనాథ్‌బాబును ఆహ్వానించారని, ఆయన చేసిన తప్పునకు మంత్రి బాధపడాల్సి వచ్చిందని చెప్పారు. సీనియర్లను పక్కనపెట్టి ఈ ఫెడరేషన్‌కు సదాశివాన్ని ఎలా నియమించారని కొందరు నేతలు ఫిర్యాదు చేశారు. తర్వాత శాంతిరాం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిలారు రాజేశ్‌ను కలిసి ఈ పరిణామాలను వివరించారు.

53 రోజులు జైల్లో కొల్లు

జగన్ ప్రభుత్వ హయాంలో తనపై మోపిన ఓ హత్య కేసులో కొల్లు రవీంద్ర 53 రోజులు జైల్లో ఉన్నారు. మచిలీపట్నంలో జరిగిన ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి నుంచి కొల్లు వ్యక్తిగత సహాయకుడికి ఫోన్ వచ్చిందని, ఈ హత్యతో కొల్లుకు ప్రమేయం ఉండడం వల్లే ఆ ఫోన్ వచ్చిందంటూ పోలీసులు నాడు అక్రమంగా కేసు నమోదు చేసి అరెస్టు చేసేశారు. తనకు ఏ సంబంధమూ లేని కేసులో అన్యాయంగా ఇరికించి అరెస్టు చేశారని కొల్లు ఆ సమయంలో ఆరోపించారు. వైసీపీ నేతల ఒత్తిడితో అప్పటి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబే ఈ కేసు నమోదు చేయించారని విమర్శించారు.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

» రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల

అమరావతి, న్యూఢిల్లీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. గుంటూరు-కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 3న ఎన్నికలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. 10వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువుగా నిర్ణయించింది. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన కాగా, 13 వరకు నామినేషన్ల ఉప సంహరణకు తుది గడువు. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆయా జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. కాగా, తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

108, 104లను గాడిలో పెట్టండి

» ట్రస్ట్ సీఈవోకు ప్రభుత్వం సూచన

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో గాడితప్పిన 108, 104 వాహనాల నిర్వహణను తిరిగి పునరుద్ధరించేందుకు కూటమి చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న అరబిందో సంస్థ వాహనాల నిర్వహణలో పూర్తిగా విఫలమై తప్పుకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, డీఎంఈలతో ప్రత్యేక కమిటీని నియమించగా, కొత్త సర్వీస్ ప్రొవైడర్ ఎంపికకు ఆర్ఎఫ్‌పీని సిద్ధం చేసి రెండు వారాల క్రితం నివేదిక అందించగా ప్రభుత్వం ఆమోదించింది. కమిటీ నివేదిక ఆధారంగా.. కొత్త సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు టెండర్లను ఆహ్వానించాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోను తాజాగా ఆదేశించింది. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా 108, 104 వాహనాలు, కాల్ సెంటర్ నిర్వహణకు సంబంధించిన టెండర్లు ఆహ్వానించాలని సూచించింది. ఈ నేపథ్యంలో వచ్చే వారం ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు టెండర్లు ఆహ్వానించనున్నారు.

రాష్ట్రపతి సమక్షంలో వీణా విన్యాసం!

బందరు విద్యార్థినికి అపూర్వ అవకాశం



మచిలీపట్నం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నానికి చెందిన విద్యార్థిని అప్పికట్ల దీప్తి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలో వీణ వాయించి ప్రశంసలందుకుంది. ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న అనంతరం దీప్తి రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం శ్రావ్యంగా వీణ వాయించగా.. ముర్ము అభినందించారు. రాజ్‌నాథ్‌సింగ్ కూడా ముగ్ధులయ్యారు. త్రివిధ దళాధిపతుల వద్ద దీప్తి బృందం దేశభక్తి గేయాలాపన, వాయిద్య గోష్ఠితో ప్రశంసలతోపాటు జ్ఞాపిక అందుకుంది. కేఎల్ వర్సిటీలో చదువుతున్న దీప్తి చిన్నతనం నుంచే ప్రముఖ విద్వాంసుల వద్ద సంగీతం, వీణ నేర్చుకున్నారు. రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనేందుకు ముందుగా హైదరాబాద్, ఢిల్లీలో శిక్షణ పొందారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రముఖుల ముందు వీణవాయించే అవకాశం రావడం గర్వంగా ఉందని దీప్తి పేర్కొంది.

శారదాపీఠానికి విదేశీ విరాళాలకు కేంద్రం ఓకే

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని పెందుర్తిలో ఉన్న శారదా పీఠం చారిటబుల్ ట్రస్టు విదేశాల నుంచి విరాళాలు స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు ట్రస్టుకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్(నంబర్ 010350263) లభించింది. తాము ఇటీవలే ఎఫ్‌సీఆర్ఏ గుర్తింపునకు దరఖాస్తు చేసుకున్నట్టు శారదాపీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానంద తెలిపారు.

అమరావతిపై అదే ద్వేషం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి క్షేత్రస్థాయిలో పనులు జరిగే వరకు అన్నీ ప్రపంచబ్యాంకు, ఏడీబీ కనుసన్నల్లో వాటి పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. జగన్ పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం.. ప్రపంచబ్యాంకు, ఏడీబీలు కూడా రాజధాని అభివృద్ధి సంస్థల అధికారులతో కుమ్మక్కయితేనే గోల్‌మాల్ సాధ్యమవుతుంది. అయితే అప్పులు ఇచ్చే ప్రపంచ స్థాయి సంస్థలు వాటి ద్వారా ప్రయోజనాలు జరగాలని కోరుకుంటాయి. అంతేతప్ప వాటి పేరుతో దోచుకు తినమని ప్రోత్సహించవు. అయినా జగన్ రోతపత్రిక విషపు కథనం ప్రచురించింది. రాజధాని పునర్నిర్మాణ పనుల కోసం అధికారులు శరవేగంతో దాదాపు రూ.41 వేల కోట్ల మేర రుణ సంస్థల నుంచి అప్పులు తీసుకొచ్చారు. అయితే అంతే వేగంగా టెండర్లు పిలువలేక పోతున్నారు. దీనికి కారణం.. సీఆర్‌డీఏ, ఏడీసీలు రూపొందించే టెండర్ డాక్యుమెంట్లను ఆయా రుణ సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. చాలా కఠినమైన నిబంధనలను విధించాయి. దీంతో టెండర్లు పిలవడంలో జాప్యం జరుగుతోంది.

జాతీయ హైవేలతో పోలికా?

ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అమరావతిని ఏ విధంగా ధ్వంసం చేసిందో ప్రపంచమంతా చూసింది. శాశ్వత రాజధాని నిర్మాణ పనులు ఆపడంతో మొదలుపెట్టి క్రమంగా అన్ని పనులనూ నిలిపేసి రాజధానిని కకావికలం చేసింది. నిరుడు సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూసినా జగన్ అండ్ కోలో మార్పురాలేదు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకోవడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే.. రాజధానిలోని ప్రధాన రోడ్ల పనులను జాతీయ రహదారులతో పోల్చి.. ఏదో గోల్‌మాల్ జరిగిపోయిందంటూ రోతపత్రిక బురదజల్లే ప్రయత్నం చేసింది. భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చేపట్టే పనులకు కిలోమీటరుకు రూ.20-22 కోట్లు వ్యయమవుతుండగా.. ఏడీసీ అధికారులు కిలోమీటరుకు రూ.53.88 కోట్లు అంచనా వేశారని.. సగటున కిమీకు రూ.30 కోట్ల మేర అదనపు వ్యయం ప్రతిపాదించడం కమీషన్లు దండుకోవడానికేనని తన కథనంలో పేర్కొంది. జాతీయ రహదారులకు సంబంధించి చూస్తే కేవలం రోడ్డు పనులకే టెండర్లు పిలుస్తారు. సెంట్రల్ మీడియం పనులు ప్రత్యేకంగా ఉంటాయి. అమరావతిలో రోడ్లు గతంలోనే నిర్మించినప్పటికీ జగన్ ఏలుబడిలో తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాటికి అతుకుల మరమ్మతులు చేసే పరిస్థితి లేదు. దెబ్బతిన్న రోడ్లను పూర్తిగా తొలగించి మళ్లీ వేయాల్సిందే. వీటి పునర్నిర్మాణంతోపాటు అనేక కాంపోనెంట్ పనులతో కలిపి ఏడీసీ టెండర్లు పిలిచింది. ఆ కాంపోనెంట్లలో వరదనీటి మళ్లింపు కాల్వలు (స్టామ్ వాటర్ డ్రెయిన్స్), నీటిసరఫరా, సీవరేజీ నెట్‌వర్క్‌లు, యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్స్, నడకదారులు, సైకిల్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి ఉన్నాయి. వీటన్నిటికీ గంపగుత్తగా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చిన వాస్తవాన్ని దాచి జగన్ పత్రిక రోడ్ల పనులకే పెంచేశారంటూ వండి వార్చింది. రోడ్డు పనులకే ఇంత మేర అంచనాలు పెంచారంటే.. పైన చెప్పుకొన్న కాంపోనెంట్ల పనులకు కూడా భారీగా అంచనాలు పెంచేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేసింది. టెండర్లకు భారీగా అంచనాలు వేశారంటూ ఒక పట్టిక కూడా ఇచ్చింది. అందులో మిగిలిన పనుల అంచనా వ్యయం కాలమ్‌లో ఇటీవల ఏడీసీ పిలిచిన టెండర్ల విలువను కూడా కోట్ చేయడం గమనార్హం. రాజధానిలో రోడ్ల పునరుద్ధరణ పనుల్లో భూగర్భ విద్యుత్ కేబుల్స్, ఇంటర్నెట్ తదితర కేబుల్స్‌కు సంబంధించి దుర్భేద్యమైన ఆర్‌సీ డక్ట్స్ నిర్మించాల్సి ఉంటుంది. స్టామ్ వాటర్ డ్రెయిన్స్, మంచినీటి పైపులైన్ల నెట్‌వర్క్, అండర్ గ్రౌండ్ డ్రెయిన్ల పనులు సాధారణమైనవి కావు. సెంట్రల్ మీడియంను అభివృద్ధి చేయడంతో పాటు కిలోమీటర్ల కొద్దీ సైకిల్ ట్రాక్స్ ఏర్పాటు వంటి పనులూ చిన్నవి కావు. ఇంటర్నెట్ కేబుల్స్ కోసం నిర్మించే డక్ట్స్‌ను భవిష్యత్‌లో ప్రైవేటు కేబుల్స్‌కు లీజ్‌కు ఇస్తే ఆదాయం కూడా వస్తుంది. అదీగాక ఐదేళ్ల నాటికీ, నేటికీ స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) బాగా పెరిగిపోయాయి. కనీసం 25 శాతం మేర పెరిగిపోయాయి. వీటన్నిటినీ దాచిపెట్టి అమరావతిపై జగన్ పత్రిక విషంకక్కే ప్రయత్నం చేసింది.

వందర్‌ఫుల్

ఇస్రో శతక ప్రయోగం విజయవంతం

» నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్15 ..

» 19 నిమిషాల్లోనే నావిక్-02 ఉపగ్రహం కక్ష్యలోకి..



100 షార్‌లో ఇస్రోకిది వందో ప్రయోగం.

62 ఇస్రో 100 మిషన్లలో పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా చేపట్టినవే ప్రయోగాలే 62 ఉన్నాయి. జీఎస్ఎల్వీ (17), ఎల్‌వీఎం3 (7), ఎస్ఎస్ఎల్వీ (3) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మహాద్భుత విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం.. షార్‌లో వందో మిషన్.. విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదికపై నుంచి బుధవారం ఉదయం 6:23 గంటలకు ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది. 27:30 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే రెండోతరం నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌వీఎస్-02 (నావిక్-02)ను తీసుకుని నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన రాకెట్.. మూడు దశలను నిరాటంకంగా పూర్తిచేసుకుని 19.12 నిమిషాల్లోనే దాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్.. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇదే మొదటి ప్రయోగం. శాస్త్రవేత్తలు ఉపగ్రహంలో ఉన్న 1,250 కిలోల ఇంధనాన్ని దశలవారీగా మండిస్తూ, భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి దాన్ని ప్రవేశపెడుతారు.

నావిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా..

ఎన్‌వీఎస్-02.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్, సేవలు, వ్యవసాయంలో సాంకేతికత, మొబైల్ లోకేషన్ ఆధారిత సేవలకు ఉపయోగపడుతుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ ఐఆర్ఎన్ఎస్ఎస్ ఇప్పటికే అందుబాటులో ఉండగా.. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ కొత్త ఉపగ్రహాలు దోహదపడతాయి. గతంలో పంపిన ఉపగ్రహాల్లో ఎస్-బ్యాండ్, కె-బ్యాండ్, కేయూ-బ్యాండ్ లాంటి ఉపకరణాలను అమర్చారు. రెండోతరం నావిగేషన్ సిరీస్ ఉపగ్రహాలైన నావిక్-01, నావిక్-02లో ఎల్-1, ఎల్-5, ఎస్-బ్యాండ్ సిగ్నల్ వ్యవస్థను అమర్చారు. ఎల్-1లో ప్రజలకు ఉపయోపడే సివిలియన్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్ ఉంటుంది. భూ, జల, వాయు మార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత ఖచ్చితత్వంతో, 50 నానోసెకన్ల రియల్‌టైమ్‌తో చూపించడం ఈ కొత్తతరం ఉపగ్రహాల ప్రత్యేకత. భారతదేశ సరిహద్దుల అవల 1,500 కిలోమీటర్ల పరిధి వరకూ ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఇక సమయం, స్థానాన్ని అత్యంత ఖచ్చితంగా తెలిపే రుబీడియం అణు గడియారాన్ని నావిక్-02లో అమర్చారు.

2 నెలల్లో నిసార్ ప్రయోగం

నావిక్-02 ప్రయోగం విజయానంతరం షార్‌లోని మీడియా సెంటర్‌లో సహచర శాస్త్రవేత్తలతో కలిసి నారాయణన్ మీడియాతో మాట్లాడారు. నావిక్-02 పదేళ్లపాటు సేవలందిస్తుందని వివరించారు. ఇస్రో, నాసా సంయుక్తంగా చేపట్టిన నిసార్ ఉపగ్రహాన్ని మరో రెండు నెలల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగిస్తామని నారాయణన్ వెల్లడించారు. కాగా, శ్రీహరికోట నుంచి వందో ప్రయోగాన్ని చేపట్టిన ఇస్రోకు అభినందనలు వెల్లువెత్తాయి.

ఐదేళ్లలో 100 మిషన్లు సాధ్యమే!

100 మిషన్ల మైలురాయిని చేరుకోవడానికి ఇస్రోకు దాదాపు ఐదు దశాబ్దాలు (46 ఏళ్లు) పట్టింది. ఇది చాలా ఎక్కువ కాలమే..! 1979లో షార్‌లో తొలి ప్రయోగాన్ని చేపట్టినప్పుడు ఇస్రో వద్ద ఇప్పుడు ఉన్నంత టెక్నాలజీ లేదు. రాకెట్ టెక్నాలజీ కోసం రష్యా వంటి దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో మెల్లగా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన ఇస్రో వంద మిషన్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయి. అత్యాధునిక టెక్నాలజీని ఇస్రో అందిపుచ్చుకుంది. సొంతంగా రాకెట్లు, ఇంజన్లు నిర్మించుకుంటోంది. ఈ క్రమంలో 2000వ సంవత్సరం నుంచి దూకుడు పెంచింది. ఇదే జోరు కొనసాగిస్తే వచ్చే ఐదేళ్లలో మరో వంద ప్రయోగాలు నిర్వహించి 200 మార్కు అందుకోగలమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అన్నారు. సైకిల్, ఎడ్లబండిపై రాకెట్ విడిభాగాలను తరలించిన కాలం నుంచి.. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను డాకింగ్ చేసే స్థాయికి ఇస్రో ఎదిగింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్, రోవర్‌ను దింపి చరిత్ర సృష్టించిన ఇస్రో.. సూర్యుడి గుట్టు విప్పేందుకు ఆదిత్య-ఎల్1 మిషన్‌ను కూడా చేపట్టింది. త్వరలోనే చంద్రుడిపైకి మన వ్యోమగామిని పంపే ప్రయత్నాలు చేస్తోంది.

'వక్ఫ్' నివేదికకు

జేపీసీ ఓకే

15-11 మెజారిటీతో ఆమోదం

» నేడు లోక్‌సభ స్పీకర్‌కు సమర్పణ

» జేపీసీ ఛైర్మన్ జగదంబికాపాల్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 29: కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించి.. పలు మార్పులు, సవరణలు ప్రతిపాదిస్తూ రూపొందించిన నివేదికకు సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) బుధవారం ఆమోదముద్ర వేసింది. 15-11 మెజారిటీతో కమిటీ సదరు రిపోర్టును అంగీకరించిందని బీజేపీ ఎంపీ, జేపీసీ ఛైర్మన్ జగదంబికాపాల్ విలేకరులకు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని.. బిల్లు చట్టరూపం దాలిస్తే వక్ఫ్ బోర్డు తన విధులను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వర్తించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ప్రయోజనాలు పొందేవారి జాబితాలో తొలిసారి పస్మాందా ముస్లింలు, పేదలు, మహిళలు, అనాథలను చేర్చామన్నారు. 655 పేజీలతో కూడిన తమ నివేదికను గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో బిల్లును ఆమోదిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. భావి కార్యాచరణను నిర్ణయించాల్సింది సభాపతి, పార్లమెంటేనని ఆయన స్పష్టంచేశారు. నిరుడు ఆగస్టు 8న ఏర్పాటైన ఈ జేపీసీ ఢిల్లీలో 38 సమావేశాలు నిర్వహించింది.కాగా.. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు మండిపడ్డాయి. కమిటీ పనితీరుపైన, అది ఆమోదించిన బిల్లుపైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, ఎంఐఎం సభ్యులు విమర్శలు గుప్పించారు. వారిలో కొందరు కమిటీకి అసమ్మతి నోట్‌ను సమర్పించారు. నివేదికలో దీనిని నమోదుచేయాల్సి ఉంటుంది. రిపోర్టు 655 పేజీలు ఉందని.. దానిని తమకు మంగళవారం సాయంత్రం పంపిణీ చేశారని.. బుధవారం సాయంత్రం 4 గంటల్లోపు అభిప్రాయం చెప్పాలన్నారని.. అన్ని పేజీలు చదివి నిరసన సిద్ధం చేసుకోవడానికి చాలా తక్కువ వ్యవధి ఇచ్చారని విపక్ష ఎంపీలు ఆక్షేపించారు. 'వక్ఫ్ బై యూజర్ (దీర్ఘకాలం వక్ఫ్ బోర్డు వినియోగంలో ఉండే ఆస్తి దానికే శాశ్వతంగా సంక్రమిస్తుంది. కోర్టుల్లో సవాల్ చేయడానికి వీల్లేదు)' అనే నిబంధనను తొలగించడాన్ని ఒవైసీ వ్యతిరేకించారు.

ఆ వ్యోమగాములను వెనక్కి తీసుకురండి

ఐఎస్ఎస్ నుంచి సునీత, విల్‌మోర్‌ను తీసుకురావాలని మస్క్‌కు ట్రంప్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జనవరి 29: అంతరిక్షంలో ఇరుక్కుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను తిరిగి భూమికి తీసుకురావాలని స్పేస్ ఎక్స్‌ను, దాని అధినేత ఎలాన్ మస్క్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. మస్క్ ఈ పనిని త్వరలోనే పూర్తి చేస్తారని ట్రంప్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ట్రంప్ పోస్ట్‌ను షేర్ చేస్తూ త్వరలోనే ఆ పనిని పూర్తి చేస్తామని ఎలాన్ మస్క్ తెలిపారు. వ్యోమగాములను అంతరిక్షం నుంచి తీసుకొచ్చే విషయంలో గత బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మస్క్ ఆరోపించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లో గతేడాది జూన్‌లో 8 రోజుల మిషన్‌లో భాగంగా అంతరిక్ష కేంద్రా(ఐఎస్ఎస్)నికి వెళ్లారు. అయితే వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురై అనుకున్న సమయానికి వారు తిరిగి రావడం వీలుకాలేదు. వారు 7 నెలలుగా అంతరిక్షంలోనే చిక్కుకుపోయి ఉన్నారు. ఏడునెలలుగా అంతరిక్షంలో చిక్కుకుపోవడంతో సునీత నడవడం మర్చిపోయినట్లు తెలుస్తోంది. సోమవారం ఆమె అంతరిక్షం నుంచే కొందరు విద్యార్థులతో మాట్లాడారు. "నేను చాలా కాలంగా అంతరిక్షంలో ఉంటున్నాను ఇక్కడ నడవడానికి లేదు. కూర్చోవడానికి, పడుకోవడానికి వీలులేదు. ప్రస్తుతం నేను నడవడాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను" అన్నారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి, దీపక్ రెడ్డి, అశోక్‌బాబు

వైసీపీ ప్రభుత్వంలో భూముల్ని ఉద్దేశపూర్వకంగా 22 ఏలో పెట్టారు

» టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఏకరవు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తమ భూముల్ని ఉద్దేశపూర్వకంగా 22 ఏ జాబితాలో చేర్చారని పలువురు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా జే కొత్తపల్లికి చెందిన కే రెడ్డప్ప విజ్ఞప్తి చేస్తూ... 'మేం భూమి కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. దానిని 22 ఏలో పెట్టారు. దానిని తీసివేయాలి' అని కోరారు. నూజివీడులో తమ తండ్రి కొనుగోలు చేసిన భూమిని 22 ఏలో పెట్టారని, దాన్ని తొలగించాలని ఒంగోలుకు చెందిన గోపీకృష్ణ విజ్ఞప్తి చేశారు. వాగు పోరంబోకు అయిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విజయనగరం జిల్లా ఆరికతోటకు చెందిన పి.రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం తొలగించిన పింఛన్ పునరుద్ధరించండి అని విజయవాడకు చెందిన దివ్యాంగుడు శ్రీను విజ్ఞప్తి చేశారు.

జగన్ మూర్ఖత్వం, విలాసాలతో రాష్ట్రం ధ్వంసం

» పాపాలను ప్రక్షాళన చేసుకోకుండా ఎదురు దాడా?: పార్థసారథి



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'జగన్ మూర్ఖత్వం, విలాసాలతో రాష్ట్రం ధ్వంసమయింది. దీనిపై బహిరంగ చర్చకు మేం సిద్ధం. తాను చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోకుండా వైసీపీ ఎదురు దాడి చేస్తోంది' అని మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికతో జగన్ సిగ్గుపడాలి. జగన్ తన సొంత పత్రికలో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, రూ.71 వేల కోట్ల వడ్డీలు రాష్ట్రంపై భారం వేసిన ఘనత జగన్‌రెడ్డిదే. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జగన్ ఏం సాధించారు? మా ప్రభుత్వం ఏం సాధించింది? అన్న దానిపై చర్చకు సిద్ధం. వందల సార్లు ఢిల్లీ వెళ్లిన జగన్ రాష్ట్రానికి ఏం సాధించారు? కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు నిధులు, బీపీసీఎల్ రిఫైనరీ, ఎన్టీపీసీ లాంటి భారీ పెట్టుబడులు సాధించింది. ఏడు నెలల కాలంలో రూ.6.33 లక్షల కోట్లు విలువ చేసే ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంది. ఇప్పటి వరకూ 4.1 లక్షల మందికి ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకున్నాం. ఇవేమీ అక్కర్లేదని జగన్ చెప్పగలరా?. జగన్ పాల్పడిన విధ్వంసంతో చితికిపోయిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చెబితే దానిని వైసీపీ వక్రీకరించి బురద జల్లుతోంది' అని మంత్రి అన్నారు.

వైసీపీ ఫేక్ ప్రపంచంలో బతుకుతోంది: డోలా



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఫేక్ ప్రపంచంలో బతుకుతోందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ వారిలా రూ.వెయ్యి పింఛనును నాలుగు విడతల్లో పెంచడం మాకు చేతకాదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్నా చెప్పిన మాట ప్రకారం వచ్చిన రోజే పింఛనును రూ.4 వేలు చేశాం. సూపర్ సిక్స్‌లో ప్రతి హామీని నెరవేరుస్తాం. సకల శాఖల మంత్రి అందినకాడికి దోచుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పెద్దిరెడ్డి పాపాలపై లోతైన దర్యాప్తు జరుగుతోంది' అని మంత్రి డోలా అన్నారు.

జగన్ పాపాలకు ఏటా 71 వేల కోట్లు చెల్లిస్తున్నాం: మంత్రి గొట్టిపాటి

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు టీడీపీ ప్రభుత్వానికి మోయరాని భారంగా తయారయ్యాయి. జగన్ పెట్టి వెళ్లిన అప్పులు, బకాయిలకు వడ్డీలు కలిపి ఏటా రూ.71 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది' అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వం మాకు వదిలి వెళ్లిన బకాయిలు మొత్తం రూ.లక్షా 40 వేల కోట్ల వరకూ ఉన్నాయి. నానా గడ్డీ కరిచి మేం వాటిని చెల్లిస్తున్నాం. ఈ ఏడు నెలల్లో రూ22 వేల కోట్లు చెల్లించాం. ఉమ్మడి రాష్ట్ర చరిత్రను కూడా కలిపి చూసుకొన్నా ఏ సీఎం ఇన్ని బకాయిలు పెట్టి దిగిపోలేదు' అని ఆయన అన్నారు.

టీచర్లపై కక్ష విద్యావ్యవస్థపై చూపారు

» దానికి నిదర్శనమే అసర్ నివేదిక: సీడ్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి

వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని, అందుకు కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదికే సాక్ష్యమని సీడ్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు ప్రభుత్వానికి సహకరించ లేదని, సీపీఎస్ రద్దు చేయాలని పదే పదే డిమాండ్ చేస్తున్నారని వారిపై ఆక్రోశంతో జీవో 117ను జగన్ అస్త్రంగా వాడాడన్నారు. జగన్ ఒక్క నెలలో కూడా టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగాన్ని గాడినపెట్టే కార్యక్రమం చేపట్టిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించిందని, జూనియర్ కాలేజీల్లో 700 మంది సేవలు పునరుద్ధరించిందని వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు.

2న ఢిల్లీలో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

వచ్చే నెల 2వ తేదీన సీఎం చంద్రబాబు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఎన్డీయే కూటమి తరఫున ఆయన ప్రచారం నిర్వహిస్తారు. ఢిల్లీలో తెలుగువారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆయన పర్యటిస్తారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన టీడీపీ ఎంపీల సమావేశంలో సీఎం చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనను ధ్రువీకరించారు. 1వ తేదీన చంద్రబాబు తూర్పు గోదావరి జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మరో చోట జరిగే కార్యక్రమానికి హాజరవుతారు.

రేపు టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షత ఈ నెల 31న జరగనుంది. పార్టీ సభ్యత నమోదు, సంస్థాగత ఎన్నికల కార్యక్రమం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై చర్చించే అవకాశం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పొలిట్‌బ్యూరో సభ్యులు దీనికి హాజరవుతారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్ బెయిల్‌పై విడుదల

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. నందిగం సురేశ్‌కు గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు.

నాడు



అమరావతి


అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో చేపట్టిన నిర్మాణాలు ఇవి. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయడంతో దట్టమైన అడవిలా మారిపోయిన ఈ ప్రాంతంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా చెట్లు పూర్తిగా తొలగించడంతో వాటి వెనకున్న నిర్మాణాలు ఇలా బయపడ్డాయి.

నేడు



పేదలకు పండగ

(మొదటి పేజీ తరువాయి)



ఆధారంగా దరఖాస్తు చేసుకున్న పేదలకు సగటున రూ.10 లక్షల పైనే ఫీజులు చెల్లించాలని అధికారులు అప్పట్లో డిమాండ్ నోటీసులు ఇచ్చారు. వీటిని చూసి పేదలు అల్లాడిపోయారు. తమ వద్ద అంత సొమ్మే ఉంటే సొంతంగా ఇంటిస్థలాలు కొనుక్కుంటామని, ఇదెక్కడి జీవో అంటూ.....ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వులు వద్దని అధికారులు వారించినా ప్రజల నుంచి ఫీజులు పిండుకోవచ్చన్న ఆశతో జగన్ సర్కారు ముందడుగు వేసింది. ఊహించినట్లే ఏ ఒక్క దరఖాస్తు ఆధారంగాను క్రమబద్ధీకరణ జరగలేదు. ఆ తర్వాత ఈ జీవోను సవరించి మార్పులు చేసినా ప్రజలు క్రమబద్ధీకరణకు ముందుకు రాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ విషయంపై పేదల కోణంలో ఆలోచించింది. పేదల అవసరాలకు తగినట్లుగా కనీసం 150 గజాల స్థలాన్ని ఉచితంగా క్రమబద్ధీకరించాలనుకుంటోంది. 150 నుంచి 300 గజాల వరకు భూమి ఉంటే, అందులో 15 శాతం బేసిక్ ధర వసూలు చేయడంతోపాటు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేయాలని తాజాగా నిర్ణయించింది. నిజానికి పేదలు నిర్మించుకునే గుడిసెలు, పెంకుటిల్లు, రేకుల ఇల్లు దాదాపుగా 150 గజాల విస్తీర్ణంలోనే ఉంటాయి. ప్రభుత్వం ఆ మేరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పడం పేదలకు మేలు చేసేదే అని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే, జగన్ జమానాలో అంటే, 2019, అక్టోబరు 15 నుంచి పేదలున్న భూములకు ఈ స్కీమ్‌ను వర్తింపచేస్తారు.

వాయిదాల్లో ఫీజుల చెల్లింపు

ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. సీఎఫ్ఎమ్ఎస్‌లో ఫీజులు చెల్లింపు ఉంటుందని రెవెన్యూశాఖ తెలిపింది. భూముల బేసిక్ విలువను జిల్లా కలెక్టర్ ఖరారు చేస్తారని పేర్కొంది.

150 గజాల వరకు ఉచితం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు (బీపీఎల్) ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు, గుడిసెలు వేసుకొని ఉంటే అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. పేదలు కాని వారు ఉన్నా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. వీటిపై గ్రామ వీఆర్వో, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసిల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా తహసిల్దార్ కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారు. ఇదిలాఉండగా, గతంలో జగన్ సర్కారు వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు,అసలు దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని రెవెన్యూశాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది.

ఇవీ అర్హతలు..

భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు ఇచ్చింది. అవీ 1) ఆధార్ కార్డు తప్పనిసరి. 2) గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.20 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల లోపు ఆదాయం ఉండాలి. 3) మెట్ట, మాగాణి కలిపి ఐదు ఎకరాలకు మించి ఉండకూడదు. 4) సొంతంగా కారు ఉంటే క్రమబద్ధీకరణకు అవకాశం లేదు. జీవనోపాధి కోసం సొంతంగా టాక్సీ కారు ఆటో, వ్యవసాయం కోసం ట్రాక్టర్ వంటివి ఉంటే అనుమతిస్తారు.

క్రమబద్ధీకరణ ఇలా...

పేదలకు

1. పేదలకు 150 గజాల వరకు ఉచితం. డీ పట్టా రూపంలో కన్వేయెన్స్ డీడ్‌లు ఇస్తారు. రెండేళ్ల తర్వాత ఆ భూమిపై శాశ్వత హక్కు వస్తుంది. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులూ ఉండవు.
2. 151-300 గజాల వరకు క్రమబద్ధీకరణ కోరితే భూమి విలువలో 15 శాతం ఫీజు, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.
3. 301-450 గజాల వరకు భూమి విలువలో 100 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 50 శాతం చెల్లించాలి.

అధిక ఆదాయవర్గాలు

1 పేదలు కాని వారు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొని ఉంటే, అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు.
2. 151-300 గజాల వరకు భూమి విలువలో 15 శాతం ఫీజు వసూలు చేస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పూర్తిగా భరించాలి.
3. 301-450 గజాల వరకు భూమి విలువపై 200 శాతం ఫీజును వసూలు చేస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజులు సాధారణం.
4.451 గజాలు, ఆపైన ఉండే భూములకు పేదలయినా,ధనికులయినా సరే భూమి విలువపై ఐదు రెట్లు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఫీజులు చెల్లించని పక్షంలో వారిని భూముల నుంచి ఖాళీ చేయించాలని రెవెన్యూశాఖ ఆదేశించింది.

జగన్ పత్రిక రోత రాతలపై సీఐడీ కదలాలి!

» ఏ అధికారులను ప్రభుత్వం బెదిరించిందో నిగ్గు తేల్చాలి

» తప్పుడు కథనాన్ని రాసినందుకు నోటీసులివ్వాలి

» ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి డిమాండ్

» మాజీ చైర్మన్, ఎండీలైన గౌతంరెడ్డి, మధుసూదనరెడ్డిపై కేసు పెడతామని వెల్లడి



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమోదైన ఫైబర్ నెట్ కేసులో అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి, కేసును నీరుగార్చే ప్రయత్నాన్ని చేస్తోందంటూ జగన్ రోత పత్రికలో వచ్చిన కథనాలపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీరెడ్డి విజయవాడలో డిమాండ్ చేశారు. తొలుత ఫైబర్‌నెట్‌కు సాంకేతిక సహకారాన్ని అందించిన టెర్రా సాఫ్ట్‌పై కేసును పెట్టి తర్వాత దానిలో ఎ-1గా చంద్రబాబు పేరును పెట్టడంలోనే పెద్దకుట్ర దాగి ఉందన్నారు. కేసు పెట్టాలని ఫైబర్ నెట్ చైర్మన్‌గా ఉన్న గౌతం రెడ్డి ఫిర్యాదు చేస్తే... ఎఫ్ఐఆర్‌లో ఆ సంస్థ మాజీ ఎండీ మధుసూదన రెడ్డి పేరు రాయడంలోనే చంద్రబాబును ఇరికించాలన్న కుట్ర బయటపడుతుందని ధ్వజమెత్తారు. దొంగ కేసులు పెట్టిన గౌతంరెడ్డి, మధుసూదనరెడ్డిపై క్రిమినల్ కేసును నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఫైబర్ నెట్‌లో జరిగిన అవినీతిపై కేసు పెట్టినందుకు అప్పటి ఐఏఎస్ అధికారులతో సహా.. మరికొందరని చంద్రబాబు వేధిస్తున్నారంటూ జగన్ పత్రికలో కథనాన్ని ప్రచురించడంపై సీఐడీ దర్యాప్తు చేయాలని, తప్పుడు కథనం ప్రచురించిన జగన్ పత్రిక యాజమాన్యానికి సీఐడీ నోటీసులు ఇవ్వాలన్నారు. సీఆర్డీఏ పూర్వ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌ను బెదించారంటూ కథనాలు ఒకవైపు రాస్తూనే.. మరోవైపు ఆ అధికారి చంద్రబాబు మనిషి అంటూ పేర్కొనడం ఏమిటంటూ నిలదీశారు. ఫైబర్‌నెట్ పూర్వ ఎండీ మధుసూదనరెడ్డి తన సొదరుడికి రూ.100 కోట్ల పనులు అప్పగించి సంస్థకు నష్టం చేశారని.. వాటన్నింటిపై అంతర్గత పరిశీలన జరుగుతుందని జీవీరెడ్డి తెలిపారు. ఈ అవకతవకలపై త్వరలోనే మధుసూదనరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఆయన వెల్లడించారు.

'పంచ' గ్రామాల సమస్యకు పరిష్కారం!

» సింహాచలం దేవస్థానానికి రూ.5,300 కోట్ల విలువైన 610 ఎకరాల భూమి బదలాయింపు

» జగన్ ప్రభుత్వం పట్టించుకోనందునే సమస్య

» రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని, పక్కన ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, గణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సింహాచలం పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం చూపనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెవెన్యూ, దేవదాయశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో పంచగ్రామాల సమస్యకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వివరించారు. "పంచ గ్రామాల్లో 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించాం. దీనికి ప్రత్యామ్నాయంగా రూ.5,300 కోట్ల విలువైన 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచలం దేవస్థానానికి ఇవ్వనున్నాం. ఈ నిర్ణయానికి సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు కూడా ఆమోదాన్ని తెలిపారు. ఈ సమస్యపై గత ప్రభుత్వం జారీ చేసిన జీవోపై పలువురు కోర్టుకు వెళ్లారు. ఈ కేసును కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి వివరించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు 338, 296 జీవోలు జారీ చేసిందని, ఈ జీవోల కింద విశాఖలో 70వేల మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి చెప్పారు. ఈ జీవోల ప్రకారం రెండేళ్లలో ఆ భూములపై లబ్ధిదారులకు సర్వ హక్కులు లభించేలా కన్వేయన్సు డీడ్ కూడా ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ జీవోలను పట్టించుకోలేద ని, లబ్ధిదారులకు న్యాయం చేయలేదని తెలిపారు. 2017లో జీవో జారీ చేసిన నేపథ్యం లో అప్పటి నుంచే ఈ భూములను క్రమబద్ధీకరించాలని, అప్పటి నుంచి రెండేళ్లలో కన్వేయన్సు డీడ్‌లు కూడా జారీ చేయాలని ప్రభు త్వం నిర్ణయించిందన్నారు. అదేవిధంగా రైతు లు సాగు చేసుకునే భూములు, కొన్ని ఖాళీ స్థలాలకు సంబంధించి కోర్టులో పలు కేసులు ఉన్నందున వాటిని కూడా దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. యూఎల్‌సీలోని అదనపు భూములు ఏవైనా ఆక్రమణకు గురైనా, వాటిని పీవోటీ చట్ట ప్రకారం పదేళ్లలో అలియనేట్ (స్వాధీనం) చేయాల్సి ఉందని, వీటికి కూడా కన్వేయన్సు డీడ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గాజువాక ఈనాం భూముల క్రమబద్ధీకరణకు 2018లో జీవో 301 జారీ చేయగా, 7వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే, ఈ ప్రక్రియ కూడా అపరిష్కృతంగా ఉందని, మరో జీవో జారీ చేయనున్నట్లు మంత్రి వివరించారు.

సమస్య తీరింది: పల్లా

గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సింహాచలం దేవస్థానానికి చెందిన 420 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. దీనిలో 12,149 ఇళ్లు నిర్మించారని చెప్పారు. ఈ ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు గతంలో 420 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు, క్రమబద్ధీకరణ ఫీజును కూడా దేవస్థానానికి ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. అయితే, ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి విలువకు తగిన భూమి ఇవ్వాలని కొందరు కోర్టుకెళ్లారని, ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్ణయంతో 420 ఎకరాల భూమికి బదులు సమాన రిజిస్ట్రేషన్ విలువతో 610 ఎకరాలు దేవస్థానానికి బదలాయించనున్నట్లు చెప్పారు. దీని రిజిస్ట్రేషన్ విలువ రూ.5,300 కోట్లు ఉంటుందని చెప్పారు. పెదగంట్యాడ, గాజువాక, గొల్లలపాలెం ప్రాంతాల్లో 610 ఎకరాలు దేవస్థానానికి ఇవ్వనున్నట్లు తెలిపారు.

పూర్తి పరిష్కారం: గంటా

వచ్చే ఎన్నికల్లోపు పంచగ్రామాల సమస్య పరిష్కరిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న పంచగ్రామాల సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు చక్కని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

ప్రచారానికే మేనమామ.. వాస్తవానికి కంసమామ!



» జగన్ పాలనలో ప్రభుత్వ విద్యావ్యవస్థ విధ్వంసం

» 'అసర్' నివేదికతో మరోసారి తేటతెల్లం: లోకేశ్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ విధ్వంసానికి గురైందనే విషయం జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో మరోసారి తేటతెల్లమైందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. జగన్ ప్రచారానికే మేనమామ.. వాస్తవానికి కంసమామ అనే సంగతి స్పష్టమైందని విమర్శించారు. జగన్ పబ్లిసిటీ కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేయడం తప్ప.. విద్యా ప్రమాణాలు పెంచేందుకు కనీస చర్యలు తీసుకోలేదని తాజా నివేదిక రుజువు చేసిందన్నా రు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మెరుగ్గా ఉన్న విద్యా ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదిక స్పష్టంగా వెల్లడించిందని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితికి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దిగజార్చడం, తగ్గిన హాజరు శాతం, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం.. ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేని దుస్థితికి తీసుకువచ్చారంటూ మంత్రి లోకేశ్ మండిపడ్డారు. విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు గత ఏడు నెలలుగా అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనేక మార్పులకు నాంది పలికామని వివరించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో పక్కాగా లెక్కలు తీయడం దగ్గర మొదలు పెట్టి మారుతున్న కాలానికి తగ్గట్టుగా పాఠ్య ప్రణాళిక సిద్ధం చేయడంపై దృష్టి పెట్టి పని చేస్తున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకుని ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్‌ఎడ్యుకేషన్‌ను రూపొందించనున్నట్లు లోకేశ్ తెలిపారు.

బాబు 'ఉక్కు' పట్టుదలతోనే ప్యాకేజీ



» ప్రైవేటీకరణ ప్రచారాన్ని కార్మికులు నమ్మొద్దు

» కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

» నేడు ఉక్కు మంత్రి కుమారస్వామితో కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ సందర్శన

న్యూఢిల్లీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సంకల్పం, సీఎం చంద్రబాబు పట్టుదలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ సాధ్యమైందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. కార్మికులు, ఉద్యోగులకు స్టీల్‌ప్లాంట్ పట్ల ఉన్న భావోద్వేగం, అనుబంధాన్ని తాము గుర్తించినందునే.. బాధ్యత తీసుకుని దాని పరిరక్షణకు పూనుకుని ప్యాకేజీ తీసుకొచ్చామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్థిక ప్యాకేజీ ప్రకటన తర్వాత తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ పర్యటనకు కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో కలిసి గురువారం తాను వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల 3 నెలల వేతన బకాయిలు చెల్లించే అంశంపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. ప్యాకేజీతో నష్టాలను పూడ్చుకుని ప్లాంట్ లాభాల బాట పట్టేలా యజమాన్యం, కార్మికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2030 నాటికి దేశంలో స్టీల్ ఉత్పత్తిని 300 మిలియన్ టన్నులకు పెంచాలన్నది ప్రధాని ఆలోచనగా చెప్పారు. కార్మికులు ప్రైవేటీకరణ ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్యాకేజీ ప్రకటనపై విమర్శలు చేస్తూ కొంతమంది అపోహలు సృష్టించడం, సంస్థ నష్టాల భర్తీకి మొత్తం సొమ్ము కేంద్రం భరించాలనడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.35 వేల కోట్లు బకాయిలు, రుణాలు ఉన్నాయని, విడతల వారీగా చెల్లించి ప్లాంట్‌ను అభివృద్ధిబాట పట్టేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ముందు ప్యాకేజీ ఇచ్చి, తమకు ఇస్తే.. లాభాల బాటన నడిపి అప్పుడు విలీనంపై ఆలోచిస్తామని సెయిల్ యజమాన్యం చెప్పిందన్నారు.

ఆర్థిక సాయమంతా అప్పులు తీర్చడానికే!

» జీతాల విషయంలో కేంద్రం జోక్యం చేసుకోదు

» స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులిచ్చే పరిస్థితి లేదు

» స్టీల్ కార్యదర్శి సందీప్ పాండ్రీ స్పష్టీకరణ

విశాఖపట్నం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు సమస్యకు ఓవైపు పరిష్కారం చూపిస్తూనే మరోవైపు పీటముడి వేస్తున్నారు. ఉద్యోగులను అయోమయంలోకి నెడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కేంద్రం రూ.1,650కోట్ల ఆర్థిక సాయం అందించింది. ఆ మొత్తాన్ని బ్యాంకుల అప్పులు తీర్చడానికే ఉపయోగించారు. ఆ తర్వాత కేంద్రం రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రక టించింది. దీనిని ఎలా ఉపయోగిస్తారనే అంశంపై ఉద్యోగ వర్గాల్లో సం దేహాలున్నాయి. ఆగస్టులో ప్రారంభిస్తామని ప్రకటించిన బ్లాస్ట్ ఫర్నేస్-3 కోసం అవసరమైన ముడిపదార్థాలను ఇప్పుడే కొనేయడానికి ఉన్న తాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి బీజేపీలో కొందరు నేతలు సహకరిస్తున్నారు. రూ.కోట్లల్లో వచ్చే కమీషన్లకు ఆశపడి కొందరు ఉన్నత స్థాయిలో చేస్తున్న అవినీతి ఇది. ఢిల్లీ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు వచ్చిన ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పాండ్రీ బుధవారం ప్లాంటులో ఎంపిక చేసిన 250 మంది యువ ఎగ్జిక్యూటివ్ అధికారులతో సమావేశమయ్యారు. ఉద్యోగ వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు ఆయన స్పష్టత ఇచ్చిన అంశాలివీ.. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్లు ప్యాకేజీని బ్యాంకుల రుణాలు, అప్పులు తీర్చడానికే ఉపయోగిస్తారు. గతంలో ఇచ్చిన రూ.1,650 కోట్లు కూడా ఈ ప్యాకేజీలో భాగమే. ఫర్నేసులను నడపాల్సిన బాధ్యత ఉద్యోగులదే. జీతాలు, బకాయిలు, ఇంక్రిమెంట్లలో ప్రభుత్వం జోక్యం చేసుకోదు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించే పరిస్థితి లేదు. సెయిల్‌లో విలీనం కుదరదు. ప్లాంటు ప్రైవేటీకరణ అంశం పార్లమెంటులో ఉంది. అక్కడ నిర్ణయం తీసుకోవాలి. ప్లాంటును లాభా ల్లోకి తీసుకురావడం అనేది ఉద్యోగులు, కార్మికుల బాధ్యత. అని పేర్కొన్నట్లు తెలిసింది.

భగవంతుడికే వదిలేస్తున్నా..!

ఈ వయసులో మేమిక పోరాడలేం

» ఎస్తేర్ అనూహ్య తండ్రి ప్రసాద్ నిర్వేదం

మచిలీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేవుడికే వదిలివేస్తున్నానని ఎస్తేర్ అనూహ్య తండ్రి జొనాథన్ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని శింగవరపు ఎస్తేర్ అనూహ్యపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు చంద్రభాన్ సనప్‌ను సుప్రీంకోర్టు మంగళవారం నిర్దోషిగా ప్రకటించడంపై బుధవారం ఆయన స్పందించారు. 'సనప్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం కూడా మాకు తెలీదు. కానీ.. ఏం చేద్దాం..? ఈ విషయాన్ని ఆ భగవంతుడికే వదిలేస్తున్నా. ఏం జరిగినా నా కుమార్తెను తీసుకురాలేను' అనిఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు, ప్రత్యేక మహిళా కోర్టు సనప్‌ను దోషిగా నిర్ధారించాయని, దీన్ని బాంబే హైకోర్టు కూడా సమర్థించిందని చెప్పారు. అయితే సుప్రీంకోర్టులో ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. 'ఇది పదేళ్ల కిందటి మాట.. అప్పట్లో కొంత న్యాయం జరిగిందని భావించాం. ఇప్పుడది పూర్తిగా మారిపోయింది. పదేళ్ల కిందట నేను ముంబైలో అనుభవించిన బాధాకరమైన రోజులు మళ్లీ గుర్తుకొస్తున్నాయి' అని అన్నారు. ముంబై పోలీసుల పనితీరును అభినందించిన ప్రసాద్.. కేసు విచారణలో భాగంగా సనప్ ఇంట్లో అనూహ్య ఐడీ కార్డు, ఇతర వస్తువులను కూడా గుర్తించారని.. ప్రత్యక్ష సాక్షులు లేకపోయినా.. పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి సరైన వ్యక్తినే పట్టుకున్నారని చెప్పారు. ప్రస్తుతం తన వయస్సు 70 ఏళ్లని, తన భార్యకు కూడా ఆరోగ్యం సహకరించడం లేదని, చివరి రోజుల్లో ప్రశాంతంగా గడపాలనుకుంటున్నామని చెప్పారు. ఇకపై కేసుని కొనసాగించాలని భావించడం లేదని స్పష్టం చేశారు. 23 ఏళ్ల అనూహ్య 2015లో ముంబైలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. సనప్‌పై ముంబై పోలీసులు అత్యాచారం, హత్య ఆరోపణలతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 2015లోనే ప్రత్యేక కోర్టు అతడికి మరణ శిక్ష విధించగా.. బాంబే హైకోర్టు సమర్థించింది. దీంతో సనప్ సుప్రీంను ఆశ్రయించాడు.

ముగిసిన తులసిబాబు పోలీసు కస్టడీ

» గుంటూరు జైలుకు తరలింపు

ఒంగోలు క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడు కామేపల్లి తులసిబాబు పోలీసు కస్టడీ ముగిసింది. ఈనెల 8న అతడిని అరెస్టు చేసిన పోలీసులు.. కోర్టు అనుమతితో కస్టడీలో విచారించిన సంగతి తెలిసిందే. 27వ తేదీ రాత్రి ఒంగోలుకు తీసుకొచ్చి విచారణ అనంతరం బుధవారం ఉదయం ఒంగోలు రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించారు. తర్వాత పటిష్ఠ భద్రత నడుమ గుంటూరుకు తరలించారు. అక్కడ సీఐడీ కోర్టులో న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టి జైలుకు తరలించారు.



గుంటూరులో రోడ్డు భద్రతా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు

ప్రతీ 400 రోడ్డు ప్రమాదాల్లో 250 మంది మృతి

» ఆయుధం కన్నా వాహనాన్ని జాగ్రత్తగా వాడాలి

» హెల్మెట్, సీట్ బెల్ట్ వాడనందుకే మరణాలు: పెమ్మసాని

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆయుధాన్ని వాడేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉంటామో వాహనాన్ని నడిపేటప్పుడూ అంతే జాగ్రత్తగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారమిక్కడ రవాణా శాఖ నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు-2025లో ఆయన పాల్గొన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు నడిపిన ద్విచక్రవాహనంపై హెల్మెట్ ధరించి పెమ్మసాని ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి 400 రోడ్డు ప్రమాదాల్లో 250 మందికిపైగా మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్లు, సీట్‌బెల్టులు వాడకపోవడం వల్లే 90 శాతం మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. హెల్మెట్ వాడితే జుట్టు ఊడిపోతుందనేది అపోహనని అన్నారు. రేసుల జోలికి వెళ్లవద్దని యువతను కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీశ్‌కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్, తెనాలి శ్రావణ్‌కుమార్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వాట్సాప్ పరిపాలన'

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. పాలనలో సరికొత్త ఆవిష్కారానికి శ్రీకారం చుడుతూ వాట్సాప్ పాలనను గురువారం నుంచి అందుబాటులోకి తెస్తోంది. దీని ద్వారా తొలి దశలో 161 ప్రభుత్వ సేవలు అందించనున్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్ తదితరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలో వాట్సాప్ పాలనను అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనిని మానవ వనరులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం అధికారికంగా ప్రారంభిస్తారని తెలిపారు. వాట్సాప్ ద్వారా పౌరులకు సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సమాచారం కూడా చేరవేస్తామని సీఎం చెప్పారు. ఈ సేవల కోసం ప్రభుత్వం అధికారికంగా వాట్సాప్ నంబరును ప్రజలకు అందుబాటులో ఉంచుతుందని తెలిపారు. ఆ నంబరుకు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) కూడా ఉంటుందన్నారు. ఈ నంబరు వన్‌స్టాప్ సెంటర్‌లా పనిచేస్తుందని అన్నారు. తొలి దశలో 161 సేవలు అందుబాటులోనికి వస్తాయని, క్రమేపీ ఈ సేవలు పెరుగుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు విస్తరిస్తూ.. పాలనలో మరింత సౌలభ్యాన్ని తీసుకువస్తామని చంద్రబాబు చెప్పారు.

సమాచారం సులువుగా ప్రజలకు

ముఖ్యమైన సమాచారాన్ని వాట్సాప్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేరవేస్తుంది. వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు, వరదలు, పిడుగులు పడే అవకాశం, అధిక ఎండవేడి వంటి వాటి సమాచారాన్ని వాట్సాప్ సందేశాల ద్వారా ప్రజలకు వేగంగా చేరుస్తుంది. విద్యాసంస్థలు ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు వీలుగా వాట్సాప్ సందేశాలను పంపుతుంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటే కూడా ఆ ప్రాంత వినియోగదారులకు సమాచారం చేరవేస్తారు. ఏదైనా ప్రాంతంలో అంటు వ్యాధులు ప్రబలుతుంటే ఆ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తారు. అలాగే ఆ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై సూచనలు కూడా పంపుతారు.



మెటాతో ఒప్పందం

కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా వినతిపత్రాలు పట్టుకు తిరిగినా ఫలితం ఉండటంలేదంటూ ప్రజల్లో అసహనం పెరుగుతోంది. ముఖ్యంగా రెవెన్యూ, మునిసిపల్, ఎండోమెంట్ సర్వీసులలో ఎదురయ్యే ఇబ్బందులతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నా వాటిని మెజారిటీ ప్రజలు నేరుగా వినియోగించుకోలేక పోతున్నారు. గతంలో ఆర్టీజీఎస్ సర్వేలో ప్రభుత్వ శాఖల సేవలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి వెల్లడైంది. ఇది గుర్తించిన ప్రభుత్వం నేరుగా ప్రజల ఫోన్ ద్వారానే సమస్యలు పరిష్కరించుకునే మార్గాన్ని గుర్తించింది. వాట్సాప్ ద్వారా సేవలు అందించాలని నిర్ణయించింది. దీని కోసం గతేడాది అక్టోబరు 22న వాట్సాప్ మాతృసంస్థ 'మెటా'తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో మంత్రి లోకేశ్ కీలక పాత్రను పోషించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే సంబంధిత కార్యాలయాల అధిపతులకు వాట్సాప్ చేరుస్తుంది. దాని స్టేటస్ ఏమిటో కూడా అర్జీదారులకు తెలియజేస్తుంది. దీనివల్ల రోజుల కొద్దీ ఫైళ్ల బూజుపట్టే పరిస్థితి లేకుండా వెనువెంటనే సమస్యలు పరిష్కారమవుతాయి. వాట్సప్ ద్వారా సేవలందిస్తే పాలనపై చాలా వరకు సంతృప్తి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

వినతుల స్వీకరణ కూడా..

ప్రజల నుంచి వాట్సాప్‌ద్వారా ప్రభుత్వం వినతులు స్వీకరిస్తుంది. అధికారికంగా ప్రకటించిన వాట్సాప్ నంబరుకు మెసేజ్ చేస్తే.. వారికి ఒక లింక్ వస్తుంది. అందులో సంబంధిత వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబరు ఎంటర్ చేసి వినతి ఏమిటో మెసేజ్ చేస్తే దానిని గుర్తిస్తూ ఒక రిఫరెన్సు నంబరు వస్తుంది. దాని ఆధారంగా ఆ వినతి ఎంత వరకూ పరిశీలన పూర్తయిందో.. ఎవరి పరిశీలనలో ఉందో.. ఎప్పుడు పరిష్కారమవుతుందో మెసేజ్ వస్తుంది. సమస్య పరిష్కారమఅయ్యాక కూడా దరఖాస్తుదారుకు ఆ సమాచారం చేరుతుంది. మురుగు కాలువలు, పారిశుధ్యం, రోడ్ల గుంతలు, వీధి దీపాలు, వాతావరణ కాలుష్యం తదితర అంశాలపై వాట్సాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చు.

ప్రభుత్వ పథకాల అమలుపైనా..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపైనా ప్రజలు వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చు. అర్హులైనవారికి పథకాలు అందకపోయినా ఫిర్యాదులు చేయవచ్చు. పథకాల లబ్ధి సమాచారం మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు. ప్రాంతాల వారీగా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల సమాచారాన్ని పౌరులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా పంపుతారు. అలాగే ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను కూడా వాట్సాప్ ద్వారా అందించనున్నారు.

టూరిజం, విద్యుత్ బిల్లులు, పన్నుల చెల్లింపు కూడా

రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సాప్ ద్వారా తెలుసుకుని అక్కడి టికెట్లు, వసతి సహా అన్ని సౌకర్యాలూ బుక్ చేసుకోవచ్చు. ఇక విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నులను అధికారిక వాట్సాప్ నంబర్ ద్వారా చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్సులు పొందవచ్చు. దేవాలయాల్లో దర్శనాల కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చు. విరాళాలు పంపవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు. ఇలా తొలి దశలో 161 సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక భూ రికార్డులు, ధ్రువీకరణ పత్రాల సమస్యలపై అధికారిక వాట్సాప్ నంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే సత్వర పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మునిసిపల్ శాఖకు సంబంధించి ఆస్తిపన్ను చెల్లింపులు, ట్రేడ్ లైసెన్సులు వంటివి ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉన్నాయి. వాటిలోనూ ఎదురవుతున్న సాంకేతిక సమస్యలకు వాట్సాప్ పాలన పరిష్కారాన్ని చూపుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

అసత్యాలు ప్రసారం చేస్తే పట్టాలపై పడుకోబెడతా



» గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం తీవ్ర వ్యాఖ్యలు

» ఓ న్యూస్ చానల్‌ను ఉద్దేశించే అన్నట్టు వివరణ

గుంతకల్లు, అమరావతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అసత్య కథనాలను తనపై ప్రసారం చేస్తున్నారని, వాటిని నిరూపించకపోతే రైలు పట్టాలపై పడుకోబెట్టడానికి కూడా వెనుకాడనంటూ అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంతకల్లు దోనిముక్కల రోడ్డులోని జగనన్న కాలనీని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా... తన గురించి ఓ న్యూస్ చానల్‌లో వచ్చిన ఓ కథనంపై ఆయన తీవ్ర స్వరంతో స్పందించారు. "నా అనుచరులు, బంధువులు ఎవరినో రైలు పట్టాలపై పడుకోబెట్టి ఆస్తులు రాయించుకున్నారని, స్థలాలను కబ్జా చేశారని, కర్ణాటక మద్యాన్ని తెచ్చి విక్రయిస్తున్నారని, ఇసుక దందా నడుపుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఎక్కడ అవినీతికి పాల్పడ్డానో న్యూస్ చానళ్లు, పత్రికలవారు నిరూపించాలి. తప్పు చేసినట్లు నిరూపిస్తే తల దించుకుంటాను. లేదంటే తాట తీస్తాను. నాకు ఏదీ లెక్కలేదు. అన్నీ చేసొచ్చినోడినే" అని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలను ఏపీయూడబ్ల్యూజే తీవ్రంగా ఖండించింది. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దీంతో జయరాం వివరణ ఇచ్చారు. తాను విలేకరులందరినీ అనలేదని, ఓ టీవీ చానల్‌ను ఉద్దేశించి అలా అన్నానని చెప్పారు.

ఎమ్మెల్యే గుమ్మనూరుకు టీడీపీ అధిష్ఠానం మందలింపు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను టీడీపీ అధిష్ఠానం మందలించింది. స్థానికంగా ఉండే పాత్రికేయులను ఎమ్మెల్యే దుర్భాషలాడారని, ఏబీఎన్‌తో పాటు మరికొన్ని చానల్స్ వార్తా కథనాలు ప్రసారం చేశాయి. దీంతో జయరాంకు ఫోన్ చేసిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్... పాత్రికేయులను దుర్భాషలాడటం టీడీపీ సంస్కృతి కాదని, ఇక ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యేకు చెప్పారు.

మార్చి లోపు లక్ష సీసీ కెమెరాలు: డీజీపీ

నరసరావుపేట లీగల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మార్చి లోపు లక్ష సీసీ కెమెరాలు అమర్చాలని ఉద్దేశంతో ముందడుగులు వేస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.



డాగ్ స్క్వాడ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పోలీసింగ్ విభాగాలను డీజీపీ ప్రారంభించారు. 'నేరం జరిగిన తర్వాత దాన్ని ఛేదించడం కాదు. నేరం చేయాలంటే నేరగాళ్లలో భయం ఏర్పడేలా నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలి. దేశంలోనే తొలిసారిగా డిజిటల్ బారికేడింగ్‌ను పల్నాడు జిల్లాలో పెట్టాం. సైబర్ నేరాలను నియంత్రించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం' అని డీజీపీ అన్నారు. కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్

» పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని మంత్రి లోకేశ్ అన్నారు. అసర్ నివేదికే దీనికి నిదర్శమన్నారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం పాఠశాల విద్యపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు పెరగాలంటే ఫ్యాన్సీ కార్యక్రమాలు చేపట్టడం కాదని.. ఫౌండేషన్, లిటరసీ, న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాల మదింపునకు తరగతి టీచర్‌తో చర్చించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం, క్రీడా సామాగ్రి ఉండాలన్నారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, కృతికా శుక్లా, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారం దిశగా..!

» దివ్యాంగురాలికి ఆగమేఘాలపై పెన్షన్

» రెండున్నరేళ్లుగా తీరని సమస్యకు పరిష్కారం

» 'అనంత' ఆదర్శ కాలనీలో పారిశుధ్య కల్పన

» సచివాలయాలకు సమస్యల జాబితా

విజయవాడ(మొగల్రాజపురం)/అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి నాగలక్ష్మి అనే మహిళ దివ్యాంగురాలైన కుమార్తె పద్మావతికి వస్తున్న పెన్షన్ రూ.3వేలు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయం మంత్రి లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే అధికారులతో మాట్లాడారు. బాధితురాలి ఇంటికి వెళ్లి వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ అధికారులతో పాటు బుధవారం వారి ఇంటికి వెళ్లి పెన్షన్ మంజూరు చేసినట్లు చెప్పారు. దీనిపై నాగలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్‌కు, 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు పెరిగాయని, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని అనంతపురం 32వ డివిజన్ ఆదర్శనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కొందరు ఫిర్యాదు చేశారు. పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.. ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ రెండు ఎక్స్‌కవేటర్లను బుధవారం కాలనీకి తీసుకువెళ్లి ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలను తొలగించి, శుభ్రం చేయించారు. డ్రైనేజీ కాలువల్లో పూడికను తొలగించారు. ఇదే డివిజన్‌లోని ఓబుళదేవ్‌నగర్, విద్యుత్‌నగర్, సెవెన్ హిల్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో గురువారం నుంచి పారిశుధ్య పనులు చేపడతామని ఎంహెచ్‌ఓ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతుల జాబితాను ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డి సచివాలయాలకు పంపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



పద్మావతి ఇంటి వద్ద అధికారులు, కార్పొరేటర్ ప్రసాద్

నా కుమార్తెకు పెన్షన్ ఇప్పించండి సర్..



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'లో ఓ తల్లి ఆవేదన

'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనం





అనంతపురం నగరంలోని 32వ డివిజన్ ఆదర్శ నగర్‌లో ఖాళీ స్థలంలో అపరిశుభ్రత.. తొలగించాక

తర్వాత చదువుదాం.. ముందు రీల్స్ చూద్దాం

» 14-16 ఏళ్ల వయసు వారికి స్మార్ట్‌ఫోన్లపై విస్తృత అవగాహన

» అసర్ నివేదికలో విస్తుగొలిపే అంశాలు

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా ప్రస్తుతం ఈ రెండే పిల్లల పాలిట ప్రధాన శత్రువులు. స్మార్ట్‌ఫోన్ వాడకం ఓ వ్యసనంలా మారిపోతోంది. దానినుంచి బయటపడలేక పిల్లలు చదువుల్లో వెనకబడిపోతున్నారు. సెల్‌ఫోన్ అతి వినియోగంతో ఆరోగ్యం పాడవడమే కాకుండా ఆలోచనా ధోరణి కూడా మారిపోతోంది. స్పెయిన్ లాంటి అనేక దేశాలు పిల్లలు స్మార్ట్‌ఫోన్లు వాడకుండా నిషేధం విధించి, సోషల్ మీడియాను దూరంగా ఉంచే యోచనలో ఉన్నాయి. మనదేశంలో చదువుకునే బాలబాలికలు స్మార్ట్ ఫోన్ల వాడకంపై ఓ అధ్యయనంలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. 14 నుంచి 16 ఏళ్ల వయసు వారిలో ప్రతి వంద మంది పిల్లలకు 90 మందికి స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా అందుబాటులో ఉన్నాయని జాతీయ సర్వే సంస్థ అసర్ తన నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బాలబాలికల్లో 93.8 శాతం మందికి అవి అందుబాటులో ఉన్నాయని తెలిపింది. స్మార్ట్‌ఫోన్లను చదువు కోసం కంటే సోషల్ మీడియా కోసం వాడేవారే అధికమని నివేదికలో పేర్కొన్నారు. ఫోన్లలో వివిధ యాప్‌లను వాడడంలో దేశవ్యాప్తంగా అబ్బాయిలే ముందు ఉండగా, ఏపీలో మాత్రం అమ్మాయిలే చురుగ్గా ఉన్నట్టు అసర్ వెల్లడించింది.

నివేదికలో అంశాలు

- దేశవ్యాప్తంగా 14 నుంచి 16 ఏళ్ల పిల్లలకు స్మార్ట్ ఫోన్ల వాడకంపై విస్తృత అవగాహన ఉంది. ఈ వయసులోని 90% అమ్మాయిలకు, అబ్బాయిలకు స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉన్నాయి.
- స్మార్ట్‌ఫోన్లు వాడకం తెలిసిన అబ్బాయిలు 85.5% మంది, అమ్మాయిలు 79.4% మంది ఉన్నారు.
- 14 ఏళ్ల వారిలో 27% మందికి, 16 ఏళ్లవారిలో 37.8% మంది సొంతంగా స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వీరిలో 36.2% మంది అబ్బాయిలు కాగా, అమ్మాయిల శాతం 26.9కి పరిమితమైంది.
- 14-16 ఏళ్ల వయసు పిల్లల్లో 82.2% మందికి స్మార్ట్‌ఫోన్ వాడకం తెలుసు. ఇందులో 57శాతం మంది చదువుపరమైన అవసరాల కోసం, 76% మంది సోషల్ మీడియా కోసం స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారు.
- సోషల్‌మీడియాలో మునిగితేలుతున్న వారిలో అబ్బాయిలు 78.8% కాగా, అమ్మాయిలు 73.4%.
- వీరిలో 62%మందికి అకౌంట్లు, ప్రొఫైల్స్ బ్లాక్ చేయడం లేదా రిపోర్ట్ చేయడం తెలుసు. 55.2 శాతం మందికి ప్రొఫైల్‌ను ప్రైవేట్‌గా ఉంచుకోవడం తెలుసు. 57.7% మందికి పాస్‌వర్డు మార్చడం తెలుసు.
- అలారం పెట్టడం, సమాచారం సెర్చ్ చేయడం, యూట్యూబ్‌లో వీడియో వెతికి షేర్ చేయడం లాంటి టాస్కులను అనేక రాష్ట్రాల్లో అమ్మాయిల కంటే అబ్బాయిలు త్వరగా పూర్తి చేశారు. ఏపీ, కర్ణాటక, కేరళల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే త్వరగా ఈ టాస్కులు పూర్తి చేశారు.
- ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 14 నుంచి 16 ఏళ్ల వయసు గల పిల్లల కుటుంబాల్లో 93.8% స్మార్ట్ ఫోన్లు కలిగిఉన్నాయి. ఇందులో 88.1% పిల్లలకు వాటి వాడకం తెలుసు. వీరిలో సొంతంగా ఫోన్లు ఉన్న పిల్లలు 46.9 శాతం ఉన్నారు.
- రాష్ట్రంలో స్మార్ట్‌ఫోన్లను చదువు కోసం వాడేవారి కంటే సోషల్ మీడియా కోసం వాడేవారే అధికం. చదువు కోసం 66.1శాతం మంది వాడుతుండగా, సోషల్ మీడియా వినియోగం కోసం వాడుతున్న వారు ఏకంగా 82.3 శాతం మంది ఉన్నారని అసర్ నివేదిక పేర్కొంది.

నూతన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

» రేపు ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ



అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా నియమితులయ్యారు. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్న ఆయనకు ప్రభుత్వం డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం (31న) పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన స్థానంలో గుప్తాను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీగా రిటైరవుతున్న తిరుమలరావు ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా కొనసాగనున్నారు. తొలి ఉత్తర్వుల్లో ఆర్టీసీ ఎండీగానూ ఆయన్ను రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మళ్లీ ఆ పోస్టులో ఏడాది పాటు నియమిస్తూ సీఎస్ వేరుగా ఆదేశాలిచ్చారు. వాస్తవానికి ఆర్టీసీ ఎండీగా ఉన్న తిరుమలరావు కూడా డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలే నిర్వహిస్తున్నారు. ఇప్పుడు గుప్తాకు కూడా అలాగే అదనపు బాధ్యతగా అప్పగించారు. కొత్త డీజీపీగా ఎంపికైన ఆయన 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీరుకు చెందిన ఆయన.. న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1993 డిసెంబరులో ఖమ్మం ఏఎస్పీగా తొలుత విధుల్లో చేరారు. తర్వాత మెదక్, పెద్దపల్లి ఏఎస్పీగా పనిచేశారు. కరీంనగర్, నల్లగొండ జిల్లాల అదపు ఎస్పీగా.. అనంతరం కృష్ణా, నల్లగొండ జిల్లాల ఎస్పీగా విధులు నిర్వహించారు. సమర్థ అధికారిగా పేరుతెచ్చుకున్న ఆయన.. గుంటూరు రేంజ్ ఐజీ, శాంతిభద్రతల ఐజీగానూ పనిచేశారు. అయితే జగన్ హయాంలో ఆయన్ను అప్రధాన పోస్టులకు పరిమితం చేశారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో నాటి డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డిని కేంద్ర ఎన్నికల కమిషన్ తొలగించి.. ఆయన స్థానంలో గుప్తాను డీజీపీగా నియమించింది. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన్ను విజిలెన్స్ డీజీగా బదిలీచేసింది. గుప్తా ఆగస్టు 31న ఆయన పదవీవిరమణ చేయాల్సి ఉంది.

పెద్దిరెడ్డి 'కబ్జా'పై సమగ్ర విచారణ

» సత్వరమే ప్రాథమిక నివేదిక ఇవ్వండి: పవన్

అమరావతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా మంగళంపేట అడవుల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబం భూములు ఆక్రమించారన్న సమాచారంపై సమగ్ర విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అటవీ భూమి ఏ మేరకు ఆక్రమించారు? అటవీ ప్రాంతాన్ని ఏ విధంగా ధ్వంసం చేశారో విచారణ చేపట్టాలని పీసీసీఎఫ్ చిరంజీవ్‌చౌదరిని ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని అటవీ భూముల వివరాలు, వాటి రికార్డులు పరిశీలించి ఆక్రమణను నిగ్గు తేల్చాలని స్పష్టం చేశారు. రికార్డులు తారుమారు చేశారా? చేసిన పక్షంలో అందుకు బాధ్యులెవరు? తద్వారా లబ్ధి పొందిందెవరో నివేదికలో పేర్కొన్నాలని ఆదేశించారు. సత్వరమే ప్రాథమిక నివేదిక ఇవ్వాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు.

అడవుల ఆక్రమణపై విచారణకు కమిటీ

చిత్తూరు జిల్లాలో అటవీ భూముల ఆక్రమణపై తనిఖీలు, విచారణ కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. చిత్తూరు కలెక్టర్, ఎస్పీ, అనంతపురం అటవీ సంరక్షణాధికారితో సంయుక్త కమిటీని నియమించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.